వారం
గత వారంరోజుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు, : fb.com/vaartha


Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-1-2025 మంగళవారం సంపుటి: 30 సంచిక: 353 పేజీలు: 12 వెల: 6.50

**ప్రియుడిని హతమార్చిన యువతికి మరణశిక్ష**

**శబరిమల అయ్యప్ప ఆలయం మూసివేత**

9లో



# ట్రంప్ 2.0 పట్టాభిషేకం

సోమవారం కేపిటల్ రొటుండాలో పదవీ ప్రమాణం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**అమెరికా 47వ అధ్యక్షుడుగా పదవీప్రమాణం చేసిన ట్రంప్**

**ఆయనతో ప్రమాణం చేయించిన సుప్రీం చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్**

**ఉపాధ్యక్షుడుగా జెడివాన్స్ ప్రమాణం**

**కేపిటల్ రొటుండాలో అట్టహాసంగా జరిగిన వేడుకకు హాజరైన మాజీ అధ్యక్షులు ఒబామా, క్లింటన్, జార్జిబుష్, ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్, మార్క్ జుకర్ బర్గ్ తదితరులు**

**భారత్ తరఫున హాజరైన విదేశాంగ మంత్రి జైశంకర్**

**వాషింగ్టన్‌డీసీ, జనవరి 20:** అమెరికా 47వ అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసారు. డొనాల్డ్‌జాన్ ట్రంప్ అనునేను అమెరికా రాజ్యాంగం పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తానని, రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలను పాటిస్తూ అమలుకు చిత్తశుద్ధితోపనిచేస్తానంటూ తన ప్రమాణాన్ని చదివారు. అమెరికా సుప్రీంకోర్టుప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్‌ట్రంప్ చేత ప్రమాణం చేయించారు. ఎడమచేతిని పైకి ఎత్తిచూపుతూ మరో చేతిని బైబిల్‌గ్రంథంపై ఉంచి ట్రంప్ తన ప్రమాణం కొనసాగించారు. 1861లో అబ్రహాం లింకన్‌ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలోపట్టుకుని ట్రంప్ ప్రమాణస్వీకారంచేసి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లుప్రకటించారు. అంతకు ముందు ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌చేత సుప్రీం చీఫ్‌జస్టిస్‌ప్రమాణంచేసారు. క్యాపిటల్ హిల్స్‌లోని రోటుండా హాలులో క్రిక్కిరిసిన అతిథులమధ్య డొనాల్డ్‌ట్రంప్‌ప్రమాణంచేసారు. ఈ కార్యక్రమంలో దేశవిదేశాలనుంచి వచ్చిన అతిథులు, సెనేటర్లు, రిపబ్లికన్ ప్రతినిధులు మొత్తం హాజరు అయ్యారు. అంతకుముందు సాంప్రదాయబద్ధంగా ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్‌ను కలిసేందుకు శ్వేతసౌధానికి వెళ్లిన ట్రంప్‌కు బైడెన్ దంపతులు సాదరస్వాగతం పలికారు. తేనీటివిందు అనంతరం వాషింగ్టన్‌డీసిలోని క్యాపిటల్‌హాల్ రోటుండా ఇండోర్‌కు ఒకే వాహనంలో బయలుదేరివెళ్లారు. ఈ కార్య క్రమంలో పలువురు మాజీ అధ్యక్షులు సతీసమేతంగా వచ్చారు. బిల్‌క్లింటన్, >>2

## అమెరికాలో ఇక స్వర్ణయుగం

**'అమెరికా ఫస్ట్' అనేదే మా నినాదం**

**అక్రమ వలసదారుల కట్టడికి మెక్సికో సరిహద్దులో అత్యవసర పరిస్థితి**

**అధ్యక్షునిగా తొలి ప్రసంగంలో ట్రంప్**

**వాషింగ్టన్‌డీసి, జనవరి 20:** అమెరికాలో స్వర్ణయుగం మళ్లీప్రారంభం అయిందని, చరిత్రలో ఈరోజు ఎంతో ముఖ్యమైనదని ప్రజలకు స్వేఛ్ఛావాయువులు పీల్చుకునే >>2



## భారీగా ఐపిఎస్‌ల బదలీ



**ఎపి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా ఆర్కే మీనా**

**శాంతిభద్రతల అదనపు డిజిగా ఎన్. మధుసూదన్ రెడ్డి**

**ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్‌గా పాల్‌రాజు, ఎపిఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా రాజ్‌కుమారి నియామకం**

**గ్రేహౌండ్స్ డిజిగా బాబ్జీ, ఎసిబి డైరెక్టర్‌గా రాజ్యలక్ష్మి**

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో భారీగా ఐపిఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బదలీ చేసింది. మొత్తం 27 మంది ఐపిఎస్ అధికారులను బదలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్‌గా ఆర్కే మీనాను నియమించారు. శాంతి భద్రతల అదనపు డిజిగా ఎన్. మధుసూధన్ రెడ్డిని బదలీ చేశారు. ఆపరేషన్స్ ఐజిపిగా సిహెచ్ శ్రీకాంత్‌ను నియమించారు. ఆయనకు టెక్నికల్ సర్వీసెస్ ఐజిపిగా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించను న్నారని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్‌గా పాలరాజు, ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా రాజ్ కుమారిని నియమించారు. ఇక తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు బాధ్యతలు చేపట్టను న్నారు. అలాగే కర్నూలు జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్, కాకినాడ ఎస్పీగా బింధు మాధవ్, ఎర్రచందనం యాంటి టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా సుబ్బారాయుడిని బదలీ చేశారు. మరోవైపు ఇటీవల తిరుపతిలో వైకుంఠ ద్వారా దర్శనం టోకెన్ల జారీ ముందు తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు వ్యక్తులు మరణించారు. ఈ నేపథ్యంలో తిరుపతి ఎస్పీపై బదలీ వేటు పడింది. దాంతో సుబ్బారాయుడుని ఎర్రచందనం >>2

# ఎపి అభివృద్ధికి కదలండి

**జ్యూరిచ్‌లోని ప్రవాసాంధ్రులను కోరిన సిఎం చంద్రబాబు**

**దావోస్ వెళ్తూ జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో దిగిన సిఎం బృందం**

**విమానాశ్రయంలోనే తెలంగాణ సిఎం, మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ**

**రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిపై చర్చించిన సిఎం చంద్రబాబు, సిఎం రేవంత్**



సోమవారం జ్యూరిచ్ విమానాశ్రయంలో తెలుగు ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేష్, శ్రీధర్‌బాబు తదితరులు

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** 'బ్రాండ్ ఎపి ప్రమోషన్' నినాదంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించేందుకు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరయ్యేం దుకు సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అధికారుల బృందం జ్యూరిచ్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్నారు. అక్కడ వారికి యూరప్ టిడిపి ఫోరం సభ్యులు, ప్రవాసాంధ్రులు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలోనే విమానాశ్ర యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలుసు కున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అక్కడ కాసేపు ముచ్చటించు కున్నారు. రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ పెట్టుబడులపై వారి మధ్య చర్చ జరిగింది. అనంతరం చంద్రబాబు బృందం విమానాశ్రయం నుంచి హిల్టర్ హోటల్‌కు చేరుకు న్నారు. అక్కడ భారత రాయబారి మృదుల్ కుమార్‌తో ఆయన భేటీ అయ్యారు. అనంతరం పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి బృందం సమావేశమైంది. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. తరువాత తెలుగు కమ్యూనిటీ వారితో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో సిఎం పాల్గొననున్నారు. నాలుగు రోజుల పాటు చంద్ర బాబు విదేశీ పర్యటన సాగనుంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సిఎం పర్యటన సాగనుంది. ఇప్పటికే ఏపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గూగుల్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తు న్నాయి. కాసేపట్లో పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం బృందం సమావేశం కానుంది. అనంతరం తెలుగువారితో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జ్యూరిచ్ నుంచి దావోస్‌కి చంద్రబాబు వెళ్లను న్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం, రాష్ట్రంలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను తెలియజేయడంతో పాటు ఇటీవల తీసుకొచ్చిన పాలసీలను దావోస్ వేదికగా తెలియజేయాలని సిఎం భావించారు. అందులో భాగంగానే వరుస సమావేశాల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. రోజుకు సుమారు పది సమావేశాల్లో మాట్లాడే విధంగా షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. సోమవారం రాత్రి పలువురు పారిశ్రామిక వేత్తలతో డిన్నర్ మీటింగ్‌లో సిఎం పాల్గొంటారు. తరువాత అర్సె ల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్‌తో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు. తొలి రోజు సమావేశాలు ముగించుకుని హోటల్‌కు చేరుకుం టారు. రెండవ రోజు సిఐఐ సెషన్ లో గ్రీన్ హైడ్రోజన్ అంశంపై చర్చలో పాల్గొం టారు. తరువాత సోలార్ ఇంపల్స్, >>2

## కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారి విస్తీర్ణం కుదింపు

**కేంద్రంతో అత్యవసర చర్చలు జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వం**

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధానికి అనుసంధానం చేసేందుకు నిర్దేశించిన రోడ్డును కుదించేందుకు జాతీయ రహదారి తాజాగా నిర్ణయం తీసుకుంది.ఒక రకంగా ఇది ఎపి ప్రభుత్వానికి షాక్ లాంటి నిర్ణయం. దీంతో ఎపి ప్రభుత్వం ఈ రహదారి విషయంలో కేంద్రంతో అత్యవసర సంప్రదింపులు ప్రారంభించింది. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిని 380.58 కి.మీ.మేర రెండు దశల్లో విస్తరించనున్నారు. ఇది నాలుగు, ఆరువరుసలుగా ఉంటుంది. తొలి దశలో కత్తిపూడి నుంచి మచిలీపట్నం బైపాస్ వరకు 229 కి.మీ. మేర విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించిన డిపిఆర్ తయారీకి సలహా సంస్థ ఎంపిక కోసం ఇటీవల టెండర్లు సైతం పిలిచారు. తర్వాత రెండో దశలో మచిలీపట్నం నుంచి ఒంగోలు (త్రోవగుంట) వరకూ హైవే నిర్మించేందుకు టెండర్లు పిలవాలని భావించారు. అయితే మొత్తం ఒకేసారి రహదారికి సంబంధించిన డిపిఆర్ సిద్ధం చేయించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ తాజాగా ఆదేశాలిచ్చింది. దీంతో ఇప్పటికేపిలిచిన టెండరులో మార్పులు చేసి మొత్తం 380.58 కి.మీ.ల డిపిఆర్‌కు టెండరు ఆహ్వానించారు. ఈ నెల 30 వరకు బిడ్ల దాఖలుకు గడువిచ్చారు.బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం హార్బర్ నుంచి గుంటూరు వరకు నిర్మించాల్సిన హైవేలో కోతపెట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రయత్నిస్తోంది. నిజాంపట్నం నుంచి గుంటూరు వద్ద కోల్‌కతా చెన్నై జాతీయరహదారి వరకు నిర్మించాల్సి ఉన్న హైవేను కేవలం చందోలు వద్ద కత్తిపూడి ఒంగోలు హైవేకి కలిపితే చాలనే కొత్త ప్రతిపాదన తెర మీదకు తెచ్చింది. దీనివల్ల నిజాంపట్నం హార్బర్‌కు కీలకమైన కోల్‌కతా చెన్నైహైవేతో లింక్ ఉండదు. అలాగే రాజధాని అమరావతికి అనుసం >>2




## గ్రామ పంచాయతీల క్లస్టర్ వ్యవస్థకు కొత్త రూపు

**ఆదాయ ప్రాతిపదికతో పాటు జనాభాను జోడించి కొత్త గ్రేడ్లు**

**సిఫార్సులు చేసేందుకు కమిటీ ఏర్పాటు: డిప్యూటీ సిఎం పవన్**

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రజలకు నిరంతరాయంగా పంచాయతీ సేవలు అందేలా చూస్తామని, ఇందుకోసం స్థిరమైన కార్యచరణతో వ్యవహరిస్తామని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషయంలో సిబ్బంది లేమి సమస్యను అధిగమించాలని పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానంలో మార్పులు చేపట్టి, కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. గతంలో పంచాయతీల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని మాత్రమే చేపట్టిన క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానానికి, నూతనంగా జనాభాను కూడా ప్రాతిపదికగా తీసుకొని పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లు విభజించాలని సూచించారు. సిబ్బంది నియామకం విషయంలో హెచ్చుతగ్గులు లేకుండా, గ్రామ పంచాయతీల్లో సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో గ్రామ పంచాయతీల క్లస్టర్ గ్రేడ్ల విభజనపై సమీక్ష చేశారు. ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా తక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభాగా ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో పాత క్లస్టర్ వ్యవస్థ వల్ల సిబ్బంది నియామకం విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులు ఈ సమీక్షలో ప్రస్తావనకు వచ్చాయి. గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని కొత్త క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానంలో సిబ్బందిని నియమించుకోవడంపై చర్చించారు.. ఈ విధంగా చేయడం వల్ల మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు అమలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీల ప్రాథమిక బాధ్యత అయిన తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య మెరుగుదలకు తగినంత మంది సిబ్బంది ఉంటారని, వీటిపై అధ్యయనం చేసి పంచాయతీల్లో పరిపాలన సులభతరం చేసేందుకు అవసరమైన సిఫార్సులు చేసేందుకు కమిటీ వేయాలని ఉపముఖ్యమంత్రి నిర్ణయించారు. కొత్త క్లస్టర్ల విభజన, గ్రేడ్ల కేటాయింపుపై ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. పంచాయతీరాజ్ శాఖ నుంచి నలుగురు ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటవుతుంది.. జిల్లా యూనిట్ ప్రాతిపదికన 26 జిల్లాల్లో ఉన్న పంచాయతీల ఆదాయం, జనాభాను ప్రాతిపదికగా తీసుకొని జిల్లా >>2



## సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

**మృతురాలి కుటుంబానికి 17 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు**

**కోల్‌కతా హత్యాచారం కేసులో నిందితునికి ఉరిశిక్ష వేయాలి పలువురి డిమాండ్**

**అత్యంత అరుదైన కేసు కానందున జీవిత ఖైదుమాత్రమే విధిస్తున్నట్లు తెలిపిన జడ్జి**

**కోల్‌కత్తా, జనవరి 20:** నగరంలోని రాధాగోవింద్‌కర్ ఆసుపత్రిలో గత ఏడాది జరిగిన పిజి వైద్యవిద్యార్థిని హత్యాచారం కేసులో ఏకైక నిందితుడు సివిక్ పోలీస్ వలంటీర్‌కు స్థానికకోర్టు జీవితఖైదు శిక్ష విధించింది. ఈకేసు అత్యంత అరుదైన కేసుల కేటగిరీలోకి రానందున నిందితుడికి మరణ >>2

# వాట్సప్ గవర్నెన్స్ త్వరలో అమలు



**జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సహా అన్నిరకాల సమాచారం వాట్సప్ ద్వారానే: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్**

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాల కనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందించనుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. ఇందులో భాగంగా వాట్సాప్ ద్వారా ప్రజలకు త్వరలోనే జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందే సదపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన కసరత్తులో భాగంగా ఈ నెలలోనే తెనాలీలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందే సేవలు కల్పించే ప్రక్రియపైన సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో >>2

## చట్ట సభలు మెరుగుపడాలి

**పాట్నాలో జరిగిన సమావేశంలో లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లా**

**పాట్నా, జనవరి20:** శాసనసభల సమావేశాల సంఖ్య తగ్గుతుండడం పట్ల లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయవలసిందిగా స్పీకర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. బిహార్‌లోని పాట్నాలో సోమవారం 85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం (ఎఐపిఒసి) ప్రారంభ సమావేశంలో బిర్లా ఆ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ శాసనసభ తన పూర్తి ఐదు సంవత్సరాల హయాంలో కేవలం 74 సమావేశాలు నిర్వహించిందనే వార్తల మధ్య ఆయన ఆ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.పార్లమెంట్,రాష్ట్ర శాసనసభల్లో అంతరాయాల యోచన పట్ల కూడా లోక్‌సభ స్పీకర్ ఆందోళన వ్యక్తం చేశారు. సభ గౌరవాన్ని >>2



సోమవారం జ్యూరిచ్‌లో స్విస్ రాయబారి మృదుల్ కుమార్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# ఎపి అభివృద్ధికి కదలండి

>> కోకోలా, వెల్ స్పన్, ఎల్ జి, క్లాస్ బర్గ్, సిస్కో, వాల్ మార్ట్ ఇంటర్ నేషనల్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ వంటి సంస్థల సీఈవోలతో, ఛైర్మన్ లతో రెండో రోజు ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. యుఎఈ ఎకానమీ మినిస్టర్ అబ్దుల్లా బిన్ తో సిఎం సమావేశం అవుతారు. అనంతరం వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహిస్తున్న ఎనర్జీ ట్రాన్సిషన్ వేర్ పబ్లిక్ పాలసీ మీట్స్ ప్రైవేట్ గోల్స్ అనే అంశంపై జరిగే చర్చలో పాల్గొంటారు. అనంతరం ది నెక్స్ట్ వేవ్ పైనీరింగ్ ది బ్లూ ఎకానమీ ఆఫ్ టుమారో అనే చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు. రెండో రోజు ఈ భేటీలతో పాటు వివిధ జాతీయ అంతర్జాతీయ మీడియా సంస్థల నిర్వహించే చర్చా కార్యక్రమాల్లో సిఎం పాల్గొంటారు. బ్లూమ్ బర్గ్ వంటి మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇవ్వడం ద్వారా ఏపీ పాలసీల గురించి వివరిస్తారు. మూడవ రోజు కూడా పలు బిజినెస్ టైకూన్‌లతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రోజుకు కనీసం పదిహేనైగా భేటీలు, సమావేశాల్లో చంద్రబాబు పాల్గొనబోతున్నారు. నాలుగవ రోజు ఉదయం దావోస్ నుంచి జ్యూరిచ్‌కు చేరుకుని అక్కడి నుంచి స్వదేశానికి రానున్నారు. షెడ్యూల్ మీటింగ్‌లతో పాటు... నాలుగు రోజుల సమయంలో పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో ప్రత్యేక సమావేశాల్లో ముఖ్యమంత్రి బృందం పాల్గొంటుంది. సిఎం బృందంలో పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్, ఐటీ మంత్రి నారా లోకేష్‌తో పాటు ఇంధన్ధ శాఖ అధికారులు, ఇడిబి అధికారులు ఉన్నారు. 4 రోజుల దావోస్ పర్యటనలో బ్రాండ్ ఏపీ ప్రమోషన్ తో పెట్టుబడులకు మార్గం సుగమం చేసేందుకు సిఎం చంద్రబాబు ఆలోచనలు చేస్తున్నారు. దెబ్బతిన్న బ్రాండ్ పునరుద్దరణతో మళ్లీ రాష్ట్రానికి దేశ, విదేశీ పెట్టుబడులు తెచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. దీని కై ఈ పర్యటన దోహదం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు జూరిచ్ విమానాశ్రయంలో తనకు స్వాగతం పలికిన యూరప్ కు చెందిన తెలుగువారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌వేదికగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. దావోస్‌లో తనకు స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అంటూ సీఎం ట్వీట్ చేశారు.

**స్విస్ పారిశ్రామికవేత్తలతో సమావేశమైన మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలో మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్ అండ్ డీ కేంద్రాలు, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ప్రెసిషన్ ఇన్‌స్ట్రుమెంట్స్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పారిశ్రామికవేత్తలను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల వాతావరణం ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. జ్యూరిచ్ లో స్విస్ పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమయ్యారు.

ఏపీలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏడు నెలల క్రితం ఏర్పాటైన ప్రగతిశీల ప్రభుత్వం ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ విధానాలను అమలు చేస్తోందని లోకేశ్ వెల్లడించారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు 15 రోజుల్లో అన్ని అనుమతులు మంజూరు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూలమైన వాతావరణం నెలకొని ఉంది. 1053 కిలోమీటర్ల సువిశాల తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, ఎయిర్ కనెక్టివిటీ, విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం నౌకాశ్రయాలు ఉన్నాయి. మరో ఏడాదిన్నరలో భోగాపురం, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు అందుబాటులోకి వస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ రంగాల్లో అధునాతన ఆవిష్కరణల కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో కలిసి స్విస్ పరిశోధనా సంస్థలు కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని మంత్రి లోకేశ్ అన్నారు. ఏపీలో స్టార్టప్‌లను ప్రోత్సహించడం, సాంకేతికత బదిలీ కోసం ఇన్నోవేషన్ హబ్, ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని లోకేశ్ పారిశ్రామికవేత్తలను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో స్విస్ వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ మోడల్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర యువత నైపుణ్యాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పుణేలో గెబిరిట్ తరహాలో ప్లంబింగ్ ల్యాబ్‌లు, శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని లోకేశ్ సూచించారు.

# పట్టుదలే అస్త్రంగా రెండోసారి పదవిలోకి ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 20:** ఎన్నో ఆటుపోట్లు ఓటమి చవిచూసినా మళ్లీ ఓడినచోటే గెలవాలన్న ధైర్యం, కసి పట్టుదలతో రిపబ్లికన్ నాయకుడు డొనాల్డ్‌ట్రంప్ రెండోసారి అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించారు. ప్రచారంలోనూ వివాదాస్పద ప్రకటనలు, హామీలతో ట్రంప్ నిరంతరం వార్తల్లో నిలిచారు. మెక్సికో, కెనడాలపై 25శాతం సుంకాలు, మెక్సికోతో సరిహద్దు గోడనిర్మాణం, అక్రమ వలసలను కట్టడిచేస్తానని, గ్రీన్‌లాండ్‌ను కొనేస్తామని, కెనడా అమెరికాలో 51వ రాష్ట్రంగాచేరాలని ఇలా విభిన్న ప్రకటనలతో నిత్యం వార్తల్లో నిలిచిన ట్రంప్ ఎట్టకేలకు భారీ మెజార్టీతో గెలిచి రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. మంచి వ్యాపార వేత్తగా కూడా పేరున్న డొనాల్డ్ ట్రంప్ కుటుంబ నేపథ్యంకూడా విచిత్రంగానే ఉంది. న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో మేరీ, ఫ్రెడ్రిక్ దంపతులకు 1946 జూన్ 14వతేదీ ట్రంప్ జన్మించారు. తండ్రి ఫ్రెడ్‌ట్రంప్ ఒక ప్రముఖ రియల్‌ఎస్టేట్ వ్యాపారి. ఐదుగురు సంతానంలో ట్రంప్ నాలుగో కుమారుడు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్‌స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ అండ్ కామర్స్‌లో 1968లో డిగ్రీ పూర్తి చేశారు. తండ్రికంపెనీలోనే 1971లో బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ అనంతరం ట్రంప్ ఆర్గనైజేషన్‌గాపేరుమార్చారు. హోటల్స్, రిసార్టులు, నిర్మాణ రంగం, క్యాసినోలు, గోల్ఫ్‌కోర్సుల్లో ప్రవేశించి తన వ్యాపార సామ్రాజ్యం దశదిశలా విస్తరించారు. 2004లో ది అప్రెంటిస్ రియాల్టీ టీవీషోతో దేశమొత్తం పాపులర్ అయిపోయారు. క్రీడాకారిణి మోడల్ ఇవానాజెలింకోవాను మొదట పెళ్లిచేసు కున్న ట్రంప్ 1990లో ఆమెకువిడాకులిచ్చారు. వీరికి డొనాల్డ్ జూనియర్, ఇవాంకా, ఎరిక్‌లు సంతానం. ఆ తర్వాత నటి మార్లా మార్పెల్స్‌ను 1993లో పెళ్లిచేసుకున్న ట్రంప్ 1999లో ఆమెతో విడాకులు తీసుకున్నారు. వీరి కుమార్తె టిఫానీట్రంప్. స్లోవేనియాకు చెందిన మాజీ మోడల్ మెలానియాను 2005లో ట్రంప్ పెళ్లాడారు. వీరికుమారుడు బారన్ విలియమ్‌ట్రంప్. కాగారిపబ్లికన్ పార్టీ తరపున 2016 అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసిన ట్రంప్ డెమొక్రటిక్ నేత హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించారు. 2020 ఎన్నికల్లో బైడెన్ చేతిలో ఓటమి చెందినట్రంప్ 2024లోనూ బరిలోకి దిగారు. డెమొక్రట్ అభ్యర్థి ఉపాధ్యక్షురాలు కమలా హేరిస్‌పై విజయం సాధించి రెండోసారి అధ్యక్షపీఠం కైవసంచేసుకున్నారు.

## దిగిపోతూ కూడా క్షమాభిక్ష ప్రసాదించిన బైడెన్

**వాషింగ్టన్, జనవరి 20:** అమెరికా అధ్యక్షపదవీకాలం మరికొన్ని గంటల్లో ముగుస్తున్న వేళ జోబైడెన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ట్రంప్ పదవిలోకి వచ్చిన తర్వాత బైడెన్ హయాంలోపనిచేసిన వారిపై కక్షసాధింపు చర్యలకు దిగకుండా పదవినుంచి దిగిపోయే కొన్ని గంటలముందుకూడా ఉత్తర్వులపై జోబైడెన్ సంతకాలుచేసారు. గతంలో ట్రంప్‌ను విమర్శించిన అమెరికా వైద్యనిపుణుడు డాక్టర్ ఆంటోని ఫౌచీ, రిటైర్డ్ జనరల్ మార్క్ మిల్లే తదితరులకు ముందస్తుక్షమాబిక్ష ఆదేశాలు జారీచేసారు. వీరితోపాటు క్యాపిటల్ హిల్ దాడులపై విచారణజరిపిన హౌస్‌కమిటీసభ్యులకూ ఉపశమనం కల్పించారు.

## అమెరికా అధ్యక్షుని వార్షిక వేతనం నాలుగు లక్షల డాలర్లు

**వాషింగ్టన్, జనవరి 20:** ప్రపంచదేశాలకు పెద్దన్నగా వ్యవహరిస్తున్న అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్‌ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఇపుడు ఆయన జీతభత్యాలపై అందరికీ ఉత్కంఠపెరిగింది సోషల్‌మీడియా సైట్లలోకూడా వీటిపైనే ఎక్కువ సెర్చింగ్‌కనిపిస్తోంది. అధ్యక్షుడికి వచ్చే జీతభత్యాలు, ఇతర అలవెన్సులపై నెట్టింట సెర్చింజన్లు ఖాళీలేకుండా కొనసాగుతున్నాయి. దేశాధ్యక్షపదవి చేపట్టిన వారికి ఏడాదికి నాలుగు లక్షల డాలర్లుగా జీతం వస్తుంది. అంటే భారత కరెన్సీలో 3.36 కోట్లరూపాయలు. నెలకు 28 లక్షలరూపాయలు వేతనంగా అధ్యక్షుడికి లభిస్తుంది. ఇతర ఖర్చులకింద మరో 50 వేల డాలర్లు అంటే రూ.42 లక్షలరూపాయలు లభిస్తుంది. ప్రయాణ ఖర్చులుగా లక్షడాలర్లు అంటే సుమారు 84 లక్షలు వినోదంకోసం 19 వేల డాలర్లు అంటే రూ.16 లక్షలు దేశాధ్యక్షుడికి చెల్లిస్తారు. అధ్యక్షుడుగా ఎన్నికైన వెంటనే కొత్త అధ్యక్షుడు వైట్‌హౌస్ అధికారిక నివాసంలోకి మారతారు. వారికి నచ్చినవిధంగా మార్చుకోడానికి ప్రభుత్వం లక్షడాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.84 లక్షలుచెల్లిస్తుంది. ఇక అధ్యక్షుడి అధికారిక పర్యటనలకోసం ఆధునిక సాంకేతికత, భద్రత కలిగిన ది బీస్ట్‌కారు, మెరైన్‌వన్ హెలికాప్టర్, ఎయిర్‌ఫోర్స్ వన్ విమానాన్ని ఉపయోగిస్తారు. దేశాధ్యక్షుడికి వంటచేసి పెట్టేందుకు ఎగ్జిక్యూటివ్ చెఫ్ ఉంటారు. ప్లంబర్, ఫ్లోరిస్ట్ హౌస్‌కీపింగ్ ఇలా ఇతర పనులుచేసేందుకు కనీసం 100 మందిసహాయకులు కూడా ఉంటారు. ఇక అధ్యక్షుడి పదవీకాలం పూర్తి అయినతర్వాత మాజీ అధ్యక్షులకు ఏటా 2.30 లక్షల డాలర్లు అంటే సుమారు రూ.1.93 కోట్లు భారత కరెన్సీలోచూస్తే ఆ మొత్తం డాలర్లలో చెల్లిస్తారు. అది కేవలం పింఛన్ మాత్రమే. దీనితోపాటు ఆరోగ్యబీమా, ప్రయాణసౌకర్యాలు లభిస్తాయి. ఇక దేశ ఉపాధ్యక్షుడుగా వచ్చిన నాయకుడికి 2.35 లక్షల డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.1.97 కోట్లు వార్షికవేతనం లభిస్తుంది.



అమెరికా అధ్యక్షుడిగా పదవీ విరమణ చేసిన బైడెన్ దంపతులతో కొత్త అధ్యక్షుడు ట్రంప్ దంపతులు

# అమెరికాలో ఇక స్వర్ణయుగం

>> రోజు వచ్చిందని రెండోసారి అధ్యక్షపదవిని చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికాను ప్రపంచ వేదికపై మరింత గొప్పదేశంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమని, అమెరికా ఫస్ట్ మా నినాదం ఎప్పటికీ మారదని ట్రంప్ అన్నారు. తాను ప్రమాణస్వీకారంచేసిన రోజును జాతీయ విముక్తిదినోత్సవంగా ఆయన అభివర్ణించారు. అనేక ఆటుపోట్లను తట్టుకుని మనదేశం నిలిచిందని, సమస్యలు సవాళ్లు అనేకం ఎదురయినా తట్టుకుని ధైర్యంగా నిలిచామన్నారు. నేటినుంచి అమెరికా ప్రజలకుస్వర్ణయుగం ప్రారంభం అయిందన్నారు. అమెరికా ఇక ప్రపంచదేశాలనుంచి మరింత గౌరవం పొందుతుందని, ముందు దక్షిణ అమెరికా సరిహద్దుల్లో జాతీయ అత్యవసరపరిస్థితిని ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు. అక్రమ వలసలను అరికట్టి పత్రాలు లేని అక్రమవలసదారులందరినీ ఎంతటి ఒత్తిడి వచ్చినా సరే వెనక్కి పంపించేస్తామని, పత్రాలు లేనివారు అమెరికాలో నేరస్తులేనని నేరస్తులకు ఇక్కడ తావులేదన్నారు. విద్యా ఆరోగ్యరంగాల్లో అనేకసంస్కరణలు తీసుకురావాల్సి ఉందన్నారు. నేరాలు చేస్తున్న ముఠాలతో మరింత కఠినంగా చర్యలుచేపడతామన్నారు. ఇకపై రెస్టారెంట్లలో కూడా కాల్పులు ఘటనలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలుంటాయన్నారు. ఉత్పత్తిరంగం ఏదేశ అభివృద్ధికి అయినా కీలకంగా ఉంటుందని, ద్రవ్యోల్బణంఅరికట్టి, దేశ ఆర్థికవృద్ధిని మరింతగాపెంపొందించేందుకు ఉత్పత్తి రంగానికి మరింత వెన్నుదన్నుగా నిలుస్తామని, దేశంలో విద్యుత్ వాహనాల తయారీని మరింతగా పెంచుతామన్నారు. ప్రతిభావంతులకు మాప్రోత్సాహం ఎంతోఉంటుందని, ఎలాంటి వివక్షను చూపించబోనన్నారు. పర్యావరక్షణ పరిరక్షణ, వాతావరణంలో కాలుష్యఉద్గారాలు తగ్గింపుదిశగానే వెళతామని, ఆదిశగానే విద్యుత్ వాహన తయారీని చేపడతామన్నారు. అలాగే దేశం ఇంధనరంగపరంగా స్వయంసమృద్ధిని సాధించడంతోపాటు ప్రపంచ దేశాలకు అమెరికానుంచే చమురు, సహజవాయు ఎగుమతులు సాగే విధంగా మన ప్రణాళికలు ఉంటాయని, దిగుమతులకు చెక్‌పెట్టి ఎగుమతిచేసే స్థాయికి మన ఉత్పత్తులు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా అందరూ ఊహించనట్లుగానే ప్రపంచస్థాయిలో పది ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల జారీని ప్రస్తావించారు. అమెరికాలో కేవలం రెండేరెండు వర్గాలు కొనసాగుతాయని, పురుషులు, మహిళలని మరో లింగ ఉత్పత్తికి తావులేదన్నారు. క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లను మహిళా క్రీడలకు అనుమతించనన్నారు. దేశరక్షణరంగాన్ని మరింతగా బలోపేతంచేస్తానని శపథంచేసారు. న్యాయవ్యవస్థనుప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, ఆ వ్యవస్థను కొందరు దుర్వినియోగంచేసారన్నారు. అందరికీ సమన్యాయం పద్ధతిలో సంస్కరణలు తెస్తామనిచెప్పారు. ఆ భగవంతుడు, అమెరికాప్రజల ఆశీస్సులతోనే ప్రాణాలనుంచి బయ టపడగలిగానని, అమెరికా ప్రజలమద్దతుతోమరిన్ని సంస్కరణల దిశగా దేశాన్ని ముందుకు నడిపిస్తానన్నారు. ముందు అత్యవసరంగా మెక్సికో సరిహద్దుల్లో జాతీయ అత్యవసరస్థితిని ప్రకటిస్తు న్నట్లు ట్రంప్ అన్నారు. ఆప్రాంతానికి సాయుధ బలగాలను పంపిస్తామని, కోర్టు విచారణ తేదీలకు వేచి ఉండాలని, ఆశ్రయం పొందేవారికి హుకుం జారీ అవుతుందని అన్నారు. అలాగే బర్త్‌రైట్ పౌరసత్వం కూడా రద్దుచేస్తామని, న్యాయనిపుణుల సలహాలు తీసుకుని ఈజన్మతహ పౌరసత్వ నిర్ధారణపై కార్యాచరణకు వెళతామన్నారు. ముందుగా అమెరికా పారిస్ వాతావరణ ఒప్పందంనుంచి బయటకు వస్తామన్నారు. విదేశీ ఉత్పత్తులపై సుంకాలు తప్పవని అమెరికా పాలసీ ప్రకారం కేవలం రెండేరెండు లింగనిష్పత్తులకు గుర్తింపు ఉంటుందన్నారు. చమురు సహజవాయు ఉత్పత్తికిగాను జాతీయ ఇందన అత్యవసర స్థితిని కూడా అమలులోకి తెస్తామన్నారు. ఇప్పటికిప్పుడు గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్‌ఆఫ్ అమెరికాగా నామకరణంచేస్తామని స్పష్టంచేసారు. అదేవిధంగా పనామాకాలువ, గ్రీన్‌ల్యాండ్‌లను వెనక్కితీసుకుంటామని ప్రకటించారు. అభివృద్ధిలో అమెరికా క్షీణతకు ఇక కాలం చెల్లిందని అతివాద, అవినీతి వ్యవస్థలను పూర్తిగాప్రక్షాళన చేసి అభివృద్ధిలో ముందుకు నడిపిస్తామని ట్రంప్ ప్రకటించారు.

## ట్రంప్ 2.0 పట్టాభిషేకం

>> హిల్లరీ క్లింటన్, జార్జిడబ్ల్యుబుష్, లారాబుష్ తదితరులు హాజరుకాగా బరాక్ ఒబామా హాజరయినప్పటికీ మిషెల్లీ ఒబామా మాత్రం ఈ వేడుకకు రావడంలేదని ముందేప్రకటించారు. ప్రమాణస్వీకారం సందర్భంగా ముందుగా సంగీతకచేరిలు, మిలిటరీ పెరేడ్‌లు, ట్రంప్ మద్దతుదారుల ర్యాలీలతో క్యాపిటల్‌హిల్స్ మార్గాలన్నీనిండిపోయాయి.

# క్లస్టర్ వ్యవస్థకు కొత్త రూపు

>> కలెక్టర్లు ఇచ్చే నివేదికలను రాష్ట్ర కమిటీ పరిశీలించిన తర్వాత పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లను ప్రభుత్వానికి నివేదిస్తుంది. గ్రేడ్ల ఆధారంగా పంచాయతీ, సచివాలయ సిబ్బందిని పంపిణీ చేయడానికి మార్గదర్శకాలను రూపొందిస్తారు. గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని కొత్త క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానంలో సిబ్బందిని నియమించుకోవడంపై పవన్ అధికారులతో చర్చించారు. ఈ విధంగా చేయడం వల్ల మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు అమలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీల ప్రాథమిక బాధ్యత అయిన తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుధ్య మెరుగుదలకు తగినంత మంది సిబ్బంది ఉంటారన్నారు. వీటిపై అధ్యయనం చేసి పంచాయతీల్లో పరిపాలన సులభతరం చేసేందుకు అవసరమైన సిఫార్సులు చేసేందుకు కమిటీ వేయాలని పవన్ నిర్ణయించారు. కొత్త క్లస్టర్ల విభజన, గ్రేడ్ల కేటాయింపుపై ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. పంచాయతీల్లో సిబ్బంది నియామకం విషయంలో హెచ్చుతగ్గులు లేకుండా, సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందేలా చూడాలని అధికారులకు పవన్ ఆదేశాలు ఇచ్చారు. ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా తక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభాగా ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో పాత క్లస్టర్ వ్యవస్థ వల్ల సిబ్బంది నియామకం విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులపై పవన్ చర్చించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## జాతీయ రహదారి విస్తీర్ణం కుదింపు

>> ధానం కూడా ఉండదు. రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లు, నౌకాశ్రయాలను జాతీయ రహదారులతో అనుసంధానించే ప్రాజెక్టులను ఎన్‌హెచ్‌ఏఐ మంజూరుచేస్తోంది. ఇందులోభాగంగానే నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి చందోలు, నారాకోడూరు మీదుగా గుంటూరు శివారులో ఉన్న బుడంపాడు వద్ద కోల్‌కతా చెన్నై జాతీయరహదారి వరకు మొత్తం 53 కి.మీ. హైవే నిర్మించేందుకు సంబంధిత అధికారులు ఎలైన్‌మెంట్‌ను సైతం సిద్ధం చేశారు. ఇది నాలుగు వరుసల హైవేగా ఉంటుంది. ఇంతలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) కొత్త మెలికపెట్టింది. హార్బర్ నుంచి విబీలకు కలపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందుకోసం దగ్గరలో ఉన్న కత్తిపూడి ఒంగోలు ఎన్‌హెచ్‌లోని చందోలు వరకు 18 కి.మీ. హైవే నిర్మిస్తే చాలని సూచించింది. దీంతో ప్రస్తుతం ఈ ఎలైన్‌మెంట్ ప్రతిపాదననూ సైతం అధికారులు సిద్ధం చేశారు. అయితే ఈ రెండింటిలో ఎన్‌హెచ్‌ఏఐ దేనికి మొగ్గుచూపుతుందనేది కీలకం కానుంది.

## ఐపిఎస్‌ల బదలీ

>> యాంటి టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా నియమించారు. గ్రేహౌండ్స్ డిజిగా బాబ్జీ, ఎసిబి డైరెక్టర్‌గా రాజ్యలక్ష్మి, అల్లూరి సీతారామరాజు అదనపు ఎస్పీగా ధీరజ్, సిఐడి ఎస్పీగా శ్రీదేవిరావు చక్రవర్తి, లీగల్, హ్యూమన్‌రైట్స్ కో ఆర్డినేషన్ ఎస్పీగా సుబ్బారెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీగా రామ్మోహన్‌రావు, స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ డీఐజీగా అంబురాజన్‌లను బదిలీ చేశారు.

## ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న బడే చొక్కారావు

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకెర్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత పార్టీ తెలంగాణ కార్యదర్శి బడే చొక్కారావు తప్పించుకున్నట్లు ఛత్తీస్‌ఘడ్‌తో పాటు తెలంగాణ పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది. మొదట ఈ ఎన్‌కౌంటర్‌లో చొక్కారావు మ రణించినట్లు వార్తలు రావడం తెలిసిందే. అయితే దీనిని తెలంగాణ పోలీసులు ధృవీకరించకపోగా ఛత్తీస్‌ఘడ్ పోలీసులు మౌనం వహించారు. కాగా ఈ ఎన్‌కౌంటర్‌లో చొక్కారావు పోలీసులకు దొరకకుండా తప్పించుకున్నట్లు తాజాగా ఇరు రాష్ట్రాల పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో చొక్కారావు మరణించాడన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది.

# చట్ట సభలు మెరుగుపడాలి

>> పరిరక్షించేందుకు మార్గదర్శక సూత్రాలు రూపొందించవలసిందిగా రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. స్టాండింగ్ కమిటీలు మినీ పార్లమెంట్‌లు. వాటి పని తీరును పటిష్ఠం చేయవలసిన ఆవశ్యకత ఉంద్ది అని ఓమ్ బిర్లా సూచించారు. 85వ ఎఐపిఒసికి రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, దేశం అంతటి నుంచి రాష్ట్ర శాసనసభల అధిపతులు హాజరయ్యారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సోమవారం ఉదయం ఓమ్ బిర్లాతో భేటీ అయ్యారు. కానీ '75వ రాజ్యాంగ వార్షికోత్సవం' రాజ్యాంగ విలువల పటిష్ఠతలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల కృషి అంశంపై రెండు రోజుల సమ్మేళనానికి ఆయన విచిత్రంగా గైర్‌హాజరయ్యారు. పిఆర్‌ఎస్ లెజిస్లేటివ్ అధ్యయనం ప్రకారం, కాలపరిమితి ముగుస్తున్న ఢిల్లీ శాసనసభ తన ఐదు సంవత్సరాల హయాంలో 74 సమావేశాలు నిర్వహించింది. అంటే సగటున ఏడాదికి 15 రోజుల సమావేశం అయిందని చెప్పారు. సభ సమావేశమైన రోజుల్లో అది సగటున మూడు గంటలు భేటీ అయింది. సభ తన హయాంలో కేవలం 14 బిల్లులు ఆమోదించింది. పూర్తి కాలం పనిచేసిన గత ఏ అసెంబ్లీకైనా అది అత్యల్ప సంఖ్య అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పాట్నాలో జరుగుతున్న 85వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఎఐపిఓసి)లో తెలంగాణ శాసన బృందంపాల్గొంటున్నది. అఖిల భారత సభాపతుల సమ్మేళనంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి.నరసింహాచార్యులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనం ప్రారంభానికి ముందు లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ శాసన బృందాలు మర్యాదపూర్వకంగా కలిశాయి.

# సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

>> శిక్ష వర్తించదని న్యాయమూర్తి అనిర్బన్‌దాస్ అన్నారు. అలాగే పశ్చిమబెంగాల్‌ప్రభుత్వం రూ.17 లక్షలరూపాయలు మృతురాలి తల్లితండ్రులకు ఇవ్వాలని ఆదేశించింది. అయితే కోర్టురూమ్‌లోనే ఉన్న ఆమె తల్లితండ్రులు ముకుళిత హస్తాలతో తమకు పరిహారం వద్దని న్యాయం కావాలని కోరారు. చట్టప్రకారం ఉన్న అంశాలను పరిగణనలోనికి తీసుకుని ఆదేశాలిచ్చామని ఎప్పుడు అవసరం అనిపించినా ఆ సొమ్ము వాడుకోవచ్చన్నారు. అయితే జడ్జి మరోవివరణ ఇస్తూ మృతురాలి కుటుంబం ఈ మొత్తం తమ కుమార్తె హత్యాచారానికి పరిహారంగా ఇస్తున్న సొమ్ముగా భావించవద్దనిసూచించారు. భారతీయ న్యాయసంహిత పరిధిలో అత్యాచారం హత్య సెక్షన్లకింద విచారణజరిపి శిక్ష విధించారు. అంతకుముందు కోర్టులో రాయ్ తరపున తుదివిడత వాదనలు విన్నారు. తానీ నేరం చేయలేదని, తనను ఈ కేసులో ఇరికించారని, అనేక అంశాలను, సాక్ష్యాలను ధ్వంసంచేసారని, తానేకనుక ఈ నేరం చేసి ఉన్నట్లయితే నా రుద్రాక్షమాల తెగిపోయి ఉండేదని, నన్ను ఇరికించింది లేనిదీ మీరే నిర్ణయించాలని కోర్టుకు రాయ్ నివేదించాడు. తనతో బలవంతంగా సంతకాలుచేయించుకున్నారని కూడా చెప్పాడు. నాకు వచ్చిన సాక్ష్యాధారాల ఆధారంగా నేను ఇపుడు తీర్పు ఇవ్వడానికి సిద్ధం అయ్యానని, నేను మీ వాదనను మూడు గంటలపాటు విన్నానని, మీన్యాయవాది మీకేసును వాదించారని, మీపై అభియోగాలు రుజువయ్యాయని, శిక్షపై మీ అభిప్రాయం మాత్రమే నేను వింటానని న్యాయమూర్తి అన్నారు. కోల్‌కత్తా పోలీసులనుంచి కేసును స్వీకరించి దర్యాప్తుచేపట్టిన తర్వాత సిబిఐ రాయ్‌కు మరణశిక్ష విధించాలని డిమాండ్‌చేసింది. ఆసుపత్రికి తరచూ వస్తూపోతూ ఉండే సివిక్ వలంటీర్ అని సిబిఐ తరపున వాదించిన న్యాయవాది తన వాదనల్లో ఇది అత్యంత అరుదైన కేసుల్లోనే అరుదైనదని అందువల్ల రాయ్‌కి మరణశిక్ష వేయాలనికోరారు. డాక్టర్లు, సిబ్బంది, మానవహక్కుల సంఘాల ప్రతినిదులు ఇతర అనేకమంది అన్నివర్గాలకు చెందినవారితో కోర్టు ఆవరణ మొత్తం నిండిపోయింది. పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటుచేసారు. కోర్టు హాలులో మృతురాలి తల్లితండ్రులు మాట్లాడుతూ సిబిఐ దర్యాప్తుతో తమకు సంతృప్తిలేదని మరికొందరు కుట్రదారులను వెలికితీయలేదని న్యాయంముందుకు వారుసైతం రావాల్సిఉందేనని అన్నారు. కేవలం ఒకే ఒక్క వ్యక్తి ఈసంఘటనలో పాల్గొనలేదని సిబిఐ ఇతరులను పట్టుకోవడంలో విఫలం అయిందని అన్నారు. ఇలాంటి నేరస్తులకు జీవించే హక్కులేదని, అందువల్లనే ఇలాంటినేరాలు సొసైటీలో పునరావృతం కాకుండా మనం నిరోధించాలని మృతురాలి తల్లి అన్నారు. 34 ఏళ్ల పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ ఆసుపత్రిలోని సెమినార్ హాలులో విగత జీవిగా అర్థనగ్నంగా పడింది. ఈసంఘటన దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. వైద్యులు, సిబ్బంది నిరవధిక సమ్మెలకు సైతం దిగారు. కాగా ఈకేసులో అరెస్టు అయిన కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పాండే, కళాశాల వద్ద ఉన్న పోలీస్ ఎస్‌హెచ్‌ఒ అభిజిత్‌మోండల్‌ను పోలీసులు అరెస్టుచేసినా తర్వాత 90 రోజుల్లోపు ఛార్జిషీటు దాఖలుచేయకపోవడంతో వారికి బెయిల్ మంజూరయింది.

# వాట్సప్ గవర్నెన్స్ త్వరలో అమలు

>> సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు పౌరులకు మరింత సులభతరం చేయాలనే సదాశయంతో ముఖ్యమంత్రి వాట్సాప్ గవర్నెన్స్ సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆర్టీజీఎస్ అధికారులను సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా జనన మరణ ధృవీకరణ పత్రాల సేవలు కల్పించడమనేది కీలకమైందని, దీనికి సంబంధించిన పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సేవలను పగడ్బందీగా ప్రజలకు అందిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెనాలీలో ముందుగా దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించాలని సూచించారు. అక్కడ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికంగా ఎదురయ్యే ఇబ్బందులను సునిశితంగా పరిశీలించి అధ్యయనం చేసి తదనుగుణంగా ఈ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. దీనికి కావాల్సిన అన్ని విధాల సహకారాన్ని పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, పురపాలక శాఖలు ఆర్టీజీఎస్ అధికారులకు అందించాలని సూచించారు. ఆర్టీజీ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలు చేయడానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ ఆర్టీజీఎస్ సిద్ధం చేసిందన్నారు. జనన మరణ ధృవీకరణ పత్రాలు వాట్సాప్ ద్వారా జారీ చేసే ప్రక్రియ కూడా క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెలలోనే తెనాలీ మండలంలోని మొత్తం పంచాయతీల్లో, తెనాలీ పురపాలక సంఘంలో వాట్సాప్ ద్వారా జనన మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించిన సాంకేతిక ప్రక్రియను ప్రయోగాత్మకంగా పరిశీలించి చూస్తామన్నారు. వాట్సాప్ ద్వారా ఈ సర్టిఫికెట్ల జారీ కొరకు ఆర్టీజీఎస్ ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ పేరిట ఒక పోర్టల్‌ను రూపొందించామన్నారు. ఇందులో జనన మరణ నమోదు డేటా మొత్తం అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. డాటా లేక్ ఏర్పాటు పనులు కూడా చురుగ్గా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒకసారి జనన, మరణ ధృవీకరణ పత్రం జనరేట్ అయితే ఆ వెంటనే సంబంధిత పౌరుల వాట్సాప్‌కు సందేశం పంపడంతో పాటు, ఆ వెంటనే వాట్సాప్ ద్వారానే ఈ పత్రాలు డౌనులోడు చేసుకునే సదుపాయం కూడా కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పురపాలక శాఖ కార్యదర్శి కె. కన్నబాబు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి, పంచాయతీరాజ్ శాఖ సంచాలకులు కృష్ణ తేజ, గ్రామవార్డు సచివాలయ శాఖ సంచాలకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 21-01-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
సప్తమి మ.12.40
చిత్త రా.11.36
వర్జ్యం : ఉ.5.53-7.41
దు.ఉ.9.04-9.49, 2) రా.10.34-11.19
శుభసమయం: ఉ.7.45-8.15
సా.4.50-5.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** గృహప్రవేశాది శుభకార్యాలను అనుకున్న విధంగా పూర్తి చేయగలుగుతారు. వస్తులాభం.

**వృషభం:** ఆదాయ వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. పుణ్య క్షేత్రాలను సందర్శిస్తారు. మిత్రుల కలయిక.

**మిథునం:** ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. విదేశీ పర్యటనలు.

**కర్కాటకం :** కొన్ని సందర్భాలలో అభిప్రాయ భేదాలు చోటు చేసుకునే సూచనలున్నాయి. ధనలాభం.

**సింహం:** అన్యభాషలు నేర్చుకోవాలనుకునే మీ అభిలాష ప్రయత్నం మీద సానుకూల పడుతుంది.

**కన్య :** వృథా ఖర్చులను సూచిస్తోంది. సేవా కార్యక్రమాలలో పాలుపంచుకుంటారు. వాహన సౌఖ్యం

**తుల :** క్లిష్టతరమైన కార్యక్రమాలు మినహా తేలికగా సాగేటటువంటి వ్యవహారాల పైన దృష్టిని సారిస్తారు.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల సహాయ సహకారాలను సంపూర్ణంగా అందుకుంటారు. విందు, వినోదాలు.

**ధనుస్సు:** వ్యాపారస్థులకు మధ్యస్థ ఫలితాలు గోచరిస్తున్నాయి. నూతన అవకాశాలు లభిస్తాయి.

**మకరం:** కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిష్ణాతుల సలహాలను పరిగణలోనికి తీసుకోండి.

**కుంభం:** అగ్రిమెంట్లు ముఖ్యమైన సంతకాలు చేసేటప్పుడు సాంకేతిక లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడండి.

**మీనం :** కీడెంచి మేలెంచమన్న విధంగా ఆలోచనా శైలి ఉంటుంది. ఆరోగ్యం పట్ల జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హెచ్ఐవి నివారణలో 'రెడ్ రన్'

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి నుండి హెచ్ఐవి నివారణలో భాగంగా అందరికీ అవగాహన కల్పించాలని గత అక్టోబరు నెలలో రెడ్ రన్ కార్యక్రమం నిర్వహించారు అందులో గెలుపొందిన విజేతలను గోవాలో నిన్న 18 న జరిగిన జాతీయస్థాయి రెడ్ రన్ పోటీలకు పంపించడం జరిగింది. అందులో ఎం.నరేష్ రెండవ బహుమతిని టి/జి కేటగిరీలో గెలుపొందడం జరిగింది. డాక్టర్. ఎ.సిరి ఐఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి చేతుల మీదుగా 35000. బహుమతి నీ మెమోంటో ను అందించడం జరిగింది. డాక్టర్. సరస్వతీ దేవి. ఎపిడి, డాక్టర్ టి.మంజుల జెడి ఐఇసి డాక్టర్. కామేశ్వర ప్రసాద్ జెడి బిఎస్‌డి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అభినందనలు తెలియజేశారు.


పశువైద్యశిబిరంలో మంత్రి అచ్చెన్నాయుడు

# పశుసంవర్ధకాభివృద్ధికి కృషి

## వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** పశువుల సంక్లిష్ట వ్యాధులకు గురి కాకుండా వాటి కోసం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావురు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వ హిస్తున్నట్లు వెల్లడించిన మంత్రి అచ్చెన్నా యుడు. నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువ్యాది నిర్ధారణ పరీక్షలు వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సద స్సులు నిర్వహిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నా యుడు. పేర్కొన్నారు. పశువుల సంరక్షణ పూర్తి స్థాయిలో చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు.

వ్యవసాయం. పశు సంవర్ధకంశాలపై సీఎం చంద్రబాబు పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. పశువుల మంచి బ్రీడింగ్‌కు ప్రోత్సాహం ఇస్తామన్నారు. సంచార పశు వైద్యశాలలను పెంచుతున్నామన్నారు. రైతు సేవా సంస్థల ద్వారా అన్నదాతలకు అండగా ఉంటామన్నారు.

# తిరుమల సమాచారం

## ఉత్తరాదిభక్తులకు శ్రీవారి దర్శనం

### - ధర్మప్రచారం ఏర్పాట్లు అభినందనీయం -టిటిడి ఛైర్మన్ నాయుడు



**తిరుమల,జనవరి 20ప్రభాత వార్త ప్రతినిధి:** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా సందర్భంగా అక్కడ శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటుచేసి,భక్తులకు స్వామివారి దర్శనంతోబాటు సేవలు వీక్షించే భాగ్యం కల్పించడం ఆనందంగా ఉందని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాలో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా 250మంది టిటిడి సిబ్బంది సేవలందించడం బావుందన్నారు. ఉత్తరాదిలో ధర్మప్రచారం కోసం చక్కటి ఏర్పాట్లు చేసిన హెచ్‌డిపిపి సిబ్బంది పనితీరు అద్భుతమన్నారు. సరయూనదీతీరంలో స్వామివారికి స్నప నతిరుమంజనం నిర్వహించారన్నారు. సోమవారం ఉదయం ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు నమూనా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ఏర్పాట్లుపై సంతోషం వ్యక్తం చేశారు.

# జగన్ బెయిల్ రద్దుపై రఘురామ పిటిషన్..

## సుప్రీంకోర్టులో విచారణ..

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. వైకాపా అధ్యక్షుడు జగన్ బెయిల్ రద్దు , కేసుల ట్రయల్ విచారణ ధర్మాసనం మార్పు చేయాలని కోరుతూ ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిర్ణయం తీసుకుంది. గతంలో విచారించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం నుంచి జస్టిస్ బీవీ నాగరత్న జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనానికి రిజిస్ట్రీ మార్చింది. ఈ నేపథ్యంలో జస్టిస్ బీవీ నాగరత్న జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం ముందు రఘురామ జగన్, సీబీఐ తరపున వాదనలు జరిగాయి. గత 12 ఏళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ కూడా డిస్పోజ్ చేయలేదని రఘురామ తరపు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంలో సీబీఐ, నిందితులు కుమ్మక్కయారని పేర్కొన్నారు. డిశ్చార్జ్ పిటిషన్లపై వాదనలు విని వాటిపై ఎలాంటి నిర్ణయం వెలువరించకుండానే ఐదుగురు జడ్జీలు బదిలీ అయ్యారని తెలిపారు. ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్‌పైనా తుది నిర్ణయం వెలువడకుండా బదిలీ అవ్వడంలో కుట్రకోణం దాగి ఉందన్నారు. ఆ ఉద్దేశంతోనే తాము ట్రయల్ బదిలీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశామని పేర్కొన్నారు. బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణలోనే చెప్పిందని తాము ఇప్పుడు కేసు మానిటరింగ్ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నామని తెలిపారు. సీబీఐ కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసిందని దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈ కేసును హైకోర్టు మానిటర్ చేస్తోందని ఇంకా కేసు అక్కడ పెండింగ్‌లో ఉందని జగన్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని సుప్రీంకోర్టు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ట్రయల్‌లో జాప్యం కొనసాగుతూనే ఉందని రఘురామ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని సీబీఐ తరపు న్యాయవాది కోరారు. అదనపు సొలిసిటర్ జనరల్ మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వచ్చే సోమవారం విచారణ చేపడతామని జస్టిస్ బీవీ నాగరత్న జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం తెలిపింది.

# జనసేన కార్యాలయంపై డ్రోన్ అది ప్రభుత్వానిదే!

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంపై ఎగిరిన డ్రోన్ కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ డ్రోన్‌ను పోలీసులు గుర్తించారు. అది ఏపీ ఫైబర్ నెట్ సంస్థదిగా తేల్చారు. రెండ్రోజులుగా ఈ కేసులో పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. ట్రాఫిక్, పారిశుద్ధ్య కాల్వల నిర్వహణ, రహదారుల స్థితిగతులపై ప్రభుత్వం అధ్యయనం చేపడుతోంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మంగళగిరిలో అధ్యయనం చేస్తోంది. పలు రకాల సర్వేలకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగానే డ్రోన్ ఎగిరినట్లు గుర్తించారు.

# భక్తులకు మరింత నాణ్యమైన సేవలు

### - కొన్ని సేవలు ఇకనుండి వాట్సాప్‌ద్వారా సమాచారం
### - టిటిడిలో ఆధునికసాంకేతికత వినియోగం

**తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం...వడ్డీకాసుల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు దేశవిదేశాల నుండి రోజువారీగా లక్షమందివరకు వస్తున్న భక్తులకు తిరుమలలో దర్శనం సమయం, గదుల లభ్యత తదితర వివరాలు మరింత త్వరగా,నాణ్యమైన సేవలందించేందుకు టిటిడి సాంకేతికతకను వినియోగించుకునే దిశగా సిద్ధమైంది. సామాన్యభక్తులకు మరింత తాజా సమాచారం అందించేందుకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా భక్తులు ఇబ్బంది పడే అవకాశం లేకుండా చూడనుంది. పాలనాపరమైన సంస్కరణలు చేపట్టి కొండపై అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగినా రద్దీనియంత్రణ మరింత మెరుగ్గా ఉండేలా చూడనున్నారు. ఇప్పటికే ఈ విషయాలపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించడంతో ఇప్పుడు అమలుచేయడానికి టిటిడి అధికారులు సిద్ధమయ్యారు. భక్తులు,పేదప్రజల సౌకర్యార్థం విద్యవైద్య రంగాల్లోకూడా విశేషసేవలందిస్తున్న టిటిడికి పలు రకాలుగా విరాళాలిచ్చే దాతల విభాగాన్ని పూర్తిగా ఆడిట్‌చేయించాలని బోర్డులో నిర్ణయించారు. అర్హులైన దాతలకు అందించే సేవలు, మధ్యవర్తులు,దళారులను పూర్తిగా అరికట్టేలా చర్యలు మొదలుపెట్టారు. పారదర్శకంగా సేవలందించేలా ,మానవ జోక్యాన్ని తగ్గించి భక్తులకు త్వరితగతిన తిరుమలేశుని దర్శనం, వసతి సౌకర్యం కల్పించాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం సిఫార్సులేఖలపై జారీచేస్తున్న విఐపి బ్రేక్ దర్శనాలు కూడా ఆన్‌లైన్‌ద్వారా అందించేందుకు ఆ విఐపిలకరు ఒక కోడ్‌నంబర్ ఇవ్వాలని దానిద్వారా వెసలుబాటును బట్టి బ్రేక్ దర్శనాలు బుక్‌చేసుకునే సౌలభ్యం కల్పించేలా చూడనున్నారు. ఆన్‌లైన్‌ద్వారా గదులు బుక్‌చేసుకున్న భక్తులకు వాట్సాప్‌ద్వారా సమాచారం అందించేందుకు కసరత్తు మొదలుపెట్టారు. వాట్సాప్‌ద్వారా సేవలను భక్తులకు తెలిసేలా చూడనున్నారు. దీనివల్ల పాలనపరమైన సంస్కరణలతోబాటు భక్తులకు ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో రాజ్యాంగపరిధిలోని ప్రముఖుల సిఫార్సులేఖలపై పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి, టిబి కౌంటర్ ద్వారా గదులు పొందే సదుపాయం లభిస్తోంది. ఆన్‌లైన్‌ద్వారా గదులు బుక్‌చేసుకునే సదుపాయం కూడా ఇప్పటికే అందుబాటులో ఉంది. ఇక రానున్న రోజుల్లో వాట్సాప్‌ద్వారా సమాచారం కీలకం కానుంది.

# ప్రజలకు వాస్తవాలు తెలుసు: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి

### టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరై వివరణను ఇచ్చిన ఎమ్మెల్యే కొలికపూడి



**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈనెల 11న జరిగిన ఘటనపై తెదేపా క్రమశిక్షణ కమిటీ సభ్యులకు నేరుగా రాతపూర్వకంగా తన వివరణ ఇచ్చానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చేది వేరు. జరిగిన వాస్తవం వేరు. కంచె తొలగింపు ఘటన యాదృచ్ఛికంగా జరిగింది. కంచె ఉన్న విషయం అక్కడికి వెళ్లే వరకు తెలియదు. నాపై ఫిర్యాదు చేసిన వాళ్లే ఇవాళ నాతో కలిసి పనిచేస్తున్నారు. పార్టీ కోసం పనిచేసే వాళ్లను ఎవరూ దూరం పెట్టరు. తిరువూరు ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసు అని కొలికపూడి అన్నారు. ఈ నెల 11న కొలికపూడి ఎ.కొండూరు మండలం గోపాలపురంలోని తెదేపా గ్రామ కార్యదర్శి భూక్యా రాంబాబు ఇంటికి వెళ్లారు. ఆ గ్రామంలో రాంబాబుకి ఆయనకు వరుసకు సోదరుడయ్యే వైకాపా నాయుకుడు భూక్యా కృష్ణకు ఎప్పటి నుంచో ఆస్తి తగాదా ఉంది ఇటీవల గ్రామంలో సీసీ రోడ్డు వేశారు. ఆ రోడ్డు తన స్థలంలోనే వేశారని వివాదం తేలేవరకు రోడ్డుని ఎవరూ వినియోగించడానికి వీల్లేదని కృష్ణ దానిపై కంచె వేశారు. రాంబాబు ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ రోడ్డు దగ్గరకు వెళ్లి కృష్ణ, ఆయన భార్య భూక్యా చంటిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ,ఆయన అనుచరులు తమ ఇంట్లోకి వచ్చి తన భర్తను తనను కొట్టారంటూ భూక్యా చంటి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. తెదేపాలోని మెజార్టీ వర్గాలు కూడా ఎమ్మెల్యే వ్యవహారశైలిపై అసంతృప్తితో ఉన్నాయి. దీంతో నేడు ఎమ్మెల్యేను క్రమశిక్షణ సంఘం ముందుకు పిలిపించారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్యే పంచుమర్తి అనురాధ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణకు కొలికపూడి వివరణ ఇచ్చారు. తెదేపాలో ఎవరైనా క్రమశిక్షణ పాటించాల్సిందేనని పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. పార్టీలో కార్యకర్త ఎమ్మెల్యే ఎవరైనా ఒకటేనని చెప్పారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి పార్టీ లైన్ దాటుతున్నట్లు తెలుస్తోందని వ్యాఖ్యానించారు.

# కూటమి నిర్ణయం నా నిర్ణయం

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**ఉమ్మడితూర్పు గోదావరి జిల్లా బ్యూరో జనవరి 20, ప్రభాతవార్త..** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న మద్దతు తెలిపు మెదటి శాసనసభ్యుడు తానేనని రాజమహేంద్రవరం శాసనసభ్యుడు ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. నగరంలో ఒకిటొవ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి సోమవారం పర్యటించారు. తారకరామా నగర్, బాలాజీ నగర్ సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులను పనులపై ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలను అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుండి నగరాభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. నగరంలో మేజర్ డ్రైన్లపై దృష్టి పెట్టి సిల్టును తొలగించామని, దీంతో వర్షం డ్రైనేజీల్లో ప్రవహించి నగరంలో రోడ్డు నీట మునగలేదన్నారు. గత పాలకులు నిధులు దోచుకొని పైపై మెరుగులతో నగరాన్ని రాళ్ల ముక్కలను అంటించారు ఈ పనుల వల్ల నగర ప్రజలు ఎంత ఇబ్బంది పెడుతున్నారంటూ కనీస అవగాహన లేకుండా అభివృద్ధి పనులు చేశారని మండిపడ్డారు.దీనిలో టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు. రైటప్..ఒకిటో డివిజన్ లో అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

# అమిత్ షా వ్యాఖ్యలకు ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది


## - ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి



**విజయవాడ, జనవరి20, ప్రభాత వార్తప్రతినిధి:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చూస్తుంటే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. వైకాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలన ఓ విపత్తు అని అమిత్ షా అన్నారని, మరి ఐదేళ్ల పాటు విధ్వంసం జరుగుతుంటే ఏం చేశారని షర్మిల మండిపడ్డారు. ఆ ఐదేళ్లు కేంద్రంలో ఉన్నది ఎన్డీయేనే కదా మరి ఢిల్లీలో కూర్చొని వేడుక చూశారా? అంటూ ధ్వజ మెత్తారు. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులను ఆపితే ఒక్కనాడైనా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నించారా? అంటూ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని వైసీపీ ఐదేళ్లపాటు పాలిస్తుంటే కేంద్రానికి కనిపించలేదా? అని షర్మిల మండిపడ్డారు. ఇష్టారాజ్యంగా రూ.10 లక్షల కోట్లు అప్పులు చేస్తుంటే విధ్వంసం జరుగుతున్నట్లు అనిపించలేదా? అని విమర్శించారు. సొంత బాబాయి హత్యకేసులో ఢిల్లీ స్థాయిలో న్యాయం కోసం పోరాటం చేస్తుంటే కేంద్ర హోంశాఖ మంత్రిగా ఎందుకు మౌనంగా ఉన్నారంటూ అమిత్ షాను ఆమె ప్రశ్నించారు. భారీస్థాయిలో అవినీతి జరుగుతుంటే ఒక్కటైనా బయట పెట్టారా? అంటూ అమిత్ షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా అమిత్ షాపై షర్మిల ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల వ్యాఖ్యానిస్తూ ఐదేళ్ల పాటు జగన్ మీకు దత్తపుత్రుడు. ఆడించినట్లు ఆడే తోలుబొమ్మ. పార్లమెంట్‌లో మీ బిల్లులకు మద్దతు పలికే రబ్బర్ స్టాంప్. ఏపీలో సహజ వనరులను ఖిమోదానీకికి దోచిపెట్టే ఏజెంట్. మీ ఇష్టారాజ్యంగా ఐదేళ్లు వైసీపీని వాడుకొని, రాష్ట్ర సంపద దోచుకొని, ఇప్పుడు విధ్వంసం జరిగిందని మొసలి కన్నీరు కార్చితే నమ్మే అమాయకులు రాష్ట్ర ప్రజలు కారు. 20192024 మధ్య జరిగిన విధ్వంసంలో కర్త జగన్.

# కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయండి

### కృష్ణా జలాల కేటాయింపుల్లో ఆంధ్రా నీటి హక్కులను కాపాడాలి
### ఎపి సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు


హైదరాబాద్ జలసౌధలోని కెఆర్ఎంబి కార్యాలయంలో బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు తదితరులు

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త :** కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని వైసిపి ప్రభుత్వం విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలన్న అసంబద్ధ నిర్ణయాన్ని పునఃసమీక్షించి కృష్ణా బేసిన్ విజయవాడలోనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యుడు, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన హైదరాబాద్ జలసౌధలోని కెఆర్ఎంబి కార్యాలయంలో బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోని కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో అన్ని రకాల మానిటరింగ్ చేయటానికి ఏర్పాటు చేయగానే 2018 జనవరిలో విజయవాడలోని ఇబ్రహీంపట్నం ప్రాంతంలో భవనాలను కూడా పరిశీలించారని ఆయన వివరించారు. 2020 అక్టోబరులో కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగిన 2వ ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కె.ఆర్. ఎం.బి కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఏర్పాటుపై తెలుగు రాష్ట్రాల అధికారులు చర్చించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. కృష్ణా నదిపై నిర్మించిన బహుళార్థ సాధక ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రకాశం బ్యారేజిపై ఆధారపడి ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని కృష్ణానది ఒడ్డున ఉండే విజయవాడ కెఆర్ఎంబికి సరైన స్థలం అని ఆయన తెలిపారు. విజయవాడకు రైలు, రోడ్డు, విమాన సౌకర్యం కలిగి ఉందని ఆయన తెలిపారు. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు, ఆయకట్టుదారులు, నీటి సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కె.ఆర్.ఎం.బి దృష్టికి తీసుకురావటానికి అనుకూలంగా విజయవాడ ఉంటుందన్నారు. ఇన్ని సానుకూల అంశాలు ఉన్న విజయవాడలో కాకుండా కృష్ణా డెల్టాకు 400 కి.మీ, ఎన్.ఎస్.పి కి 700 కి.మీ, శ్రీశైలంకు 800 కి.మీ లకు దూరంగా గోదావరి బేసిన్ అవతల వున్న విశాఖపట్నంలో మూడు రాజధా నుల్లో భాగంగా కార్యనిర్వాహక రాజధాని నెపంతో కె.ఆర్.ఎం.బి కార్యాలయాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని గత వై.సి.పి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో కేంద్ర జలశక్తి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2014-2019, 2019-2024 మధ్య జరిగిన నిర్ణయాలను పరిగణనలోనికి తీసుకుని విజయవాడలోనే కార్యా లయాన్ని ఏర్పాటు చేయటానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కె.ఆర్.ఎం.బి ఛైర్మన్ అతుల్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు.

# నెయ్యినాణ్యత పరీక్షించే అధునాతన యంత్రాలు వచ్చాయ్!

### - ఎన్‌డిడిబి ద్వారా తిరుమలకు ల్యాబ్ పరికరాలు

**తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశుని లడ్డూప్రసాదాల తయారీలో వినియోగించే కిలోలకొద్దీ నెయ్యి నాణ్యత పరీక్షిం చేందుకు 80లక్షలు రూపాయలు విలువైన అధునాతన పరీక్షించే యంత్రాలు టిటిడికి చేరాయి. ఈ యంత్రాలు నెయ్యినాణ్యతను కొన్ని నిమిషాల్లోనే తేల్చేసి ఏమేరకు స్వచ్ఛమైన నెయ్యిఅనేది తెలియజేస్తుంది. ఈ మేరకు తిరుమలలో అవసరమైన అధునాతన పరిశోధనశాలను కూడా టిటిడి సిద్ధం చేసింది. గుజరాత్‌లోని ఎన్‌డిడిబి నుండి గ్యాస్‌క్రొమోటోగ్రఫీ, హైఫర్ఫామెన్స్‌లిక్విడ్ క్రోమోటోగ్రఫీ రెండు యంత్రాలు చేరాయి. వీటిద్వారా నెయ్యిలోని నాణ్యత, నిత్యావసరసరుకుల నాణ్యత ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఉన్నాయోలేదో తెలిసిపోతుంది. ఇప్పటికే తిరుమలలో నెయ్యినాణ్యత ప్రాదమికంగా పరీక్షించే పాతల్యాబ్ ఉన్నా గతంలో చోటుచేసుకున్న వివాదాలు, ఆరోపణల నేపథ్యంలో టిటిడి అధునాతన పరిశోధనశాల ఏర్పాటుచేసి అవసరమైన ఆదునిక సాంకేతిక యంత్రాలను తెప్పించుకుంది. వీటిని త్వరలోనే ఏర్పాటుచేసి పరీక్షచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గతంలో కల్తీ నెయ్యితో లడ్డూలు తయారుచేశారని బలమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై సిబిఐ సిట్ తిరుమలకు చేరుకుని విచారణ చేసింది. దర్యాప్తు నివేదికలు సిద్ధం చేసింది. టెండర్లు దక్కించుకున్న డైరీలు సరఫరా చేసే నెయ్యిని పరీక్షించేలా ఇప్పుడు అధునాతన యంత్రాలు తీసుకురావడంతో కల్తీఅనే మాట వినపడదు.

# ప్రభుత్వ ప్రతిపాదిత సెక్రటేరియట్ నమూనా రాష్ట్ర హైకోర్టు భవనం ఆకృతి

**ఒకే రోజు రు.4865 కోట్లతో.. సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ నిర్మాణాలకు టెండర్లు.. - 20,066 కోట్లకు చేరిన రాష్ట్రం సిఆర్‌డిఎ టెండర్లు**

**రాజంపేట అర్బన్, జనవరి 20 ప్రభాతవార్త** రాష్ట్ర రాజధాని నిర్మాణంలో కూటమి సర్కార్ రాకెట్ వేగంతో దూసుకు వెళుతోంది. రాష్ట్ర రాజధానికి మణిహారంగా నిలిచే సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ నిర్మాణాలకు ఒకేరోజు టెండర్లు పిలిచారు. 4865.09 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు సోమవారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తూ ఏపీ సి ఆర్ డి ఏ ఉత్తర్వులు జారీ చేసింది. దావోస్ పర్యటనకు వెళ్లే ముందు చంద్రబాబునాయుడు ఈ కీలక పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వెళ్లారు. దీంతో వెంటనే సిఆర్డిఏ టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సెక్రటేరియట్ నిర్మాణం తో పాటు వివిధ శాఖల హెచ్ ఓ డీల భవనాలను కూడా 3527 కోట్ల వ్యయంతో చేపడతారు. అదేవిధంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం (హైకోర్టు)ను 745.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం పనులు చేపట్టనున్నారు. అలాగే 592.14 కోట్ల వ్యయంతో అసెంబ్లీ భవనాలను నిర్మించనున్నారు. చివరి గడువు ఫిబ్రవరి 10 వరకు అని ఏపీ సిఆర్డిఏ నిర్ణయించింది. దీంతో ఇప్పటివరకు సిఆర్డిఏ ప్రపంచ బ్యాంక్ ,ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నిధులతో చేపట్టిన పనుల విలువ 20,066 కోట్లకు చేరింది. రాజధాని నిర్మాణంలో దాదాపు ముఖ్యమైన పనులన్నీ ఇప్పటికే టెండర్లను పిలిచారు.

# లోకేష్‌కు డిప్యూటీ సిఎం అంశంపై చర్చలొద్దు - ఆదేశించిన టిడిపి అధిష్టానం

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఈ మధ్య డిప్యూటీ సీఎం అంశం ప్రధాన రాజకీయ చర్చాంశంగా మారింది.పవన్‌కు ప్రత్యామ్నయంగా మంత్రి లోకేష్‌కు ఉప ముఖ్యమంత్రి ఇవ్వాలనే వాదన తెరమీదకు వచ్చింది.మహాసేన రాజేష్ ఈ అంశాన్ని తెరపైకి తీసుకుని వచ్చారు.సామాజిక మాధ్యమాల్లో టీడీపీ, జెఎస్పీ కేడర్ల నడుమ సామాజిక మాధ్యమాల్లో ప్రచ్ఛన్న యుద్దానికి దారి తీసింది.ఇది క్రమంలో సామాజిక వర్గీయుల నడుమ సున్నిత పరిస్దితులకు ఆజ్యం వేసే దిశగా మారింది.సామాజిక మాధ్యమాలు కొన్ని పవన్ ఏకంగా టీడీపీపై అలిగి తన పదవికి రాజీనామా చేసారనే వార్తలువచ్చాయి.దీనికి తోడుగా మంత్రి నారా లోకేశ్ కి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలనే డిమాండ్ తెలుగుదేశం పార్టీ వర్గాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. వీరిలో అత్యధికులు నామినేటెడ్ పోస్టులు,ఇతర పదవులు ఆశించి భంగపడిన వారు కావడం విశేషం,ఈ క్రమంలో లోకేష్ డిప్యూటీ సీఎం అంశంపై ఇప్పటికే పలువురు నాయకులు స్పందించారు. ఈ విషయంపై టీడీపీ హైకమాండ్ దృష్టి సారించింది. ఈ అంశంపై ఇక ఎవరూ మాట్లాడవద్దని అధిష్ఠానం నేతలకు ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా మీడియా వద్ద బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి అధ్యక్షులు కూర్చొని మాట్లాడుకుంటారని వెల్లడించింది. ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని హైకమాండ్ సీరియస్ గా చెప్పింది. ముఖ్యంగా ఇలా ప్రచారాన్ని చేయడాన్ని సీఎం చంద్రబాబు తీవ్రంగా పరిగణించారంటున్నారు. కొద్ది రోజులుగా లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని టీడీపీ వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై తమ అభిప్రాయాన్ని పలువురు నేతలు బహిరంగంగానే మాట్లాడారు. దావోస్ వెళ్ళడానికి ముందు సీఎం చంద్రబాబు వైఎస్సార్ జిల్లా మైదుకూరులో పర్యటించారు.

వార్త

స్నేహం నిదానంగా వికసించేది. నెమ్మదిగా వర్ధిల్లేది. ఒకరినొకరు అర్థం చేసుకోవడం వల్ల, త్యాగం చేసుకోవడం వల్ల విస్తరించేది.

-నెపోలియన్

# ట్రంప్ తొలి అడుగులపై ఉత్కంఠ!

ప్రపంచదేశాలు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. అమెరికా 47వ అధ్యక్షుడుగా రిపబ్లికన్‌నేత డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసారు. అందులో కొత్తేమీ లేదు. ఎన్నికైన అధ్యక్షుడు ప్రమాణంచేసి శ్వేతసౌధంలోకి అధికార లాంఛనాలతో అడుగుపెడతారు. అయితే ఎటొచ్చీ పదవీబాధ్యతలు తీసుకున్న మరుక్షణంలోనే కొత్త అధ్యక్షుడు చేసే సంతకాలపైనే ఇపుడు అన్ని వర్గాల ఫోకస్ అంతా. అందులోనూ రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత తీసుకునే నిర్ణయాలపైనే ఇపుడు ప్రపంచదేశాలు దృష్టి సారిస్తున్నాయి. అన్నింటికంటే వీటిలో అక్రమవలసల కట్టడి అంశం చర్చకు వస్తోంది. వీటితోపాటు తనముందున్న అధినేత జో బైడెన్ జారీచేసిన ఉత్తర్వులన్నింటినీ రద్దుచేస్తానని ప్రకటించిన ట్రంప్ అధ్యక్షుడుగా తొలి సంతకం చేసిన తర్వాత సుమారు 200కిపైగా ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలు చేస్తారని అంచనా. వీటిలో ముందుగా పది ఉత్తర్వులు ఇపుడు ప్రజల్లో నలుగుతున్నాయి. అన్నింటి కంటే అత్యంత విస్తృత స్థాయిలో ప్రచారంలోకి వచ్చింది సామూహిక అక్రమ వలసదారుల కట్టడి. అక్రమ పత్రాలతో అమెరికాలో నివసించే అర్హతలేని వారందరినీ వెనక్కి పంపించేస్తామని, అవసరమైతే ఇందుకు ప్రత్యేక బలగాలను నియమించి కూడా అక్రమవలసలు నిర్మూలిస్తామని తెగేసి చెపుతున్నారు. ఇప్పటికే అనేక సార్లు స్పష్టం చేసిన ట్రంప్ ఇపుడు ఈ సామూహిక అక్రమ వలసల కట్టడి నిర్ణయం ఏకపక్షంగా చేస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. ట్రంప్ మొదటిసారిగా అధ్యక్షుడుగా కొనసాగిన సమయంలో కూడా అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్ నినాదంతో భారీ మెజార్టీతో గెలిచారు. అలాగే ఇపుడు రెండోసారి కూడా మేడిన్ అమెరికా నినాదాన్ని కూడా ప్రచారంలోకి తెస్తున్నారు. అక్రమవలసల నిరోధం పేరిట కఠిన చర్యలు ప్రారంభిస్తే ముందుగా మెక్సికో, కెనడా, చైనా, ఇతర గల్ఫ్‌దేశాలకు చెందిన వారిపై ప్రభావం పడుతుందని అంచనా. ఈకోవలో భారతీయులపైనా ఈ ప్రభావం పడుతుంది. ఇక అక్రమ వలసలతోపాటు జన్మతహ పౌరసత్వ విధానాన్ని కూడా రద్దు చేస్తామని ప్రకటించారు. దీనివల్ల అమెరికాలో పుట్టిన విదేశీ పిల్లల తల్లితండ్రులకు ఇపుడు చిక్కులు ఎదురయ్యే ప్రమాదాలు మెండుగా ఉన్నాయి. వీటితోపాటు ట్రాన్స్ జెండర్లను మహిళా క్రీడల్లో అనుమతించే ప్రశ్నేలేదని, వారిని కేవలం పురుషులకు సంబంధించిన క్రీడల్లోనే అనుమతించేవిధంగా రూపొందించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేస్తామని ప్రమాణస్వీకారానికి ముందు నుంచే ట్రంప్ చెపుతూ వస్తున్నారు. అంతటితో ఆగలేదు. అమెరికన్లలో విశ్వాసం మరింత పెంచుకునే దిశగా ట్రంప్ అడుగులు వేస్తున్నారు. అమెరికా మాజీ అధ్యక్షులు జాన్‌ఎఫ్ కెనడీ, రాబర్ట్ ఎఫ్‌కెడనీ, మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్‌ల హత్యకేసు ఫైళ్లను బహిర్గతం చేస్తానని ప్రకటించారు. ప్రభుత్వంలో పారదర్శకత పేరిట ట్రంప్ అనుసరిస్తున్న వ్యూహం భారీ ప్రయోజనాలే చేకూరుస్తుందని అంచనా. మెక్సికో, కెనడా దిగుమతులపై 25శాతం సుంకాలు తప్పవని అదే దిశగా మరికొన్ని దేశాలపైనా సుంకాల విధింపు ఉంటుందని ముందుగానే హెచ్చరించిన ట్రంప్ కచ్చితంగా అమలు చేస్తారన్న భయాలు కూడా పెరిగాయి. వీటితోపాటుగా మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకట్ట వేస్తానన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన గంటలోపే ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ జారీచేసిన ఉత్తర్వులు అమలుకాకుండా చూస్తామన్నారు. రెండోసారి ఎన్నికల్లో తన ఓటమిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మద్దతుదారులు క్యాపిటల్ హిల్స్ పై దాడులు చేసారు. ఈ దాడుల్లో ఇప్పటికీ నిందితులుగా ట్రంప్ మద్దతుదారులు జైళ్లలో ఉన్నారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ముందు 1500 మందికిపైగా మద్దతుదారులకు క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించారు. విదేశీ కంపెనీలు ఏవైనా సరే కనీసం 50శాతం వాటా అమెరికా ఇన్వెస్టర్ల చేతుల్లో ఉండాలన్న షరతులు విధిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు తీసుకువస్తున్నారు. అలాగైనా కూడా కొన్ని విదేశీ కంపెనీలు అమెరికాలో సేవలకు ముందుకు వస్తున్నాయి. వాటిలో చైనాకు సంబంధించి టిక్‌టాక్ ప్రధానంగా నిలిచింది. వీటితోపాటు ట్రంప్ తన తొలి విడత హయాం నుంచి కూడా క్రిప్టోకరెన్సీ పై మక్కువ చూపించారు. అందుకు అనుగుణంగా ఆయన సతీమణి మెలానియా ట్రంప్ సొంతంగా మీమ్ కాయిన్‌ను విడుదల చేస్తున్నారు. అప్పటికే ట్రంప్‌కు సొంత మీమ్ కాయిన్ ఉంది. అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసిన తరుణంలో ఈ బిట్‌కాయిన్ విలువలు గణనీయంగా పెరిగాయి. అలాగే ఇంధన దిగుమతులకు చెక్‌పెట్టాలని నిర్ణయించిన ట్రంప్ స్వదేశంలో చమురు వెలికితీతను మరింత విస్తృతంచేయాలని నిర్ణయించారు. సొంతంగానే చమురు నిల్వలను పెంచుకుంటే దిగుమతి వ్యయం తగ్గుతుందని, వృథా ఖర్చును తగ్గించుకోగలుగుతామని ట్రంప్ చెపుతూ వస్తున్నారు. అన్నీ సవ్యంగా జరిగితే ట్రంప్ అనుకున్నట్లుగా కేవలం 100 మాత్రమే కాదు బైడెన్ పాలనలో జారీ అయిన కార్యనిర్వాహక ఉత్తర్వులన్నీ కలుపుకుంటే సుమారు 200కిపైగా ఉత్తర్వులపై సంతకాలు చేయవచ్చని శ్వేతసౌధం అధికారులే పేర్కొంటున్నారు. పదవి చేపట్టకముందే ఏడాదిగా జరుగుతున్న మారణహోమానికి అడ్డుకట్టవేయగలిగారు. ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధకాండకు తెరపడింది. అదేవిధంగా ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను కూడా నిలిపివేయగలిగితే ట్రంప్‌పై ప్రపంచదేశాల్లో కూడా గౌరవం మరింత పెరుగుతుంది. బాధ్యతలు చేపట్టిన తొలివారంలోనే ట్రంప్ ఈ రెండుదేశాలపై దృష్టిసారిస్తే మరో మారణహోమానికి ఫుల్‌స్టాప్ పెట్టిన వారవుతారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

జీవితం అంతకంతకూ తన్మయత్వం నొందించే సాహస కార్యంలా కనిపిస్తుంటుంది. అందులో మనం నేర్చుకోవలసింది, చేయవలసింది ఎంతో ఉంది.



నెహ్రూ

ఇతరులకు మంచి చేసే వ్యక్తి, తనకు తాను మంచి చేసుకున్న వాడు అవుతాడు.



సెనెకా

# ఇజ్రాయెల్-గాజా కాల్పుల ఒడంబడిక ఫలించేనా?

**అరబ్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ముఖ్యంగా ఇజ్రాయిల్-లెబనాన్‌ల మధ్య శాంతి తీరాలు సుదూరాన కూడా కనపడటంలేదు. ఎడతెగని దాడులు, ఎన్నిసార్లు ఒడంబడికలు జరిగినా ఇరువైపు లా జరుగుతూనే ఉంటాయి. ఈ నిరంతరం నిప్పుల కొలిమిని ఆర్పేదెవరు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో బాటు రష్యా, చైనా, ఇండియా లాంటి దేశాల అధినేతలు, అరబ్బు దేశాలు- ఇజ్రాయిల్ లెబనాన్ దేశాల మధ్య అంతర్జాతీయంగా యు.ఎన్ ఆర్గనైజేషన్‌ను బరిలోకి దింపి ఏకాగ్రతతో, రాజకీయాలనూ, పాతవైరాలనూ దూరంపెట్టి నిజమైన, కొన్నేళ్లపాటు నిలిచిపోయే శాంతి మార్గాన్ని ఏర్పరుస్తేనే ఈ జాతుల వైరం సమిసిపోయే అవకాశం ఉంది. అంతటి మహత్తరమైన అసాధారణ ప్రయత్నం అంతర్జాతీయంగా సాధ్యపడుతుందా? ఈ మిలియన్ డాలర్ల ప్రశ్నకు జవాబు ప్రస్తుతానికి కనపడటం లేదు. అయినా సరే ఆశను ఆవిరి కానివ్వకుండా నిరంతరం శ్రమిస్తూ ప్రయత్నించక తప్పదు.**



రావులపాటి సీతారాంరావు

పాలస్తీనీయన్లు గాజాలో పండుగ సంరంభాలు జరుపుకోవడానికి కారణం ఇజ్రాయిల్-హమాస్ మధ్య సీజ్‌ఫైర్ ఒడంబడిక జరగడం వల్ల. గాజా ప్రాంతంలో కనీసం కొన్నాళ్లయినా శాంతితో సుఖంగా బాంబులూ, రాకెట్ల గొడవ లేకుండా ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలిసిపోకుండా బతకొచ్చని! బతుకు విలువ తెలిసిన గాజా ప్రాంత వాసులకు అంతకంటెగొప్పవరం ఏముంటుంది? అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్, అధ్యక్ష పీఠాన్ని అలంకరించబోయే ముందు అంటే జనవరి 15, 2025 నాడు ఈ ఒడంబడిక సాధ్యపడేలా చేశారు. పదవి నుంచి దిగబోతున్న జోబైడెన్ పూర్తి సహకారం అందించడం వల్లనే ఈసంధి కుదిరిందని అభిజ్ఞుల భోగట్టా! ఖతార్ స్టేట్ మధ్యవర్తిత్వంతో చర్చలు ఒక రకంగా ఫలవంతమయ్యాయి. అందుకనే జనవరి 19 నుంచి ఈ ఒడంబడిక అమలులోకి వస్తుందని ఖతార్ ప్రకటించింది. పట్టుబడ్డ ఇజ్రాయిలీ వాసులనూ, పాలస్తీనీ ఖైదీలను ఇచ్చి పుచ్చుకోవటాలు జరగటమే ఈ ఒడంబడిక మరొక ముఖ్యాంశంగా భావించాలి. 2023 సంవత్సరంలో మొదలైన ఇజ్రాయిల్ దాడి-హమాస్ దాడులకు ప్రతిగా, దాదాపు 15 నెలల తర్వాత ఆగిపోయే సూచనలు ఈ ఒడంబడిక ద్వారా కనపడుతున్నాయి. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజిమెన్ నెతన్యాహు ఒక విధంగా ట్రంప్ ధోరణి వల్ల ఆశాభంగం పొందక తప్పలేదు. ట్రంప్ అధికారంలోకి వస్తే హమాస్‌పై దాడులను వ్యతిరేకించదని నెతన్యాహూ ఆశించాడు. కానీ ట్రంప్ తన రాజకీయ అవసరాల దృష్ట్యా నెతన్యాహు ఆశించిన విధంగా ఈ దాడులను కొనసాగించడానికి ఒప్పుకున్నట్లు లేదు. బైడెన్ బలహీన ధోరణి వల్ల ఇజ్రాయిల్ ఈ దాడులను కొనసాగించిందని రాజకీయ వర్గాలు నమ్మాయి. తర్వాత ట్రంప్ నిర్ణయం ఒక విధంగా ఈ ప్రాంతంలో శాంతికి దారితీసిందిగా భావించవచ్చు. ఎన్నాళ్లు ఈ ప్రశాంతత పాలస్తీనీయులకు దక్కుతుందో కాలమే నిర్ణయిస్తుంది. నెతన్యాహూ రాజకీయంగా నష్టాన్ని ఎదుర్కొన్నాడనే చెప్పాలి. హమాస్‌ను పూర్తిగా అణచివేయడంలో ట్రంప్ సహకరిస్తాడని ఆశించాడు. కానీ అలా జరగకపోవడం వల్ల అతని దేశంలో తీవ్ర వ్యతిరేకతను కొద్ది రోజుల్లో ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు కూడా ఉండొచ్చు. ఇజ్రాయిల్ చిన్నదేశమైనా, అమెరికా లాంటి రాజ్యాల అండతో మదమతిప్పని విధంగా పాలస్తీనీయుల పట్ల, గాజా పట్ల దాడులతో బాంబులతో, ఆధునిక ఆయుధ సంపత్తితో విపరీత నష్టాన్ని కలగచేసింది. పూర్తిగా అణిచివేసే ప్రయత్నం ట్రంప్ రాజకీయ ఎత్తుగడతో ప్రస్తుతానికి భగ్నమయింది. అయితే లెబనాన్‌లోని హెజబొల్లా, హమాస్ బలం, బలగాలు పెద్దఎత్తున ఈసంవత్సర కాలంలో ఇజ్రాయిల్ చేతిలో చాలావరకు దెబ్బతిన్నాయి. కానీ ఇజ్రాయిల్ ఈ సీజ్‌ఫైర్ ఒడంబడికతో పూర్తిగా శత్రువులను రాజకీయంగా మట్టుపెట్టలేకపోయింది. దీనివల్ల ఏనాటికైనా గాజా కూడగట్టుకున్న బలగాలతో, సానుభూతి పరులతో హమాస్, పాలస్తీనా రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. శాంతి పూర్తిగా సాధ్యపడుతుందని నమ్మటం అందువల్ల కుదరకపోవచ్చు. రెండు రాజ్యాల ఏర్పాటుకు హమాస్, ఇజ్రాయిల్ ఒప్పుకొనే అవకాశాలు



చాలా తక్కువ. ప్రపంచ దేశాలు ఎంతగా ప్రయత్నించినా శాంతికోసం ఎన్నిపాట్లు పడ్డా ఈ పరిస్థితి ప్రస్తుత పరిస్థితులలో సుగమం కాకపోవచ్చు. ఒకవేళ హమాస్ వైపు నుంచి దాడులు మొదలవుతే ఇజ్రాయిల్ ఆ నెపంతో సీజ్ ఫైర్‌ను కాదని తెగింపు ధోరణితో ప్రతిదాడులు పెద్దఎత్తున చేయొచ్చు. హమాస్ దాడుల సాకుతో ట్రంప్ సపోర్టును ఇజ్రాయిల్ సాధించి, ప్రతీకారం తీసుకొనే అవకాశాలు కూడా ఉన్నాయి. హమాస్ పట్టుబడ్డ ఇజ్రాయిలీలను (అందులో ఎక్కువ మంది అమెరికన్లు ఉన్నారు) వదలకపోతే ప్రసిడెంట్‌కాక ముందు ట్రంప్, హమాస్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరిక చేయడం అంత తేలిగ్గా మర్చిపోవడం కష్టం. హమాస్ (హరకత్ అల్-ముఖ్వామా అల్ ఇస్లామియా) పాలస్తీనా ప్రాంతంలోని మిలిటెంట్ గ్రూప్. గాజా ప్రాంతంలోని పడమర భాగాన్ని హస్తగతం చేసుకొని ఇజ్రాయిల్‌తో పాలస్తీనీయుల తరపున దాడులు చేస్తున్న మిలిటెంట్ సంస్థగా భావించవచ్చు. ఇజ్రాయిల్ రాజ్యాన్ని డిఫాక్టోగా గుర్తిస్తుందని కొందరు చెబుతున్నా పాలస్తీనీయులను, గాజాను పూర్తిగా విముక్తి చేయడానికే తీవ్రంగా పాటుపడుతున్నది. ఖతార్ ఆర్థిక సహకారాన్ని హమాస్‌కు అందిస్తుందనే సమాచారం నమ్ముతున్నారు. అంతేగాదు ఎంతవరకు నిజమోకానీ ఖతార్‌కు అమెరికా గుట్టుచప్పుడు కాకుండా ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని కూడా అంటారు. విదేశాంగ విధానాలూ, ఎత్తుగడలూ దౌత్యసంబంధాలు సామాన్యులకు ఒకపట్టాన అంతుపట్టవు. అందుకనే ఎవరు ఏ దేశానికి సహకారం అందిస్తున్నారో ఎవరు ఎవరికోసం పోరాడుతున్నారో మామూలు జనానికి అర్థంకావు. అయితే ఒకటి మాత్రం నిజం. ఇస్లామిక్ దేశాలతో ఇజ్రాయిల్‌కూ- ఇజ్రాయిల్‌తో - ఇస్లామిక్ దేశాలకూ ఏళ్లతరబడి శత్రుత్వం ఉన్న మాటవాస్తవం. అమెరికా యూరప్ దేశాలు ప్రపంచ శాంతి పేరుతో కొన్నాళ్లు తటస్థంగా, యుద్ధాల నివారణకు జోక్యం అవసరమని మరి కొన్నాళ్లు ఇలాంటి దేశాల మధ్య పొగరాజేస్తుంటారు. సీజ్‌ఫైర్ పేరిట సంధి ఒడంబడికలు కొన్నాళ్లు నిప్పును ఆర్పేస్తూనే ఉంటారు. రాజకీయాలు శాశ్వతం కానీ శత్రుత్వాలు శాశ్వతం కావని అంతర్జాతీయ వ్యవహారాలలో నమ్మక తప్పదు. హమాస్ ఇజ్రాయిల్ కనుక రెండు దేశాల ఏర్పాటులో సహకరిస్తేనే శాశ్వతంగా ఈ పోరాటాలకు విముక్తి కలుగుతుంది. రాజకీయ అవసరాలూ, దేశాలమధ్య ఏర్పడుతున్న అనేక ఇబ్బందులు ప్రక్కనపెట్టి నిజాయితీతో ఈ దురదృష్ట ప్రజల అవస్థలు, రెండువైపుల నుంచీ గమనిస్తే హృదయ విదారకమైన దారుణాలతోపాటు, కన్నీరు తెప్పించే వాస్తవాలు బయటకు వస్తాయి. గాజా ప్రాంతంలోని ప్రజలు తిండికి మొహం వాచి అల్లలాడుతున్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడ్తున్నారు. రోగాల బారిన పడి దేవుడా మాకెవరు దిక్కు అని విలపిస్తున్నారు. పాలస్తీనా ప్రాంతంలోని ప్రజలకు ఏదో ఒక విధంగా ప్రపంచ దేశాలు దారి చూపించకపోతే ఈ సీజ్ ఫైర్‌లూ, శాంతిమాటలు కల్లిబొల్లి కబుర్లుగానే మిగిలిపోతాయి. యునైటెడ్ నేషన్స్ఆర్గనైజేషన్ బలమైన దేశాలమాటకు కట్టుబడిన సంస్థగానే మిగిలిపోతుంది. ఎప్పుడో ఏమూలనో యు.యన్ తరపున వ్యవహరించే యు.యన్ పీస్ కీపింగ్ ఫోర్స్ నామమాత్రంగానే సహాయపడ్తుంది. అరబ్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ముఖ్యంగా ఇజ్రాయిల్-లెబనాన్‌ల మధ్య శాంతి తీరాలు సుదూరాన కూడా కనపడటంలేదు. ఎడతెగని దాడులు, ఎన్నిసార్లు ఒడంబడికలు జరిగినా ఇరువైపులా జరుగుతూనే ఉంటాయి. ఈ నిరంతరం నిప్పుల కొలిమిని ఆర్పేదెవరు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో బాటు రష్యా, చైనా, ఇండియా లాంటి దేశాల అధినేతలు, అరబ్బు దేశాలు- ఇజ్రాయిల్ లెబనాన్ దేశాల మధ్య అంతర్జాతీయంగా యు.ఎన్ ఆర్గనైజేషన్‌ను బరిలోకి దింపి ఏకాగ్రతతో, రాజకీయాలనూ, పాతవైరాలనూ దూరం పెట్టి నిజమైన, కొన్నేళ్లపాటు నిలిచిపోయే శాంతి మార్గాన్ని ఏర్పరుస్తేనే ఈ జాతుల వైరం సమిసిపోయే అవకాశంఉంది. అంతటి మహత్తరమైన అసాధారణ ప్రయత్నం అంతర్జాతీయంగా సాధ్యపడుతుందా? ఈ మిలియన్ డాలర్ల ప్రశ్నకు జవాబు ప్రస్తుతానికి కనపడటం లేదు. అయినా సరే ఆశను ఆవిరి కానివ్వకుండా నిరంతరం శ్రమిస్తూ ప్రయత్నించక తప్పదు. ●

# వ్యాపార ప్రయోజనాలు..ఉద్యోగుల ఆరోగ్యాలపై నిర్లక్ష్యం


మహమ్మద్ ఆరిఫ్

ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని, ఆదివారాలు కూడా డ్యూటీకి వెళ్లాలని ఎల్ అండ్‌టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఎంతసేపు ఇంట్లో కూర్చుంటారు? ఎంతసేపు భార్యలను చూస్తూ ఉండగలరు? అని ప్రశ్నించారు. గతంలో ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి, ఓలా సీఈఓ భవిష్ అగర్వాల్ సైతంఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వారానికి 70గంటలు పనిచేయాలనిచెప్పుకొచ్చారు. అంతేకాకుండా 'బాగా తినండి. దృఢంగా ఉండి. అలాగే, రోజుకు 18 గంటలు పనిచేయండి' అంటూ బాంబే షేవింగ్ కంపెనీ సీఈఓ శంతను దేశ్‌పాండే గతంలో లింక్డిన్‌లో పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం అవుతున్నది. ఉద్యోగుల ఆరోగ్యాల గురించి పట్టించుకోకుండా కేవలం లాభాన్నే పరమావధిగా భావించి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే 55 గంటలకంటే ఎక్కువ పని చేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి ఎనిమిది లక్షల మంది మృతిచెందుతున్నట్లు డబ్ల్యూహెచ్ఓ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత 90గంటలు పని చేయాలన్న సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని బాలివుడ్ కథనాయిక దీపిక పదుకొణె పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలను, కంపెనీ వివరణను తప్పుపట్టారు. 90 గంటలు పని చేయాలనే ఆలోచన మాత్రం ఆమోదయోగ్యం కాదని పారిశ్రామిక వేత్త హర్ష్ గోయెంకా స్పందించారు. పనిని, వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేయాల్సిన అవసరముందన్నారు. ఎక్కువ గంటలు పని చేసినంత మాత్రాన ఉత్పాదకత ఏమీపెరగదని, కుటుంబం, మానసిక ఆరోగ్యం ప్రతీ వ్యక్తికి ముఖ్యమని ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ స్పందిస్తూ వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ విషయంలో అనుసరిస్తున్న విధానాలను ఇతరులపైకి రుద్దొద్దని ప్రముఖులకు సూచించారు. ఎక్కువ సేపుపనిలో నిమగ్నమైతే భార్యకూడా పారిపోతుందని పేర్కొన్నారు. ఇక్కడ ఎవరూ శాశ్వతంగా ఉండిపోవడానికి రాలేదని, ఈ విషయం అర్థమైనప్పుడు మన జీవితం సరళంగా మారుతుందన్నారు. కేవలం అభివృద్ధి, వ్యాపార ప్రయోజనాల కోసం కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్యాలపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం సరికాదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎన్ని గంటలు పని చేశామనేది కాదు. ఎంత క్వాలిటీగా పని చేశామనేది ముఖ్యమని ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా అభిప్రాయపడ్డారు. క్వాంటిటీ కన్నా క్వాలిటీయే ముఖ్యమని, ఆదివారాలుతనను చూస్తూ ఉండడమే తన భార్యకు ఇష్టమని సీరమ్ ఇనిస్టిట్యూట్ సీఈఓ అదర్ పూనావాలా పేర్కొన్నారు. పనితో పాటు జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవాలని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విద్యావంతులు, ప్రముఖ కంపెనీల్లో ఉన్నత స్థాయిలో ఉన్నవ్యక్తులే ఇలా మాట్లాడడం సబబు కాదని మాజీ బ్యాడ్మింటన్ స్టార్ గుత్తా జ్వాలా పేర్కొన్నారు. వారానికి 90 గంటలు అంటే ప్రతి రోజు 12 గంటల పాటు పని చేయాల్సిందే. ఒక్కరోజు కూడా సెలవుకూడా ఉండదు. అదే సండే లాంటి రోజుల్లో సెలవుతీసుకొని 90గంటలు భర్తీ చేయాలంటే ఆరురోజుల పాటు13గంటలు పనిచేయాలి. వారానికి 70గంటలు పని చేయాలంటే ఏడు రోజులపాటుసెలవు తీసుకోకుండా రోజుకు పదిగంటలపాటు పనిచేయాల్సి ఉంటుంది. ఆరు రోజుల్లో 70 గంటలు పనిచేస్తే రోజుకు దాదాపు 12 గంటలు పని చేయాల్సిఉంటుంది. అదే ప్రైవేట్ కార్యాలయాల్లో రోజుకు పది గంటల పనితో వారానికి 60 గంటలు పని చేయిస్తున్నారనే చర్చఉన్నది. వారానికి 70 గంటలు పనిచేస్తే అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయని, అకాల మరణం ముప్పు పెరుగుతుందని న్యూరా లజిస్టులు హెచ్చరిస్తున్నారు. 55 లేదా అంతకంటే ఎక్కువ గంటలు పని చేయడం వల్ల హార్ట్‌స్ట్రోక్ వచ్చే ప్రమాదం 35 శాతం పెరుగుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా అధికబరువు, ప్రీడయాబెటిస్, టైప్ 2 మధుమేహంవంటి ప్రమాదంకూడా ఉంటుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా అధిక పని గంటలు అమలు చేస్తే మహిళా కార్మికులపై ఇంకా తీవ్ర ఒత్తిడి పెరిగే అవకాశముంది. ●

# ఉద్యోగ అవకాశాలపై సంక్షోభాల ప్రభావం

డి జె మోహన రావు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉందని కార్మిక మార్కెట్లు పూర్తిగా కోలుకోవడం కష్టమని జనవరి 16వ తేదీనాడు విడుదల చేసిన ప్రపంచ ఉపాధి సామాజిక దృక్పథం పోకడలు 2025 నివేదిక తెలిపింది. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ సంక్షోభాలను అతివ్యాప్తి చేయడం వల్ల ఏర్పడే కార్మిక మార్కెట్ అంతరాయ పరిధి పరిణామాలను నివేదిక కవర్ చేస్తుంది. కార్మికుల సమూహాలలో ప్రపంచ నమూనాలు, ప్రాంతీయ వ్యత్యాసాలు ఫలితాలను విశ్లేషిస్తుంది. ఉత్పాదకత, ఉద్యోగ నాణ్యత, ఉద్యోగ అవకాశాలపై వివిధ సంక్షోభాల ప్రభావం ఈ పోకడలు ప్రపంచవ్యాప్తంగా సామాజిక న్యాయాన్ని ఎలా దెబ్బతీస్తాయనే దానిపై నివేదిక ప్రత్యేక శ్రద్ధచూపుతుంది. 2024లో శ్రామిక శక్తికి అనుగుణంగా ప్రపంచ ఉపాధివృద్ధి చెందిందని, నిరుద్యోగ రేటును 5శాతంగా ఉందని నివేదిక పేర్కొంది. యువత నిరుద్యోగం స్వల్పంగా మెరుగుపడి 12.6 శాతంగా ఉంది. అనధికారిక పని, పని పేదరికం మహమ్మారి పూర్వ స్థాయికి తిరిగి వచ్చాయి. తక్కువ ఆదాయ దేశాలు మంచి ఉద్యోగాలను సృష్టించడంలో చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాతావరణ మార్పుల వ్యయాలు, అపరిష్కృత రుణసమస్యలు వంటి సవాళ్లను నివేదిక ఎత్తి చూపింది, ఇవి కార్మిక మార్కెట్లను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. 2023, 2022లో వరుసగా 3.3, 3.6 శాతంగా ఉన్న ఆర్థికవృద్ధి 2024లో 3.2శాతానికి పడిపోయింది. 2025లో కూడా ఇదే స్థాయిలో వృద్ధి నమోదవుతుందని మధ్యకాలికంగా క్రమంగా క్షీణత నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ అది ఎక్కువగానే ఉంది. వేతనాల విలువను తగ్గిస్తుంది, నివేదిక కనుగొంటుంది. వాస్తవ వేతనాలు కొన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో మాత్రమే పెరిగాయి. చాలా దేశాలు ఇప్పటికీ మహమ్మారి ద్రవ్యోల్బణం ప్రభావాల నుండి కోలుకుంటున్నాయి. ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ అది ఎక్కువగానే ఉందని ఇది వేతనాల విలువను తగ్గిస్తుందని నివేదిక పేర్కొంది. కొన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో నిజమైన వేతనాలు మాత్రమే పెరిగాయి. చాలా దేశాలు మహమ్మారి, ద్రవ్యోల్బణం ప్రభావాల నుండి ఇంకా కోలుకుంటున్నాయి. తక్కువ ఆదాయ దేశాలలో కార్మిక శక్తి భాగస్వామ్య రేట్లు తగ్గాయని, అధిక ఆదాయ దేశాలలో, ప్రధానంగా వృద్ధ కార్మికులు, మహిళల్లో పెరుగుతున్నాయని నివేదిక కనుగొంది. ఏదేమైనా, లింగ అంతరాలు విస్తృతంగా ఉన్నాయి. శ్రామిక శక్తిలో తక్కువ మంది మహిళలు ఉన్నారు. ఇది జీవన ప్రమాణాలలో పురోగతిని పరిమితం




చేస్తుంది. యువతలో భాగస్వామ్యం గణనీయంగా పడిపోయింది. చాలా మంది విద్య, ఉపాధి, శిక్షణ (నీట్)లో లేరు. ఈ ధోరణి ముఖ్యంగా అల్పాదాయ దేశాలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ యువకుల నీట్ రేట్లు మహమ్మారికి ముందు చారిత్రక సగటు కంటే దాదాపు 4శాతం పాయింట్లు పెరిగాయి. ఇది వారిని ఆర్థిక సవాళ్లకు గురిచేస్తుంది. తక్కువ ఆదాయ దేశాలలో నీట్ రేట్లు 2024లో పెరిగాయి. యువకులు 15.8 మిలియన్లు (20.4 శాతం), యువతులు 28.2మిలియన్లు (37.0 శాతం) చేరుకున్నారు. ఇది 2023 నుండి వరుసగా 5 లక్షలు, 7లక్షలు, పెరుగుదలను సూచిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 2024లో 8.58 కోట్ల యువకులు (13.1 శాతం), 17.33 కోట్ల యువతులు (28.2 శాతం) నీట్‌కు హాజరయ్యారు. పని చేయాలనుకుని ఉన్నా కానీ ఉద్యోగం లేని వ్యక్తుల అంచనా సంఖ్య 2024లో 40.2 కోట్లకు చేరుకుంది. వీరిలో 18.6 కోట్ల మంది నిరుద్యోగులు, 13.7 కోట్ల మంది తాత్కాలికంగా పనికి అందుబాటులో లేనివారు, 7.9 కోట్ల మంది నిరుత్సాహపరులైన కార్మికులు ఉద్యోగాల కోసం వెతకడం మానేశారు. మహమ్మారి తర్వాత ఈ అంతరం క్రమంగా తగ్గుతున్నప్పటికీ వచ్చే రెండేళ్లలో ఇది స్థిరపడుతుందని భావిస్తున్నారు. గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీల్లో ఉద్యోగ వృద్ధికి ఉన్న అవకాశాలను ఈ అధ్యయనం గుర్తించింది. సోలార్, హైడ్రోజన్ విద్యుత్ పెట్టుబడులతో ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ఉద్యోగాలు 1.62కోట్లకు పెరిగాయి. ఏదేమైనా ఈ ఉద్యోగాలు అసమానంగా పంపిణీ చేయబడ్డాయి. దాదాపు సగం తూర్పు ఆసియాలో ఉన్నారు. డిజిటల్ టెక్నాలజీలు కూడా అవకాశాలను అందిస్తున్నాయని, అయితే ఈ పురోగతి నుండి పూర్తిగా ప్రయోజనం పొందడానికి చాలా దేశాలకు మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు లేవని నివేదిక పేర్కొంది. సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు గౌరవప్రదమైన పని, ఉత్పాదక ఉపాధి అవసరమనిఐఎల్వో పేర్కొంది. ఇప్పటికే దెబ్బతిన్న సామాజిక ఐక్యత, పెరుగుతున్న వాతావరణ ప్రభావాలు, పెరుగుతున్న అప్పులను నివారించడానికి, కార్మికమార్కెట్ సవాళ్లను ఎదుర్కోవడానికి, న్యాయమైన, మరింత సుస్థిరమైన భవిష్యత్తును సృష్టించడానికి ఇప్పుడు చర్యలు తీసుకోవాలి అని తెలిపింది. ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకు తోడ్పడేందుకు నైపుణ్య శిక్షణ, విద్య, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టాలి. అసమానతలను తగ్గించడానికి సామాజిక భద్రత, సురక్షితమైన పని పరిస్థితులకు మెరుగైన ప్రాప్యతను అందించాలి. తక్కువ ఆదాయ దేశాలు స్థానిక అభివృద్ధికి మద్దతు ఇవ్వడానికి రెమిటెన్స్‌లు, డయాస్పోరా నిధులనుఉపయోగించుకోవచ్చు. దక్షిణాసియాలో సాపేక్షంగా అధిక వృద్ధి రేట్లను సూచిస్తూ నివేదిక భారతదేశవృద్ధి పనితీరు ద్వారా నడపబడుతుందని పేర్కొంది. 2024లో జీడీపీ 6.2శాతం, 2025లో 5.8 శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా వేసిన దక్షిణాసియాలో జీడీపీ పనితీరుకు భారత్ వృద్ధి ఊతమిస్తోంది అని తెలిపింది. 2024లో 6.9శాతంగా, 2025లో 6.4 శాతంగా నమోదవుతుందని అంచనా వేసింది. మానిటరీ పాలసీ సడలింపు, బలమైన దేశీయ డిమాండ్, ప్రభుత్వ పెట్టుబడులే భారత్ వృద్ధికి కారణమని అంతర్జాతీయ మానిటరింగ్ ఫండ్ వంటి అంతర్జాతీయ సంస్థల అధ్యయనాలను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది. ●

# ప్రజావాక్కు



## పరిస్థితి చేయి దాటిపోతుంది!

తెలుగు దేశంపార్టీ సభ్యత్వనమోదు కోటిమందికి చేరుకున్న సందర్భంగా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, కార్యకర్తే అధినేత, కార్యకర్తలు పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారుఅని కీర్తించారు. అయితే ఇదే సందర్భంలో కొంతమంది ఎమ్మెల్యేలు తప్పులు చేస్తున్నారు అనికూడా చెప్పటం జరిగింది. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే కార్యకర్తల పరిస్థితి దయనీయంగా ఉంది. ముఖ్యంగా ఎన్నికల ముందు, తర్వాత పార్టీ కండువా కప్పుకున్న ఇతర పార్టీలనేతలు కార్యకర్తలతో సఖ్యతగా ఉండకపోగా వారినే వేధింపులకు గురి చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరల 2019 ఫలితాలు పునరావృతం అవుతుంది! కనీసం మండల స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి వాస్తవాలు తెలుసుకుంటే నష్ట నివారణకు అవకాశం ఉంటుంది!

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

## యుద్ధానికి ముగింపెప్పుడు?

ఇజ్రాయెల్ పాలన , రష్యా ఉక్రెయిన్ యుద్ధాలు ముగిసి శాంతి నెలకొంటున్ననేపథ్యంలో ఒకశాంతి రేఖ వీస్తుంది. అది ప్రపంచ ఆహార సరఫరా గొలుసులు పైన పాజిటివ్ లైన్‌లో ప్రయాణించేయాలి. ఈశాంతి రేఖలువల్లఇండియా మిడిల్ ఈస్ట్ ఎకనామిక్ కారిడార్ అభివృద్ధిలోకి రావచ్చు. అయితే యుద్ధం వల్ల ఇండియా ఆడిబుల్ ఆయిల్ మిషన్ ప్రారంభించింది. కానీ యుద్ధం మూలంగా ఆ నాలుగు దేశాలు కోల్పోయిన మానవ వనరులు అపారం అయినవి. ఆయిల్‌కొరతతో ఆఫ్రికా యూరప్‌దేశాలు అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఇప్పటికైన శాంతి వెల్లివిరియాలి.

- భారత అవినాష్, జనగామ

## రేషన్ కార్డులలో పిల్లల పేర్లు చేర్చండి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఇవ్వబోయే రేషన్ కార్డులలో పిల్లల పేర్లు చేర్చండి. గత 10 సంవత్సరాల క్రితంనుండి దరఖాస్తు చేసిన పిల్లలపేర్లు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. పిల్లల పేర్లు రేషన్‌కార్డులలో లేకపోవడం వలన కులం సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్, నివాసం సర్టిఫికెట్, ఇతర స్టడీఅవసరాల నిమిత్తం చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. పెండింగ్‌లోఉన్న పిల్లలపేర్లు చేర్చి నూతన రేషన్ కార్డులను ఇవ్వాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## మూడో శనివారం హాలిడే?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి మూడవ శనివారం అన్ని ఆఫీసులకూ నోవర్కింగ్ డేఅని స్కూల్స్ కూడా నో టీచింగ్ డే అని పరిశుభ్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని అందరూ ఉద్యోగులు కూడా పరిశుభ్రతను పాటించాలని, మొత్తం చెత్తను తీసివేయాలని, ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు. ఇది చాలా సంతోషించదగ్గవిషయం. అయితే ప్రైవేటు పాఠశాలలో ఈఅంశాన్ని పాటించరు. ఎందుకంటే ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న పిల్లలు పరిశుభ్రంగా ఉంటారు. వారు డబ్బున్నవారు. చెత్తనితీయడానికి అక్కడ యాజమాన్యం ఆయాలను పని మనుషులని పెడతారు. ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న పిల్లలు చేత చెత్తను ఎత్తడం, చదువు చెప్పకుండా వారి చేత ఈ పనులు చేయించడం కొంచెం బాధాకరంగా అనిపిస్తుంది.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ఉరే సరి

గత కొన్ని నెలల కిందట కోలకత్తాలో జూనియర్ వైద్యురాలు దారుణ హత్యాచారానికి గురై మరణించింది. ఆమె మరణానికి కారకుడైన నిందితుడికి కోర్టు తీర్పు ఇవ్వబోతుంది. దేశ ప్రజలు ఈ తీర్పు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిందితుడికి ఉరి శిక్ష విధించాలని దేశం మొత్తం కోరుతుంది. మహిళలపై ఎక్కడ మరోసారి ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కోర్టు తీర్పు ఇవ్వాలని దేశంలో మహిళలంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. తీర్పు కాస్త ఆలస్యమైనా కానీ నిందితుడు కచ్చితంగా చట్టం చేసిన శిక్షలను తప్పించుకోలేదు. అని ఈ తీర్పు నేరస్తులకు భయం కలిగించాలి.

-శ్రిష్టి శేషగిరి, సికిందరాబాద్

## సోమరులను తయారు చేయకూడదు

ఫిబ్రవరి నెలలో ఢిల్లీలో జరగబోయే ఎన్నికలలో ఇటు ఆప్ పార్టీ, అటు బి.జె.పి, కాంగ్రెసు పార్టీలు పోటా పోటీగా విచక్షణారహితంగా ఉచితాల మీద ఉచితాలను, ఇతర సదుపాయాలను యిస్తామని వాగ్దానాలను ప్రవహింపజేస్తున్నారు. ఇవి పూర్తిగా లంచాల వంటివే. ఇవి పన్నుల రూపేణా చెల్లించే ప్రజల సొమ్ము. ఈ ఉచితాలను నిత్యం విమర్శించే బి.జె.పి. కూడా ఈ రొంపిలోకి దిగిపోయింది. ఏంచేస్తాం? ఈ ఉచితాల వాగ్దానాల మీదనే కదా రాజకీయ నాయకులు తమ ప్రభుత్వాలను నిర్మించుకొనిఆపైప్రజలను లంచాలతో పీడించుకుతినేది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: tpage@vaartha.com)

## పోర్టుల అభివృద్ధి- పురోగతిపై చర్చించిన ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య

**పొన్నలూరు, జనవరి 20, ప్రభాతవార్త**





మంగళగిరిలోని ఏపీ మారిటైం బోర్డు కార్యాలయంలో పోర్టుల అభివృద్ధి- పురోగతిపై ఆ శాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మారిటైమ్ బోర్డు సీఈఓ ప్రవీణ్ ఆదిత్య, సీఎఫ్ఓ దోలా శంకర్, ఏపీ మారిటైం బోర్డు చీఫ్ ఇంజనీర్ జీవీ రాఘవరావు, కాకినాడ ఫోర్టు ఆఫీసర్ ధర్మశాస్త్ర తదితరులు పాల్గొన్నారు. దామచర్ల సత్య మంత్రికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సమీక్ష సమావేశం నందు దామచర్ల సత్య మంత్రితో పలు కీలకమైన ప్రతిపాదనల గురించి చర్చించారు. గోడౌన్‌ల దీర్ఘకాలిక లీజులు, తాత్కాలిక లీజులు, లీజులు పొడిగింపుపై సమీక్షించారు. పెద్దగంజాం దగ్గర నౌకాశ్రయం నిర్మాణానికి సాధ్యసాధ్యాలను పరిశీలించుట, ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్లు 6 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవడం, ఫేస్2 నందు 6 లో కాస్ట్ ఫిషింగ్ హార్బర్ నిర్మించడం మీద, పులికాట్ సదస్సు యొక్క మాత్ ఓపెనింగ్‌కు కావాల్సిన నిధులు మీద చర్చించారు. మంత్రి పలు ప్రతిపాదనలు మీద సానుకూలంగా స్పందించారు. ఈపీసీ పద్ధతిలో చేప్టిన 3 పోర్ట్‌ల ప్రగతిని సమీక్షించి త్వరితగతిన ఆయా పోర్టులను పూర్తి చేయాలని ఆదేశించారు.

## రీ సర్వేకు రైతులు సహకరించండి: ఒంగోలు ఆర్డివో లక్ష్మీప్రసన్న

**సంతనూతలపాడు, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రి సర్వేకి రైతులు సహకరించాలని ఒంగోలు ఆర్టీవో లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామంలో సోమవారం జరిగిన రీసర్వేకు ఒంగోలు ఆర్టీవో లక్ష్మీ ప్రసన్న భూమి పూజ చేసి అనంతరం జరిగిన రీ సర్వే గ్రామ సభలో మాట్లాడారు. రైతులు భూములకు సంబంధించి ముందుగా వారికి రీ సర్వే పై నోటీసులు ఇవ్వాలని ఆర్డీవో లక్ష్మి ప్రసన్న తెలిపారు. రైతులు తమ తమ భూములకు సంబంధించి వారి రికార్డులను అనుసరించి పక్కా వివరాలను రీ సర్వే బృందానికి అందజేయాలన్నారు. ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా రీ సర్వేను ప్రారంభిస్తున్నామన్నారు. దీనిపై గ్రామంలో ర్యాలీలు, అవగాహన సభలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక బృందాలు ద్వారా 200 నుండి 350 ఎకరాలకు ఒక బ్యాకుగా విభజించామన్నారు గ్రామస్తులు భూ యజమానులు సమక్షంలో రీ సర్వే నిర్వహిస్తారన్నారు. పక్క ప్రణాళికతో రీ సర్వేను అమలు చేయనున్నట్టు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు తహసిల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, వీఆర్వో ఏం శ్రీనివాసులు, సర్వేయర్ సంధ్య, గ్రామ నాయకులు మారెళ్ళ రామారావు, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

## గొర్రెల మండి ఏర్పాటు పెంపకందారులకు ప్రయోజనం: ఉగ్ర

**కనిగిరి, జనవరి 20, ప్రభాతవార్త**



గొర్రెల మండి ఏర్పాటు గొర్రెల పెంపకం దారులకు ఎంతో ప్రయోజనకరమని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. కనిగిరి మున్సిపాలిటీలోని పొగాకు బోర్డు సమీపంలో గొర్రెల మండిన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 20 లక్షలు గొర్రెలు సంతతి ఉంటే, ఒక్క కనిగిరి నియోజకవర్గంలో ఐదు లక్షల వరకు గొర్రెలు ఉన్నాయి అన్నారు. గతంలో మార్కాపురం, వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట మండీలకు వెళ్లి అక్కడే విక్రయించుకునే వారని, ప్రస్తుతం



కనిగిరిలో ఏర్పాటు చేసినందువల్ల పశుపోషకులకు లాభదాయకమన్నారు. గొర్రెల పెంపకం దారులు నేరుగా కనిగిరి గొర్రెల మండిలో విక్రయించుకోవచ్చన్నారు. ఆధార్ పాటు రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. గతంలో నేను శాసనసభ్యుడిగా ఉన్న హయాంలో సమయంలో గొర్రెల మండి నిర్మిస్తే దానిని వైకాపా ప్రభుత్వం పూర్తిగా వదిలేసిందన్నారు. కనిగిరిలో త్వరలో మాంసం ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ సహాయ సంచాలకులు డాక్టర్ సీహెచ్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ రమేష్ బాబు, కే.అరుణ, గొర్రెల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు గోపి, కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, షేక్ ఫిరోజ్, బజాజ్ ఓబుల్‌రెడ్డి, డైరెక్టర్లు కనిగిరినియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## పట్టణానికి వెలుగులు నింపండి

### - మార్కాపురం మున్సిపాలిటీలో వెలగని వీధి దీపాలు

**మార్కాపురం, జనవరి 20, ప్రభాతవార్త**



ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ప్రధాన రహదారుల సైతం అంధకారం నెలకొంది. విద్యుత్ స్తంభాలు అలంకార ప్రాయంగా ఉన్నప్పటికి దీపాలు వెలగకపోవడంతో ప్రధాన రహదారులు, పట్టణ అంతర్గత వీధులు వెలుగులకు నోచుకోకపోతున్నాయి. మార్కాపురం పట్టణం మున్సిపాలిటీగా ఏర్పడి ఆ తదుపరి ద్వితీయ మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 50 సంవత్సరాల కాలం పైబడినప్పటికి అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది, పట్టణంలో ప్రధాన కూడళ్లు అయినటువంటి సప్తగిరి సెంటర్, దోర్నాలబస్టాండ్ సెంటర్, గడియారస్తంభం సెంటర్, కంభం బస్టాండ్ సెంటర్, కోర్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, పూల సుబ్బయ్య కాలనీల వరకు విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికి పూర్తి స్థాయిలో దీపాలు పనిచేయకపోవడంతో చీకటి రాజ్యమేలుతోంది. రాత్రి వేళల్లో వెలుగులు చిమ్మవలసిన విద్యుత్ దీపాలు వెలవెల పోతుండటంతో మున్సిపాలిటీ అధికారుల తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. అన్ని రకాల పనులను ముక్కు పిండి వసూళ్లు చేసే పురపాలక శాఖ అధికారులు పట్టణంలో వెలుగులు నింపే విషయంలో పూర్తిగా విఫలమవుతున్నారు. విద్యుత్ దీపాలు వెలిగించండి అంటూ పలు పత్రికల్లో సాంకేతిక మాధ్యమాలలో కథనాలు వచ్చినప్పటికి పురపాలకులుగాని, పురపాలక అధికారులు గాని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక అంతర్గత వీధులలో ఎల్ఈడీ లైట్లు వెలగకపోవడంతో అనేక చోట్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సమయాలలో ఆదివారాలు ఇతర సెలవు దినాలలో వీధి దీపాలను వెలిగించడం అధికారులు మరచిపోతున్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న పట్టణ జనాభాకు తగ్గట్టు మున్సిపాలిటీ రూపుదిద్దుకోవాల్సి ఉండగా మార్కాపురం పట్టణంలో మాత్రం మరి అధ్వాన్నంగా తయారైందని ప్రజలు అంటున్నారు. నీటి సరఫరా పైపులకు కుళాయిలు బిగించే పరిస్థితి కూడా మున్సిపాలిటీకి లేదని, నిధుల లేమితో తల్లడిల్లి పోతున్నామని మున్సిపాలిటీ సిబ్బంది వాపోతున్నారు. పార్టీ పాలన పగ్గాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండి, ప్రభుత్వం మాత్రం తెలుగుదేశం పార్టీది కావడంతో పాలనపరమైన రాజకీయం మున్సిపాలిటీలో నడుస్తుందని, మున్సిపాలిటీ సమావేశాలలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కావడం లేదని కొందరు కౌన్సిలర్లు అంటున్నారు. కనీసం పండుగ పర్వదినాలలో అయినా పట్టణంలో విద్యుత్ దీపాలను అమర్చి విద్యుత్ కాంతులు విరాజిల్లేలా చూడాలని పుర ప్రజలు కోరుతున్నారు.



**ఒంగోలు రోడ్డు హైవేపై కూడా ఇదే పరిస్థితి:**

మార్కాపురం ఒంగోలు రోడ్ల గల హైవేపై కూడా విద్యుత్ స్తంభాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. హైవే అథానిటి వారికి అన్ని రకాల పనులు చెల్లిస్తున్నప్పటికి విద్యుత్ దీపాలు వెలగడం లేదని ప్రజలు అంటున్నారు. మార్కాపురం నుండి రాయవరం వరకు విద్యుత్ దీపాలు ఉన్నప్పటికి అవి వెలిగిన దాఖలాలు లేవు. మార్కాపురం నుండి రైల్వే స్టేషన్‌కు వెళ్లాలన్నా ఈ రహదారి గుండానే వెళ్లాలి. రెండు మార్గాలతో రోడ్డు నిర్మాణం జరిగి మధ్యలో బటర్ఫ్లైలైట్లు కోసం విద్యుత్ స్తంభాలు ఏర్పరిచి ఉన్నప్పటికి అవి ఏనాడు కాంతులను విరజిమ్ముతూ కనపడలేదని అధికారుల తీరుపై ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

## ఎమ్మెల్యే దామచర్లకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఉగ్ర

**కనిగిరి, జనవరి 20, ప్రభాతవార్త**



ఒంగోలు శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు జన్మదిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కలిసి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉంటూ రాజకీయ పయనంలో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని సురేంద్రరెడ్డి, అచ్చాల రవి, ఉండేలా శ్రీనివాసరెడ్డి, భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాది పనుల్లో లక్ష్యాలు పూర్తిచేసేలా పర్యవేక్షించాలి

### - జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఉపాది హామీ పథకం కింద చేపడుతున్న పనులలో లేబర్ బడ్జెట్ టార్గెట్ చేరేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనం నుండి మండల స్థాయి అదికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ పథకాలలో పురోగతిపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం లో కందకం తవ్వకాలు, నీటి వనరులలో పూడిక తీత, అమృత సరోవర్ పథకం కింద చెరువుల అభివృద్ధి, పశు పోషకులకు గోకులం షెడ్డుల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు. ఈ పనుల పురోగతిని ఏపీవోలు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాది హామీ పనులను వేగవంతం చేయటానికి ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉన్నందున ఈ దిశగా నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యం మేరకు పనులను పూర్తి చేసేలా దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ దిశ నిర్దేశం చేశారు. పరిసరాల పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రస్తావించారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కేవలం మూడో శనివారంమాత్రమే కాకుండా పారిశుధ్య పనులను ప్రతి రోజు పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. మీ కోసం కార్యక్రమంలో వస్తున్న అర్జీలలో పంచాయతీ రాజ్ శాఖకు చెందినవి రెండో స్థానంలో ఉన్నట్లు కలెక్టర్ చెప్పారు. అర్జీలను పరిష్కరించడంలో పంచాయతీ సెక్రటరీ, ఈవోపీఆర్డీ నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. వీరి పనితీరును నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ పథకంలో ఈ ఏడాది జనవరి నుండి మార్చి నెలాఖరు మధ్యజిల్లాలో 3594 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ లక్ష్యాన్ని చేరేలా క్షేత్ర స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె దిశ నిర్దేశం చేశారు. మార్కాపురం అర్బన్, పొదిలి, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, ఒంగోలు అర్బన్ ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణ పురోగతి ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం జన్మన్ ఇళ్ల నిర్మాణంలో పురోగతి పైనా దృష్టి సారించాలని చెప్పారు. గ్రామ ,వార్డు సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసులకు సంబంధించి వచ్చిన డబ్బులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకట నాయుడు, జడ్పీ సీఈఓ చిరంజీవి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులలో అంతులేని అవినీతి

**- దాదాపు 3కోట్ల 10 లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తింపు**

**- అందులో ఒక్క కొండపి పంచాయితీలోనే సుమారు 2కోట్ల 85లక్షల అవినీతి**

**- రూ.8,05,551 రికవరీకి పిడి ఆదేశాలు**

**కొండపి, జనవరి 20, ప్రభాతవార్త**

కొండపి మండలంలో ఉపాధిహామీ పనులలో భారీ స్థాయిలో అవినీతి జరిగింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ వారి మండల ప్రజా వేదికలో సామాజిక తనిఖీ బృందం వారు తనిఖీ వివరాలు వెల్లడించారు. కొండపి మండలంలో దాదాపుగా రూ.3,10,59,896ల మేరా వివిధ రూపాలలో అక్రమాలు జరిగినట్లుగా వారు గుర్తించి నివేదికను అందించారు. మండలంలోని 19 పంచాయితీలలో 508 పనులకు రూ.11,10,00,707లు చెల్లింపులు జరిగాయి. ప్రజా వేదికలో సామాజిక బృందం వారు జరిగిన రూ.3,10,59,896ల అవినీతి జరిగిందని అందులో కొండపి పంచాయితీలోనే అత్యధికంగా రూ.2,84,44,717లు జరిగినట్లు సామాజిక బృందం నివేదించారు. పరిశీలించిన పిడి తక్షణమే రికవరీ ద్వారా 19 పంచాయితీల్లో రూ.8,05,551లు వసూలు చేయాలని అధికారులకు ఆదేశించారు. శాఖపరంగా తప్పిదాలు చేసిన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లపై రూ.61,100 జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.

**ఉపాధిపనుల్లో ఖర్చులు, తేడాలయొక్క పూర్తి వివరాలు :**

కొండపి పంచాయితీలో 102 పనులకు సంబంధించి రూ.4,40,46,512 కూలీలకు చెల్లించడం జరిగిందని అందులో సామాజిక తనిఖీ బృందం వారు రూ.2,84,44,717 అవినీతి జరిగినట్లు గుర్తించారు. ఇలవరలో 44పనులకుగాను రూ.82,19,189లు చెల్లించగా అందులో రూ.1,70,710లు తేడా ఉన్నట్లు గుర్తించారు. చోడవరంలో 11 పనులకు గాను రూ.33,97,716లు చెల్లించగా అందులో రూ.15,118లు తేడా ఉన్నట్లు గుర్తించారు. పెట్లూరు పంచాయితీలో 39పనులకుగాను రూ.71,77,542లు ఖర్చుచేయగా అందులో రూ.89,271లు తేడా ఉన్నట్లు వారు గుర్తించారు. గుర్రపడియలో 13పనులకుగాను రూ.11,75,729లు ఖర్చు చేయగా అందులో రూ.67,780లు తేడా ఉన్నట్లు గుర్తించారు. చినకండ్ల గుంటలో 54పనులకుగాను రూ.66,58,015లు ఖర్చుచేయగా అందులో రూ.6,57,010 తేడా ఉన్నట్లు గుర్తించారు. మూగచింతలలో 23 పనులకుగాను రూ.23,39,778లు ఖర్చుచేయ గా అందులో రూ.15,566లు తేడా ఉన్నట్లు గుర్తించారు. అనకర్లపూడిలో 18 పనులకుగాను రూ.36,26,494లు ఖర్చు చేయగా అందులో రూ.4,52,850లు తేడా ఉన్నట్లు గుర్తించారు. వెన్నూరులో 21పనులకుగాను రూ.59,82,521లు ఖర్చుచేయగా అందులో రూ.2,07,102లు తేడా ఉన్నట్లు గుర్తించారు. కెఉప్పలపాడులో 7పనులకు గాను రూ.18,76,914లు ఖర్చుచేయగా అందులో రూ.26,082లు తేడా ఉన్నట్లు గుర్తించారు. నెన్నూరుపాడులో 18పనులకుగాను రూ. 65,10,086లు ఖర్చుచేయగా అందులో రూ.72,021లు తేడా ఉన్నట్లు గుర్తించారు. మిట్టపాలెంలో 24



పనులకుగాను రూ.27,16,105లు ఖర్చుచేయగా అందులో రూ.26,260లు తేడా ఉన్నట్లు గుర్తించారు. ముప్పరాజుపాలెంలో 16 పనులకుగాను రూ.16,07,684లు ఖర్చుచేయగా అందులో రూ.15,173లు తేడా ఉన్నట్లు గుర్తించారు. పెదకండ్లగుంటలో 38 పనులకుగాను రూ.57,97,020లు ఖర్చుచేయగా అందులో రూ.75,632లు తేడా ఉన్నట్లు గుర్తించారు. ముప్పవరంలో 11పనులకుగాను రూ.26,64,768లు ఖర్చుచేయగా అందులో రూ.69,630లు తేడా ఉన్నట్లు గుర్తించారు. కట్టుబడిపాలెంలో 7పనులకుగాను రూ.19,51,455లు ఖర్చుచేయగా అందులో రూ.20,323లు తేడా ఉన్నట్లు గుర్తించారు. పెరదేపిలో34 పనులకుగాను రూ.46,17,913 లు ఖర్చుచేయగా అందులో రూ.5,92,322లు తేడా ఉన్నట్లు గుర్తించారు. చినవెంకన్న పాలెంలో 17పనులకుగాను రూ.29,92,827లు ఖర్చుచేయగా అందులో రూ.11,859లు తేడా ఉన్నట్లు గుర్తించారు. గోగినేనివారిపాలెంలో 16పనులకుగాను రూ.34,91,406లు ఖర్చుచేయగా అందులో రూ.30,270లు తేడాలు ఉన్నట్లు సామాజిక బృందం వారు గుర్తించి నివేదికను అందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి

### - జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి



సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, కుమార్, విజయ జ్యోతిలతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 302 అర్జీలు వచ్చాయి. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపధ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే దామచర్ల జన్మదిన వేడుకలు

**- జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు**

**- ప్రత్యేకపూజల్లో, పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న దామచర్ల కుటుంబం**









**ఒంగోలుటౌన్,ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంత్రులు,ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఎమ్మెల్యే దామచర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు ఏర్పాటుచేసిన భారీకేక్‌ను దామచర్ల కుటుంబ సభ్యులతో కలిసి కట్‌చేశారు. ఒంగోలు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ముందుగా దామచర్ల తల్లిదండ్రుల ఆశీర్వాదాలు తీసుకుని, అనంతరం వల్లూరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని డీజేర్ ట్రస్ట్



ఆధ్వర్యంలో ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు 20 వీల్ చైర్స్, పార్టీ కార్యాలయం నందు 50 మంది పేదలకు తోపుడు బండ్లు, ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో 100 మంది విజేతలకు స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా నాకు శుభాకాంక్షలు తెలియ జేసిన ఎమ్మెల్యేలు, ఇంఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, నా అభిమానులు అందరికీ పేరు పేరున నా కృతజ్ఞతలు తెలిపారు. మీరు చూపించిన ప్రేమ ఆప్యాయతలు ఎప్పటికీ మరువలేనివి, ఎల్లప్పుడు మీ అందరి ఆదరాభిమానాలు ఇలాగే ఉండాలని కోరుకుంటు న్నానన్నారు. దామచర్లకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయులు, ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, ఏలూరి సాంబశివరావు, బియన్ విజయకుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఇంచార్జిలు గొట్టిపాటి లక్ష్మీ, ఏరిక్షన్‌బాబు, నూకసాని బాలాజీ, జిల్లా కమ్మసేవాసంఘం అధ్యక్షులు మండవ మురళికృష్ణ, మేయర్ గంగాడ సుజాత, డిటిసి సుశీల, అధికారులు, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.









## పొగాకు వేలం కేంద్రంలో అందుబాటులో బేలుపట్టాలు



**కొండపి, జనవరి 20 ప్రభాతవార్త**
పొగాకు గ్రైండింగ్ అయిన తరువాత బేలుకు వేసుకునేందుకు పొగాకు వేలం కేంద్రంలో బేలు పట్టాలు అందుబాటు లో ఉన్నాయని వేలం నిర్వహణాధికారి జి సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం బేలు పట్టాలను రైతులకు పొగాకు బోర్డు సభ్యులు బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు రైతుల అభీష్టం మేరకు బేల్ పట్టా సైజును పెంచడం జరిగిందని తెలియజేశారు. అలాగే ప్రతి ఒక్కరైతు తమ బోర్డు పాస్‌పుస్తకమును తప్పనిసరిగా తెచ్చుకుని పట్టాలు తీసుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రసవత్తరంగా సాగిన టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

### - మొదటి బహుమతి సాధించిన కారుమంచి జట్టు
### - క్రీడాస్ఫూర్తిని నింపేందుకే క్రీడల నిర్వహణ



**కొండపి, జనవరి 20 ప్రభాతవార్త**
ప్రతిఒక్కరిలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకే ఆటలపోటీలు నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ కలెక్టర్ ఏ కుమార్ తెలిపారు. సోమవారంతో కొండపిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా ముగిసింది. కొండపి మండల రెవెన్యూ కార్యాలయం మరియు హైస్కూల్ స్థలదాత స్వర్గీయ బూదవాటి సోమయ్య నాయుడు జ్ఞాపకార్థంతో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 9వ తేదీ నుండి 20వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ కారుమంచి జట్టుకు కొండపి హోంటీమ్‌కు మధ్య జరుగగా షీల్డ్‌ను కారుమంచి జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుని రూ.50వేలు నగదును, షీల్డును అతిధుల చేతుల మీదుగా అందజేయడం జరిగింది. రెండవ బహుమతి కొండపి హోం జట్టుకు రూ.30వేలు నగదు, మూడవ బహుమతి దాసిరెడ్డి పాలెం తలయ వాసు జట్టుకు రూ.15వేలు అతిధుల చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ ఏ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి క్రికెట్‌ను ఏర్పాటు చేయడం వలన ఎంతోమంది క్రీడాకారులు చూడడం, వారి నైపుణ్యాలను కూడా చూడడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండపి సర్కిల్ సిఐ జి సోమశేఖర్, తహశీల్దార్ పి మురళి, కొండపి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఎం వెంకటేశ్వర్లు, ఎన్‌ఆర్‌కె యూత్‌ఫోర్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు



**కొండపి, జనవరి 20 ప్రభాతవార్త**
మండలంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ బి పేరయ్య తెలిపారు. సోమవారం పెద్ద కండ్లగుంటలో పశు ఆరోగ్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పశుఆరోగ్య శిబిరాలలో గేదెలకు, దూడలకు, గొర్రెలకు మరియు మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులను అందించారు. గొర్రెలలో వచ్చే బొబ్బ వ్యాధికి ఉచితంగా టీకాలు వేస్తామని తెలిపారు. ఆవులు, ఎద్దులకు ముద్ద చర్మవ్యాధి టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 21గేదెలను పరీక్షించి మందలను పంపిణీ చేశారు. 14 గేదెలకు గర్భకోశ వ్యాధులను గుర్తించి వైద్యం చేశారు. 12గేదెలకు, 34దూడలకు డీమార్మింగ్ మరియు 876 గొర్రెలకు డీమార్మింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది విజయ్ కుమార్, రామస్వామి, తరుణ్, నిరీష, నందిని, నవీన్, క్రాంతి కుమార్, శ్రీను పాల్గొన్నారు.

## మండలంలో 20 నుండి 31వరకు పశువైద్య ఆరోగ్య శిబిరాలు

### - పశువైద్యాధికారి హరిబాబు సాయిచక్రవర్తి

**రాచర్ల, జనవరి 20 ప్రభాతవార్త**
మండలంలోని అన్ని పంచాయితీల్లో ఈనెల 20వ తేదీ సోమవారం నుండి ఈనెల 31వ తేదీవరకు పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రాచర్ల, అనుములవీడు పశు వైద్యాధికారులు డాక్టర్ దేవిరెడ్డి హరిబాబు, వంగల వెంకట సాయి చక్రవర్తిలు తెలిపారు. సోమవారం వారు రాచర్ల, రంగారెడ్డిపల్లి గ్రామాల్లో పశువైద్యశిబిరాలను ప్రారంభించారు. రాచర్లలో డాక్టర్ హరిబాబు, రంగారెడ్డిపల్లిలో డాక్టర్ సాయి చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కోరోజు ఒక్కో పంచాయితీలో ఈ వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పశువులు, జీవాలకు వైద్యచికిత్సలు అందించడం జరుగుతుందని వారు అన్ని రకాల వ్యాధులకు వ్యాధి నివారణ మరియు చికిత్సలు ఉచితంగా అందించడం జరుగుతుందని వారు తెలిపారు. పశువుల్లో చూడి పరీక్షలు, నిర్వరణ గొడ్డుమోతు పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్సలు అన్ని వయసుల గల పశువులకు, దూడలకు, జీవాలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 20వ తేదీ సోమవారం రాచర్ల, రంగారెడ్డిపల్లి, 21వ తేదీ మంగళవారం కాల్వపల్లి, ఎడవల్లి, 22వ తేదీ బుధవారం అనుములపల్లి, గుడిమెట్ట, 23వ తేదీ గురువారం గౌతవరం, ఒద్దులవాగుపల్లి, 24వ తేదీ శుక్రవారం చోళ్ళవీడు, అనుములవీడు, 25వ తేదీ శనివారం చిన్నగానిపల్లి, సోమిదేవిపల్లి, 27వ తేదీ సోమవారం జేపీచెరువు, 28వ తేదీ ఆకవీడు గ్రామాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు. రైతులు ఈ విషయాలు గమనించి ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాచర్ల పశువైద్య సిబ్బంది జి కిరణ్, ఏ శివచరణ్ గౌడ్, మంజు నాయక్, ప్రీతి, రామ్మోహన్ రెడ్డి, అనుములవీడు పశువైద్య సిబ్బంది ఫ్రాన్సిస్, మురళి, కృష్ణప్రియ, సునీల్, ఒంకార్ తదితరులు పాల్గొన్నారు.


## ఆటో డ్రైవర్లు బాధ్యతగా వాహనాలను నడపాలి

### - ఎస్సై కోటేశ్వరరావు



**రాచర్ల, జనవరి 20 ప్రభాతవార్త**
ఆటో డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడపాలని రాచర్ల ఎస్సై పాదర్తి కోటేశ్వరరావు అన్నారు. జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేకంగా వాహనాలు నడిపితే తీవ్ర చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వాహనాలను కూడా అధిక వేగంతో నడపవద్దని, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని, డ్రైవర్ల ప్రక్కన ప్రయాణీకులను కూర్చోబెట్టుకోవద్దని అన్నారు. మరీ ముఖ్యంగా ఆటోకు వెనుక డోర్ ఓపెన్ చేసి ఆ డోర్‌పై ప్రయాణీకులను కూర్చోబెట్టడం కానీ, నిలబెట్టడం కానీ చేయవద్దని ఆటోకు వెనుక డోర్ పూర్తిగా క్లోజ్ చేయాలని అన్నారు. అత్యాశకు పోయి వెనుకడోర్ తీసి ప్రయాణీకులను ఎక్కించుకున్నా, కూర్చోబెట్టినా, నిలబెట్టినా ఆ తర్వాత పోలీసులు తీసుకునే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. మీ అత్యాశపరంగా ప్రయాణీకులను ఎక్కించుకొని వాహనాలు నిపి ప్రమాదాలకు కారణమైతే జరిగానా నష్టాలు ఏవైనా జరిగితే అప్పుడు మీ బాధలు వర్ణనాతీతంగా ఉంటాయన్నారు. కాబట్టి పోలీసు వారి హెచ్చరికలను పాటించి నిబంధనల ప్రకారం వాహనాలు నడుపుకోవాలని అన్నారు. పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తుంటారని తనిఖీల్లో వాహనాలకు సంబంధించి ఎలాంటి ఉల్లంఘనలు కనిపించినా వెంటనే జరిమానాతోపాటు కేసులు నమోదు చేస్తామని ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆయన తెలిపారు. పోలీసులకు సహకరించి నిబంధనల ప్రకారం వాహనాలు నడుపుకోవాలని పోలీసుల సూచనలు సలహాలు పాటించాలని అన్నారు.

## చలువాది నాగేశ్వరరావు సేవలు మరువరానివి



**మర్రిపూడి, జనవరి 20, ప్రభాతవార్త**
ఫెరల్ మినరల్ మైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీ వరలక్ష్మీ మాజీ ఛైర్మన్ చలువాది నాగేశ్వరరావు సేవలు మరువరానివని పలువురు కొనియాడారు. మర్రిపూడిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి గోశాల వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో కీ.శే చలువాది నాగేశ్వరరావు జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చలువాది నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ మర్రిపూడి కొండపై లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఏర్పాటు చేసిన లక్ష్మీనరసింహస్వామి గోశాల వృద్ధాశ్రమం ఏర్పాటులో ఆయన చేసిన సేవలు ఎనలేనివని గుర్తు చేశారు. గోశాల నిర్వహణకు ప్రతి నెల ఆయన ఆర్థిక సహాయం అందిస్తూ గోశాల అభివృద్ధి కొరకు కృషి చేశారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో రేగుల వీరనారాయణ, తుళ్లూరి వెంకట నరసింహారావు, సారెడ్డి పుల్లారెడ్డి, సారెడ్డి యోగిరెడ్డి, గోపవరపు జయరామిరెడ్డి, ఈదుమూడి రవిప్రసాద్, గొంటు నర్సా రెడ్డి, ఈ.గురుబ్రహ్మం, పువ్వాడ వెంకటేశ్వర్లు, గొంటు ఏడుకొండలు, పాలగిరి రమణారెడ్డి, దేవరపల్లి సుబ్బారెడ్డి, సారెడ్డి నరసింహారెడ్డి, రాములు, గురవయ్య, గోశాల కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## మహిళలను విద్యావంతులు చేయటమే ఉల్లాస్ కార్యక్రమం



**మార్కాపురం రూరల్, జనవరి 20 ప్రభాతవార్త**
మండల కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని స్థానిక ఎస్సీ, బిసి కాలనీలోగల డ్వాక్రా బజారు నందు సోమవారం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా స్వచ్ఛంధంగా మహిళలకు చదువు నేర్పించేందుకు ముందుకు వచ్చిన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం వెలుగు ఏపిఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శ్రీనివాసులు మాట్లాడుతూ కుటుంబంలో గ్రామీణ ప్రాంతంలోని ప్రతి మహిళ అక్షరజ్ఞానం కలిగి ఉండాలని, కుటుంబంలో మహిళ చదువుకున్న వ్యక్తి అయితే ఆ కుటుంబం అన్ని విధాలుగా మంచి అభివృద్ధిని సాధిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఉల్లాస్ కార్యక్రమం చేపట్టిందని అందులో భాగంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని, స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి మహిళలకు బోధించబోతున్న వాలంటీర్ ఉపాధ్యాయులను కోరారు. మహిళలు చదువు నేర్చుకోవడం వలన సమాజంలో అనేక ఉపయోగాలు ఉన్నాయని వారికి వివరించాలని తెలియజేశారు. మహిళలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రభుత్వం పుస్తకాలను రూపొందించిందని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ కార్యక్రమం బోధన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, ఎంఈఓ రాందాస్ నాయక్, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్ ఝాన్సీ, సిసిలు నాగయ్య, మనోకుమారి, వివోఏలు, వాలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

## మార్కాపురంలో రీ సర్వేను ప్రారంభించిన తహశీల్దార్ చిరంజీవి



**మార్కాపురం రూరల్, జనవరి 20, ప్రభాతవార్త**
మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు తహశిల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తహశిల్దార్ చిరంజీవి టెంకాయ కొట్టి రీ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశిల్దార్ చిరంజీవి మాట్లాడుతూ మార్కాపురం మండలంలోని కృష్ణాపురం గ్రామం నందు రీ సర్వే ప్రారంభించామని మొత్తం 149ఎకరాల 32సెంట్ల భూమి ఉండగా సోమవారం 10ఎకరాల 32సెంట్ల భూమిని గ్రౌండ్ ట్రూథింగ్ మరియు నిర్ధేశించిన విధానం ప్రకారం రోబర్‌తో కొలిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సంజీవయ్య, విఆర్ఓ వెంకటేశ్వర్లు, కృష్ణాపురం గ్రామ సర్వేయర్ గోవిందు అరుంధతి, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యం

### - మిర్చి కోత కూలీలకు బస్సులు ఏర్పాట్లు
### - పోలీసు శాఖ నిర్ణయానికి ప్రజల హర్షం





**మార్కాపురం, జనవరి 20, ప్రభాతవార్త**
రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీసు శాఖ విశేషంగా కృషి చేస్తుందని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మిర్చి కోతలకు వెళ్లే కూలీలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం పట్టణంలోని పాయింట్లలో మిర్చి కోతలకు వెళ్లే కూలీల కోసం ఆర్టీసీ డిపో మేనేజర్ నరసింహం, ఎంవీఐ మాధవరావుల నేతృత్వంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. మిర్చి కోత కోసం సంబంధిత కాంట్రాక్టర్లు కూలీలను ఏర్పాటు చేసుకొని ఆటోలలో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని తీసుకెల్లడం జరుగుతుందని ఇటువంటి సమయంలో జరుగుతున్న ప్రమాదాలలో ఎందరో ప్రాణాలను కోల్పోగా మరెందరో క్షతగాత్రులుగా మిగులుతున్నారని, వీటి నిరోధానికి జిల్లా ఎస్పీ నడుం బిగించాలని తెలిపారు. కూలీ నాలీ చేసుకుని జీవనం సాగించే వారిలో ఏ ఒక్కరు క్షతగాత్రులుగా మిగిలిన ప్రాణం నష్టపోయిన ఆ కుటుంబ రోడ్డున పడుతుందని అందుకోసం నిరంతరం మిర్చి కోత కార్మికులకు, ఆటో యజమానులకు డ్రైవర్లకు నిరంతరం అవగాహన కల్పించడం జరిగిందని, చివరికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి వారిని కోత ప్రదేశానికి తీసుకెళ్లడం, తిరిగి సాయంత్రం గమ్యస్థానాలను చేర్చడం జరుగుతుందని వివరించారు. అలాగే రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులతో పాటు పట్టణ గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం ఓవర్ లోడింగ్ ట్రిబుల్ రైడింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, వాడకం ఇలాంటి విషయాలపై కూడా నియమ నిబంధనలతో కూడిన అంశాలను వివరించడం జరుగుతుందని మోటార్ వాహనాల చట్టాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు సీఐ పి.సుబ్బారావు తెలిపారు. ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసే విషయంలో చొరవ చూపిన డీఎస్పీ యు.నాగరాజుకి, సీఐ పి.సుబ్బారావు, ఎస్సై సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమరావులకు వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రజలు కోత కూలీల యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



**వెలిగండ్ల, జనవరి 20, ప్రభాతవార్త**
ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు జన్మదిన వేడుకలు పురష్కరించుకుని ముందస్తుగా మండలంలోని గుడిపాటిపల్లిలో టీడీపీ యూత్ నాయకులు క్రికెట్ టోర్నమెంట్‌ను గత వారం రోజుల నుండి నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఇవాళ ఫైనల్ మ్యాచ్ జరగడం జరిగింది. ఈ ఫైనల్‌లో పీఎన్ వరం జట్టు మొదట బహుమతిని గెలుపొందడం జరిగింది. ఈ ప్రైజ్‌ను ప్రముఖ పారిశ్రామిక వేత్త అండ్ టీడీపీ సీనియర్ నాయకులు శ్యామల కాశిరెడ్డి రూ.20,116, రెండో బహుమతి ప్రముఖ పారిశ్రామిక వేత్త అండ్ టీడీపీ నాయకులు చిలకల కృష్ణారెడ్డి రూ.15,116, మూడో బహుమతి స్థానిక టీడీపీ మహిళా నాయకురాలు, మాజీ ఎంపీటీసీ సభ్యులు చేనేత నర్సమ్మ రూ.10,116 ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్‌కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు ముక్కు వెంకటేశ్వర్లురెడ్డి, రైతు అధ్యక్షులు గుంటక నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు బేతం మనీష్, గోనా దేవదాస్, యటగిరి చిన్న రాజు, నారాయణ బాబు, వెన్నా వెంకటేశ్వర్లురెడ్డి, గోనా ఆమోష్, రిటైర్డ్ టీచర్‌లు గోనా డేవిడ్ సాల్మన్, దాసు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 26వ తేదిన జరిగే ట్రాక్టర్,బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి



**యర్రగొండపాలెం,జనవరి20,ప్రభాతవార్త**
ఈనెల 26వ తేదిన జరిగే ట్రాక్టర్,బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం నియోజకవర్గ సమావేశంలో నిర్వహించారు. ఈ సమేవేశానికి నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ దేశప్రధాని నరేంద్రమోడి చట్టబద్దత కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని,డీల్లీ సరిహద్దుల్లో అమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని కాపాడాలని దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.సుప్రింకోర్టుజోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను పరిష్కరించి,దళయవాదుల ప్రాణాలను కాపాడమని పదేపదే చేసిన విజ్ఞప్తిమేరకు చిట్టచివరకు ఫిబ్రవరి 14వ తేదిన చర్చలకుకేంద్ర ప్రభుత్వం ఆహ్వానించడం శుభ పరిణామన్నారు.ఇచ్చిన హామిని అమలు చేయాలని కోరుతూ జనవరి 26న దేశవ్యాప్తంగా విత్తన చట్టాన్ని అమలు చేయాలని,రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని,745మంది పైగా మరణించిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని,నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్కెటింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్లతో జనవరి 26వ తేదిన జరిగే ట్రాక్టర్లు,బైక్ ర్యాలీల కార్యక్రమంలో రైతులు,రైతు సోదరులు,రైతు కూలీలు ఎక్కువ సంఖ్యంలో పాల్గొని ఈ దేశంలో ఉన్న రైతాంగానికి అనుకూలంగా ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు.సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ మాట్లడుతూ పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతైన పులసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు తగిన నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కోటకట్ల రిజర్వాయర్ ను,టీ5 కాలువను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమామేశంలో రైతు సంఘ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు టిసిహెచ్ చెన్నయ్య,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వి.కృష్ణగౌడ్,సిపిఐ మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య,నూర్జహాన్,ఏఐటియుసి నాయకులు ఆవుల యెగయ్య,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర యువ కాపునాడు వైస్ ప్రెసిడెంట్‌గా

### పల్లప్రోలు అంజనీయ తేజ నాయుడు



**చిన్నగంజాం, జనవరి 20, ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా చిన్నగంజాం సోపిరాల గ్రామానికి చెందిన పల్లప్రోలు ఆంజనీయ తేజ నాయుడును రాష్ట్ర యువ కాపునాడు వైస్ ప్రెసిడెంట్ (బాపట్ల పార్లమెంట్)గా సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు ప్రెసిడెంట్ పి.చైతన్య ముహన్ నియమించారు. ఈ నియామకం అందుకున్న సందర్భంగా పల్లప్రోలు అంజనీయ తేజ నాయుడు మాట్లాడుతూ కాపునాడు సంఘ అభివృద్ధికి పాటుపడుతూ కాపు యువత అండగా ఉండేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకి రాష్ట్ర యువ కాపునాడు వైస్ ప్రెసిడెంట్ నియామకానికి సహకరించిన నేషనల్ కాపునాడు ప్రెసిడెంట్ జి.సుబ్రహ్మణ్యం, పి.చైతన్య ముహన్, కాపునాడు పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర యువ కాపునాడు వైస్ ప్రెసిడెంట్ ఎంపికైన సందర్భంగా కాపు పెద్దలు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన డీజేఎఫ్ ప్రతినిధులు

### - జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, వేదింపులు అరికట్టాలని ఫిర్యాదు



**చీరాల, జనవరి 20, ప్రభాతవార్త**
భారత ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ సభ్యులుగా గుర్తింపు పొందిన జర్నలిస్టులపై భౌతికదాడులు, హత్యాప్రయత్నాలు వేదింపలు జరుగుతున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సోమవారం ఉదయం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డెమోక్రటిక్ జర్నలిస్టు ఫోరం బాపట్ల జిల్లా ప్రతినిధులు కలెక్టర్ జే.వెంకటమురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించే విధంగా తగు చర్యలు చేపట్టాలని డీజేఎఫ్ ప్రతినిధి ఊదరగుడి స్టాలిన్‌బాబు కలెక్టర్‌ను కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు నివేశన స్థలాలు మంజూరు చేయడమే గృహాలు నిర్మిస్తామని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి బహిరంగ ప్రకటన చేసిన నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు ఇండ్ల స్థలాలు పొందిన జర్నలిస్టులను మినహాయించి ఇప్పటి వరకు జర్నలిస్టు కోటాలో నివేశన స్థలాలు పొందని వారికి ప్రాధాన్యత ఇవ్వాలని డీజేఎఫ్ ప్రతినిధి ఎన్.నాగార్జున రెడ్డి కలెక్టర్‌ను కోరారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలో బెజ్జం మురళీకృష్ణ అనే జర్నలిస్టు కుటుంబానికి చెందిన ఇంటి స్థలంను కుట్రపూరితంగా వ్యవహరించిన స్థానిక తహశీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇతరులకు కట్టబెట్టే దురుద్దేశంతో మురళీకృష్ణను కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నాని డీజేఎఫ్ ప్రతినిధి పేరం సతీష్ కలెక్టర్‌దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ప్రైవేటు స్కూల్ యాజమాన్యములు 50 శాతం రాయితీ ఫీజు అమలు చేయు విధంగా తగు చర్యలు తీసుకోవాలని డీజేఎఫ్ ప్రతినిధి బడుగు విజయ భరత్ కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారిణి పి.గ్లోరియాను విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పాదర్తి పవన్ కుమార్, కే.రామాంజనేయులు, కే.రవికుమార్, ఆర్.రవి, సీహెచ్ చిన్నా, రాబర్ట్ వెస్లీ, ఇందూరి చిన్నబాబు తదితరులు ఉన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు

### నంఎస్సై పి కోటేశ్వరరావు



**రాచర్ల, జనవరి 20 ప్రభాతవార్త**
బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, పొగత్రాగడం చేయరాదని ఎస్సై పి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన ఆటోడ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ ఈ విషయాన్ని తెలియజేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా బహిరంగంగా మద్యం సేవించడం పొగత్రాగడం చట్టరిత్యా నేరమని అలాంటి కార్యక్రమాలు చేయవద్దని అన్నారు. పోలీసువారు నిత్యం గ్రామాల్లో తిరుగుతుంటారని పోలీసులు హెచ్చరికలు ఎవరూ బేఖాతరు చేసినా ఉపేక్షించబోమని ఆయన అన్నారు. శాంతిభద్రతలుక విఘాతం కలిగించినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## బిజేపి అధ్యక్ష ఎన్నికలలో పాల్గొన్న గిద్దలూరు బిజేపి నాయకులు



**గిద్దలూరు రూరల్, జనవరి 20 ప్రభాతవార్త**
ఒంగోలు భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు ప్రకాశం జిల్లా ఆర్ఓ షేక్ భాజీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిసజిల్లా అధ్యక్షుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కార్యక్రమంలో జిల్లా నాయకులతోపాటు గిద్దలూరు బిజేపి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షులు పివి శివారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ నరాల శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, గిద్దలూరు పట్టణాధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, కొమరోలు మండల అధ్యక్షులు వి వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ నాయకులు సెగ్గం శ్రీనివాసులు, సీనియర్ నాయకులు పులి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు సరసనగండ్ల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు త్రోవగుంట శ్రీనివాసులు, బిజేవైఎం జిల్లా అధ్యక్షులు దామోదర్, సీనియర్ నాయకులు కె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతంగా కృష్ణవేణి చరితం నృత్య రూపకం

### వేడుకగా కోలాట ప్రదర్శన



**ఒంగోలు కల్చరల్ జనవరి 20 (ప్రభాతవార్త)ఒంగోలు**
రంగారాయుడు చెరువు దగ్గర పివిఆర్ బాలుర హై స్కూల్ మునిసిపల్ పబ్లిక్ గ్రౌండ్ ఎన్ టి ఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ టి ఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు అత్యంత వైభవంగా జరుగు తున్నాయి. ఈదర హరిబాబు అధ్యక్షతన, కార్యదర్శి అన్నమనేని ప్రసాద రావు , ఇతర కమిటీ సభ్యుల సహకారంతో వారోత్సవాలలో భాగంగా మూడవరోజు సోమవారం రాత్రి వివిధ కార్యక్రమాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, కందుకూరు మాజీ శాసనసభ్యులుదివి శివరాం తదితరులు పాల్గొన్నారు. మొక్కలు పెంచే విధానం, విత్తనాల పంపిణీ, రైతు వేషధారణ పోటీలు నిర్వహించారు. వినుకొండ ఈదర గ్రామాల వారిచే మాస్టారు కూచి బ్రహ్మయ్య నిర్వహణలో లక్ష్మీనారాయణ కోలాట సమాజంలో 36 మంది కళాకారులు పాల్గొని కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చందు డాన్స్ అకాడమీ సారధ్యంలో త్రోవగుంట చందు నృత్య దర్శకత్వంలో నెమ్మాని సీతారామమూర్తి రచించిన కృష్ణవేణి చరిత్రం ప్రదర్శన జరిగింది. కృష్ణానది మహాబలేశ్వర్‌లో పుట్టిన దగ్గర నుంచి, హంసలదీవిలో సముద్రంలో కలిసే వరకు. సంస్కృతి నాగరికత చరిత్ర మొదలైనవి కళాకారులు అద్భుతంగా నర్తించారు. ముఖ్యంగా అమరావతి ఘట్టంలో, బౌద్ధ సంస్కృతి పరిణతను , ఆనాటి నగర వైభవ సౌభాగ్యాన్ని , శాతవాహన వీరుల పౌరుషాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. ఈ విధంగా నృత్య రూపకం చివరి వరకు కృష్ణానది చరిత్రను దాని చుట్టూ వెలసిన సంస్కృతులను తెలిపే విధానం ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునే లాగా నృత్య రూపక ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా 33వ డివిజన్‌లో ముంగమూరు డొంక సత్య సాయి బాబా మందిరం దగ్గర ఏర్పాటుచేసిన 33వ డివిజన్ టిడిపి నాయకులు నల్లూరు రవి, అర్చక స్వామి రాము శర్మ శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా 33వ డివిజన్‌లో ముంగమూరు డొంక సత్య సాయి బాబా మందిరం దగ్గర ఏర్పాటుచేసిన 33వ డివిజన్ టిడిపి నాయకులు నల్లూరు రవి, అర్చక స్వామి రాము శర్మ శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 26న అద్దంకిలో ఎస్సీ,ఎస్టీ, బిసి మైనార్టీల ఆత్మీయ సమావేశం

**కొరిశపాడు , జనవరి 20 , ప్రభాతవార్త**



మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ఎస్సీ,ఎస్టీ, బిసి మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఐక్యతగా వుండాలని వారు సమావేశంలో తీర్మానించారు . ఐక్యతగా వుంటేనే ఆయా పార్టీలలో క్రియాశీల పాత్ర పోషిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 26వ తేదిన అద్దంకిలో ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టీల ఆతీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోశయ్య, రమేష్, సతీష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మందు ప్రభావం వలన మొక్కజొన్న పంట నష్టం

**జె.పంగులూరు , జనవరి 20 , ప్రభాతవార్త**



గుంటూరులోని లాం ఫారం నుండి డా.ఎస్. ప్రతిభ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ (అగ్రనమి) డా.దయానా గ్రేస్ సైంటిస్ట్ (ఎంటమాలజీ) మరియు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, మార్టూరు కెవి శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు మార్టూరు రైతులతో కలిసి కలుపు మందు పిచికారి చేసిన కొండమూరు మరియు రేణింగవరం మొక్కజొన్న పైరును పరిశీలించారు, అనంతరం రైతులనుండి కలుపు మందు పిచికారి చేసిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరియు ఎదుగుదల లేని మొక్కలను మోముఎండిన మొక్కలను పరిశీలన నిమిత్తం వెంట తీసుకు వెళ్లినారు. ఈ విధముగా జరుగుటకు గల కారణాలను పరిశీలించి నివేదికను పంపుతామని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిభశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలుపు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించవలెనని, కలుపు మందులు పచికారి చేయనప్పుడుతప్పనిసరిగా నిపుణుల సలహాలు సూచనలు తీసుకోవాలనిమరియు మందు మోతాదులను నీటి పరిమాణమును సూచించిన మేరకు పిచికారి చేసుకోవాలని తెలిపారు. వారి వెంట స్థానిక వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి, వ్యవసాయ సహాయకుడు జె.దినేష్ మరియు రైతులు వున్నారు.

## గుంటుపల్లిలో రీ సర్వే ప్రారంభం

**బల్లికురవ, జనవరి 20, ప్రభాతవార్త**



మండలంలోని గుంటుపల్లి గ్రామంలో సోమవారం పట్టా భూములలో రీ సర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, ప్రహర్ష, గ్రామ సర్వేయర్లు, సంబంధిత రైతులు పాల్గొన్నారు. ఈ రీసర్వే పక్రియ గుంటుపల్లి గ్రామంలో నెల రోజులు పాటు కొనసాగుతుందని, రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి రోజు రీ సర్వే జరిగే సమయంలో సంబంధిత పత్రాలతో హాజరై అధికారులకు తమ వంతు సహకారం అందజేసి విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అశోక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరాలు ప్రారంభం

**బల్లికురవ, జనవరి 20, ప్రభాతవార్త**



గ్రామీణ ప్రాంతాల్లోని పశు సంపదను మరితంగా అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సోమవారం నుండి పశువైద్య ఆరోగ్య శిబిరాలను ప్రారంభించింది. ఈ క్రమంలో భాగంగా మండలంలోని వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాలలో నట్టల నివారణ మందులు 135 దూడలకు, 52 గేలెకు, 316 గొర్రెలు, మేకలకు తాపించడం జరిగింది. 56 పశువులకు గర్భకోశ వ్యాధులకు, చికిత్స నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.మహేశ్వరరావు, డాక్టర్ ఆర్.పావని కుమారి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

**బల్లికురవ, జనవరి 20, ప్రభాతవార్త**



ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వాగు పోరం బోకు భూములు, కొండ పోరంబోకు భూములు, దేవాదాయ శాఖ భూములు ఆక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే నెంబరు 789ఏ లో వాగు పోరంబోకు భూములలో గ్రానైట్ ఫ్యాక్టరీల నిర్వాహకులు వ్యర్థాలను డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో దీనిపై ఆయన స్పందించారు. ప్రభుత్వ భూముల్లో గ్రానైట్ వ్యర్థాలు తోలుతున్న ఫ్యాక్టరీ నిర్వాహకులను పిలిపించి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని తహశీల్దార్ రవినాయక్‌కు సూచించారు. అదే విధంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని తహశీల్దార్‌కు సూచించారు.

## నేటి నుండి సామాజిక తనిఖీలు

**బల్లికురవ, జనవరి 20, ప్రభాతవార్త**

మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి నేటి నుండి సామాజిక తనిఖీ కార్యక్రమాలు జరగనున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి తెలియజేశారు. ఇందులో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సిబ్బందితో ఆమె ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.

## పెద్దవెంకన్నపాలెంలో పశు ఆరోగ్య శిబిరం

**పొన్నలూరు, జనవరి 20, ప్రభాతవార్త**



పొన్నలూరు మండలంలోని పెద్ద వెంకన్నపాలెంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధుల చికిత్స, చూలు కట్టకుండా తిరిగి పోర్లే పశువులకు చికిత్స చేయడం జరిగింది. గ్రామంలో ఉన్న గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణ మందులు తాపించడం జరిగింది. దీంతో పాటు గొర్రెలలో బొబ్బవ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయడం జరిగింది. పశువుల నుండి అధిక పాల ఉత్పత్తి పొందడానికి మినరల్ మిక్చర్ ప్యాకెట్‌ను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు చల్లా శ్రీను, చౌటపాలెం పశువైద్యాధికారి డాక్టర్ జే.శివరామకృష్ణ, చెన్నయ్య, తాతారావు, పశుసంవర్ధక సహాయకుడు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పులిపాడులో పశువైద్య శిబిరం

**- పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మీ**

**ముండ్లమూరు, జనవరి 20, ప్రభాతవార్త**



మండలంలోని పులిపాడు గ్రామం నందు సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ పశువైద్య శిబిరానికి ముఖ్య అతిధిగా పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ ఈ పశు వైద్య శిబిరంలో ఆవులు గేదెలకు గర్భకోస సమస్యలు దూడలకు నట్టల నివారణ గొర్రెలు మేకలకు నత్తల నివారణ మరియు బొబ్బ టీకాలు వేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 25 పశువులకు ఎదకు రావడానికి ఉచితంగా మెడిసిన్ ఇవ్వడం జరిగిందన్నారు. అది దూడలకు నట్టల నివారణకు మందులు తాపడం జరిగిందన్నారు. పది గేదెలకు చూడి నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కమల్ల శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నాయకులు ఏరాసి వెంకటేశ్వర్లురెడ్డి, రమేష్, వీఐఎస్ కే.కోటిలింగం, గోపాల్ మిత్ర టి.నాగరాజు, ఈ చిన్న ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఖోఖో ప్రపంచ కప్‌లో ఈదర కుర్రోడు సత్తా

**ముండ్లమూరు, జనవరి 20, ప్రభాతవార్త**



ఢిల్లీలో జరిగిన ఖోఖో ప్రపంచ కప్‌లో భారత్ జట్టు విజేతగా నిలిచింది. జట్టు విషయంలో పోతిరెడ్డి శివారెడ్డి కీలక పాత్ర పోషించాడు. అతనిది ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఈదర గ్రామం. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన శివారెడ్డి భారత జట్టుని విజేతగా నిలపడంతో ముండ్లమూరు వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పశువైద్య చికిత్స శిభిరాలను ప్రారంభించిన బోనేని

**కొమరోలు, జనవరి 20 ప్రభాతవార్త**




మండలంలోని హసనాపురం గ్రామంలో సోమవారం డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పశువైద్య ఆరోగ్య శిభిరాల క్యాంపును కొమరోలు మండల టిడిపి అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ కుమార్ పశువులకు టీకాలు వేసి పాడిపశువులు అనారోగ్యానికి గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై డాక్టర్ వినోద్ కుమార్ పశుపోషకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయితీల్లో ఈ పశుఆరోగ్య వైద్యశిభిరాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లుగా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఇంద్రజ, పశుసంవర్ధకశాఖ సహాయకులు పాలుగుళ్ళ మోహన్ రెడ్డి, రావూరి చంద్రశేఖర్, ఖాజాబీ, జ్ఞాన ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ముత్తుములకు ధన్యవాదములు తెలిపిన మాజీసైనికోద్యోగులు

**గిద్దలూరు రూరల్, జనవరి 20 ప్రభాతవార్త**



గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డిని మాజీ సైనికులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు మాట్లాడుతూ గిద్దలూరు పట్టణంలోని నంద్యాల హైవే రహదారిలోని మాజీ సైనికుల క్యాంటీన్ వద్ద సరైన రోడ్డు వసతిలేక, గుంతలరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వెంటనే స్పందించి గుంతల రోడ్డుపై మట్టిరోడ్డు వేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. దేశసైనికలపట్ల ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఎంతో అభిమానంతో ఉన్నారని, తమకు సమస్య ఉందని తెలియగానే స్పందించి ఆర్మీక్యాంటీన్ వద్ద రోడ్డు వేయించడం జరిగిందని వారికి గిద్దలూరు మాజీ సైనికుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ జిసి అంకన్న, కెప్టెన్ ఎం కోటారెడ్డి, నరేంద్ర ప్రసాద్, లక్ష్మీరంగయ్య, సతీష్, దేవసహాయం, అంకన్న, శ్యాంసన్, కెపి వెంకటేశ్వర్లు, బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి ప్రతిరూపం నారా లోకేష్

**- ఎంహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఖలీల్**

**గిద్దలూరు రూరల్, జనవరి 20 ప్రభాతవార్త**



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మానవత్వానికి ప్రతిరూపమని ఎంహెచ్‌పిఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ ఖలీల్ అన్నారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ మస్కట్‌లో కడపకు చెందిన వ్యక్తి మృతిపై ట్విట్టర్ ద్వారా నారా లోకేష్‌కు మృతదేహాన్ని త్వరితగతంగా భారతదేశానికి తరలించాలని విన్నవించడంతో వెంటనే ఆయన ట్విట్టర్‌లో స్పందించారని అన్నారు. జీవనోపాధికోసం మస్కట్ వెళ్ళి కడపకు చెందిన అన్సారి మృతిచెందడం అత్యంత బాధాకరమని వారి మృతదేహాన్ని భారతదేశానికి తరలించేందుకు సాధ్యమైన ఏర్పాటు చేస్తామని, అన్సారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ట్విట్టర్ ద్వారా స్పందించడం నారా లోకేష్ మానవత్వానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ప్రతిఒక్కరు నారా లోకేష్‌కు అభినందనలు తెలుపుతున్నారని అన్నారు. సమస్యను విని వెంటనే స్పందించి తోడ్పాటుకు కృషిచేస్తున్న లోకేష్‌కు ఈ సందర్భంగా ఖలీల్ ధన్యవాదాలు తెలిపారు.

## రవాణా శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

**- ఎంవీఐ ఇన్‌స్పెక్టర్ పి.రవికుమార్**

**దర్శి, జనవరి 20, ప్రభాతవార్త**



26వ జాతీయ రహదారి రోడ్డు భద్రతా మాసోత్సవాలలో ఈనెల 16వ తేదీ నుండి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరుగును. ఇందులో భాగంగా సోమవారం లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు స్కూల్ బస్సులు డ్రైవర్లకు కంటి పరీక్షలు యూనిట్ కార్యాలయం దర్శి నందు ఏర్పాటు చేయడమైంది. ఈ వైద్య శిబిరం మోటారు వాహనముల తనిఖీ అధికారి పి.రవికుమార్ ప్రారంభించారు. దర్శి లయన్స్‌క్లబ్ వారి సహకారంతో దాదాపు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. డాక్టర్ గీత పద్మ, మోటార్ వాహన తనిఖీ అధికారి పి.రవికుమార్, లయన్స్‌క్లబ్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, వైస్ సెక్రటరీ ఎన్.మధు, వైస్ ప్రెసిడెంట్ స్వాములు, రవాణా శాఖ సిబ్బంది, హోమ్‌గార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

## టైరు పంచర్ కావడంతో బొలేరో వాహనం బోల్తా

**- క్షతగాత్రులను పరామర్శించిన సర్పంచ్ అనూష**

**త్రిపురాంతకం, జనవరి 20 ప్రభాతవార్త**





టైర్ పంచర్ కావడంతో బోలేరో వాహనం బోల్తా పడిన సంఘటన దూపాడు గ్రామ పంచాయితీ పరిధిలోని దీవెపల్లి గ్రామం వద్ద సోమవారం ఉదయం తెల్లవారుజామున4.30గంటల సమయంలో చోటు చేసుకుంది.అందిన సమాచారం మేరకు మంత్రాలయం నుండి గుంటూరుకు వలసకూలీలు ప్రయాణిస్తున్న బొలేరో వాహనం బోల్తాపడిన ఘటనలో సుమారు 7మంది కూలీలకు గాయాల య్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా వైద్యం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న దూపాడు గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎనిబేర అనూష ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఘటన తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు.అలాగే కూలీలు ప్రయాణిస్తున్న వాహనాల విషయంలో జాగ్రత్తలు వహించాలని పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించవద్దని ఆమె కోరారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**ఎస్సై పి అనీల్ కుమార్**

**పెద్దారవీడు, జనవరి 20, ప్రభాతవార్త**



చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పెద్దారవీడు ఎస్సై పి అనీల్ కుమార్ అన్నారు. మండలంలోని రాజంపల్లి గ్రామ శివారులో సోమవారం పేకాటశిభిరంపై దాడిచేసి పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపల్లి గ్రామ శివారులో పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది, ఎస్‌బిఏ ఎస్సై మాల్యాద్రితో కలిసి పట్టుకోవం జరిగిందని వారి వద్ద నుండి రూ.23,800లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణ

**గిద్దలూరు రూరల్, జనవరి 20, ప్రభాతవార్త**



గిద్దలూరు మండలంలోని సంజీవరాయుని పేట, దంతెరపల్లి, మిట్టమీదిపల్లి గ్రామాలలో సోమవారం పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిభిరంలో 84గేదెలకు, 60దూడలకు, వైద్య పరీక్షలు చేసి 24గేదెలకు గర్భకోశవ్యాధులకు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు అసిస్టెంట్ డైరెక్టర్ యోగేంద్ర ప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రావన్ కుమార్, సాయిదీప్తి, వెటర్నరీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రంగనాయకులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పద్దతి మార్చుకోండి..లేకపోతే కఠిన చర్యలు

**- ఫ్యాసింజర్ ఆటో వాహనదారులను హెచ్చరించిన ఎస్సై మాధవరావు**

**హనుమంతునిపాడు, జనవరి 20, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి- వేములపాడు రోడ్డు వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహణలో భాగంగా హనుమంతుని పాడు ఎస్సై కే.మాధవరావు వాహన తనిఖీ నిర్వహించారు. పరిమితికి మించి అత్యాశతో ప్రయాణికులను ఎక్కించుకుని మమ్మల్ని అడిగేవాడు లేడు అనే విధంగా ప్రవర్తిస్తున్న ఆటో వాహనదారులకు ఎస్సై మాధవరావు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎన్నో సార్లు నచ్చజెప్పినా మీ పద్దతి మారడం లేదని ఇకపై ఉపేక్షించేది లేదని కేవలం మీ అత్యాశతో ఇంత మందిని ఆటోలో ఎక్కించుకొని ప్రయాణిస్తే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఇకపై మీ ధోరణి ఇలాగే ఉంటే కేసులు నమోదు చేస్తామని ఆటో వాహనదారులను హెచ్చరించారు. అలాగే ప్రయాణికులతో మీరు కేవలం ఒక రోజు కూలీ కోసం ఇంత మంది ప్రయాణిస్తే అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే మీ పరిస్థితి ఏమిటని ఆసుపత్రిలో చేరితే దానికి అయ్యే ఖర్చు అధికంగా ఉంటుందని మీరు క్షేమంగా వస్తారని ఇంట్లో మీ పిల్లలు ఎదురుచూస్తూ ఉంటారని మీరు క్షేమంగా ఇంటికి వెళ్తే మీ కుటుంబాన్ని పోషించుకోగలుగుతారని ప్రయాణికులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మండల పరిషత్ తీర్మాణం లేకుండా పనులు ఎలా మంజూరయ్యాయి

**- ఎంపీటీసీ హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోం**

**- అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం**

**- వాడివేడీగా సాగిన కొనకనమిట్ల మండల సమావేశం**

**కొనకనమిట్ల, జనవరి 20, ప్రభాతవార్త**





మండల పరిషత్ తీర్మాణం లేకుండానే అభివృద్ధి పనులు ఎలా మంజూరు చేశారని వైస్ ఎంపీపీ, మునగపాటి ఎంపీటీసీ మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపీటీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, పలువురు సభ్యులు అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీలకు తెలియకుండానే గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నారని, ముందుగా సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎంపీటీసీ హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోబోమని ఎంపీటీసీ రామనారాయణరెడ్డి హెచ్చరించారు. పలు గ్రామాల్లో ఎన్‌ఏపీ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, కనీసం సమాధానం చెప్పేందుకు కూడా ఎన్‌ఏపీ ఏఈ హాజరు కాకపోవడం ఏమిటని, వారిపై ఏ చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మలను వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశానని ఆమె సమాధానం చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల మంజూరుకు నిర్వహించే గ్రామ సభలకు తమకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనిగిరి డీఎల్‌డీఓ శ్రీనివాస్‌రెడ్డి సమాధానం ఇస్తూ పంచాయతీలో జరిగే గ్రామ సభలు సమావేశాలకు ఎంపీటీసీలకు విధిగా సమాచారం అందించాలన్నారు. వద్దిమడుగు యూపీ స్కూల్లో నాడు- నేడు పనులు అసంపూర్తిగా మిగిలాయని, విద్యార్థులు ఇరుకు గదులలో విద్యను అభ్యసిస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు చక్కెర వెలుగొండయ్య, సర్పంచ్ పిన్నిక పిచ్చయ్యలు ఎంఈఓ ఎస్కే దాంగే షరీఫ్‌పై మండిపడ్డారు. నాగంపల్లి యూపీ స్కూల్లో అసంపూర్తిగా పనులు మిగిలాయని ఎస్ఎంసీ ఖాతాలో నిధులు ఉన్నప్పటికి, ఆ పనులకు ఖర్చు చేయలేదని ఎంపీటీసీ కోండ్రు వెంకటేశ్వర్లు ఆరోపించారు. చిన్నారికట్లతో పాటు పలు గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నడుస్తున్నాయని ఎంపీటీసీ సభ్యులు రామనారాయణరెడ్డి చెప్పారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ కానిస్టేబుల్ చెప్పారు. తొలుత ఇటీవల మృతి చెందిన కొనకనమిట్ల మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిల్లి లక్ష్మీ నరసయ్య మృతికి సంతాపంగా రెండు నిమిషాలు సభ్యులు మౌనం పాటించారు. ఈ సమావేశంలో ఏవో ప్రసన్న రంగలక్ష్మీ, ఎంఈఓ దాంగే షరీఫ్, వెలుగు ఏపీఎం సుధాకరరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో బులెన్ రావు, కొనకనమిట్ల, గొట్లగట్టు పీహెచ్‌సీ వైద్యాధికారులు సురేఖ, పృద్వీరాజ్, పశువైద్యాధికారి అమూల్య, పీఆర్ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, హౌసింగ్ ఇరిగేషన్, ఆర్అండ్‌బి ఏఈలు శ్రీనివాసరెడ్డి, జ్యోతి సృజన, బ్రహ్మం, బాలునాయక్, విశ్వనాథం, పాపారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

**మార్టూరు, జనవరి 20, ప్రభాతవార్త**



ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఒంగోలులో నిర్వహించిన దామచర్ల పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొని దామచర్ల జనార్ధన్‌కు పుష్పగుచ్చం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదు

**- ఎస్సై శివరామయ్య**

**మద్దిపాడు, జనవరి 20, ప్రభాతవార్త**

ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించరాదని ఎస్సై బి.శివరామయ్య సూచించారు. స్థానిక మండల కేంద్రం నటరాజా కళా కేంద్రం ఆవరణలో సోమవారం నాడు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఆటో డ్రైవర్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై బి.శివరామయ్య మాట్లాడుతూ ఆటోలు నందు పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించవద్దని,వెనుకవైపు డోర్లు ఓపెన్ చేసి కూర్చోబెట్టరాదని, అదే విధంగా డ్రైవర్ సీట్ పక్కన ప్యాసింజర్స్‌ను కూర్చోబెట్టరాదని ఆటో డ్రైవర్లకు సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, తాగి వాహనం నడపరాదని, వెహికల్ సంబంధించి అన్ని డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని ఎస్సై బి.శివరామయ్య అన్నారు.



IN THE COURT OF THE
HON'BLE MACT CHAIRMAN
XXVI ADDL CHIEF JUDGE,
CITY CIVIL COURT
AT: HYDERABAD
MVOP 2522 OF 2023

Between:
B. Chinna Narsimulu ...Petitioner
And
T. Bharath Kumar and others ...Respondents

To
Thatikonda Bharath Kumar
S/o T. Venkata Rao, Age: Major,
Occ: Owner of the crime vehicle,
R/o: H No. 6-40, Kakani Palem,
Addanki, Prakasham Dist, A.P-523201 -R1

NOTICE

Please take notice that the above MVOP No.2522 of 2023 is filed against you and others for grant of compensation and the above case is posted for your appearance on 03-02-2025 at 10.30 a.m. in person or by an advocate, failing which the case will be decided on merits in your absence.

//BY ORDER OF THE COURT//
Sd/- T. SHYAM SUNDER
Advocate
Plot No.7, Phase-IV,
Vanasthalipuram,
Hyderabad-500070.
Cell: 9704770735

## జాతీయ ఓటర్ల దినోత్సవం విజయవంతం చేయాలి

- ఆర్డీఓ గండ్లూరి కేశవర్ధన్‌రెడ్డి

**కనిగిరి, జనవరి 20, ప్రభాతవార్త**



జాతీయ ఓటర్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కనిగిరి డివిజన్ ఆర్డీఓ గండ్లూరి కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కనిగిరి నియోజకవర్గం తహశీల్దార్, మండల విద్యాశాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 25వ తేదీన మండలాల్లోని ప్రతి బూత్ కేంద్రాల్లో ఖచ్చితంగా జాతీయ ఓటర్ల దినోత్సవం జరిపి ఓటర్ల చేత వేడుకలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించాలన్నారు. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఓటరు కార్డులను పోస్టల్ శాఖ ద్వారా చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు నమోదు ఆధార్ అనుసంధాన పక్రియ ప్రచారం నిర్వహించాలని కోరారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునే విధంగా కొత్తగా ఓటును నమోదు చేసుకుని ఓటర్లకు అవగాహన చేయించాలన్నారు.

## 22న జీసీ అండ్ వైపీఎన్ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

**కనిగిరి, జనవరి 20, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని జీసీ అండ్ వైపీఎల్ డిగ్రీ కళాశాలలో 22వ తేదీ బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జీసీ అండ్ వైపీఎన్ అండ్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని కళాశాల డైరక్టర్ ఏలూరు సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన జాయలుకాస్, భారత్ ఫైనాన్స్, అమర్ రాజా బ్యాటరీస్, ఎయిర్‌టెల్ పేమెంట్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ డిప్లమో పూర్తి చేసిన విద్యార్థులు 18 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాల వరకు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డైరక్టర్ ఏలూరు సుబ్బారావు తెలిపారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్ బెనర్జీ బాబుని 8008822821 సమాచారం కోసం తెలియజేయాలన్నారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చండి

**నాగులుప్పలపాడు, జనవరి 20, ప్రభాతవార్త**




మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చినప్పుడే ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ నలమలపు అంజమ్మ, ఎంపీడీఓ వై.మహాలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వాలంటీర్ టీచర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, డీఎల్‌డీఓ మహాలక్ష్మి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం నుంచి కార్యక్రమం అన్నారు. గతంలో కూడా అక్షర ప్రకాశం కార్యక్రమం ఉండేదని తద్వారా అనేక మంది మహిళలు చదువు నేర్చుకుని ఉన్నత స్థానాలకు ఎదిగారని తెలిపారు. ఎంఈఓ రవి మాట్లాడుతూ మహిళలకు చదువు ఉంటే వారి పిల్లల భవిష్యత్ చక్కగా ఉంటుందన్నారు. చదువులేని మహిళలు వయోజన విద్యా కేంద్రాల ద్వారా నేర్చుకోవాలన్నారు. ఏపీఎం నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వెలుగు ద్వారా నిరక్షరాస్య మహిళలను గుర్తించి వారికి మ్యాచింగ్, బ్యాచింగ్ చేయడం జరిగిందన్నారు. వారికి డ్వాక్రా గ్రూపుల నుండి స్వచ్ఛందంగా చదువు చెప్పేందుకు ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వయోజన విద్యాశాఖ ఉమ్మడి ప్రకాశం జిల్లా డివిజనల్ పర్యవేక్షకులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన వాలంటీర్స్ ద్వారా నిరక్షరాస్య మహిళలకు చదవడం రాయడంతో పాటు డిజిటల్ ప్రయోగాత్మకంగా ఆర్థిక అక్షరాస్యతపై అక్షర వెలుగులు వాచకంలో ఉన్న 8 పాఠాలు బోధించే విధానంపై వివరించారు. అనంతరం వాలంటీర్స్ బోధన సామాగ్రితో పాటు బోధించేందుకు ఒక్కొక్కరికి రూ.400లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రవిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## అరుంధతి నగర్‌లో ఉచిత ట్యూషన్ సెంటర్ ఏర్పాటు

**టంగుటూరు, జనవరి 20, ప్రభాతవార్త**



అరుంధతినగర్‌లోని సామాజిక భవనం నందు అరుంధతి నగర్ వాసుల సహకారంతో నిర్వహించు ఉచిత ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగింది. అరుంధతి నగర్‌లో ఉన్నటువంటి విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కమిటీ సభ్యులు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బక్కా సుదర్శన్‌బాబు, గర్నిపూడి సుధీర్‌బాబు, కొమ్ము భానుచందర్, చావల శాంసంగ్, దున్న శ్రీకాంత్, కొమ్ము ఉదయ్, గర్నిపూడి బ్రహ్మయ్య, తలారి కోటయ్య, జల్లి నవీన్, సీనియర్ ఉపాధ్యాయులు శిఖ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రసన్న, చావలి కౌశిక, శిఖ స్రవంతి పాల్గొన్నారు.

## 8మంది జూదరులు అరెస్టు

**టంగుటూరు,జనవరి 20, ప్రభాతవార్త**



టంగుటూరు మండలం మర్లపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై నాగమల్లేశ్వరరావు తన సిబ్బందితో కలిసి శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో 8మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.27,440లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేకాట, కోడి పందాలు ఆడడం చట్టరీత్యా నేరం అని, ఆడుతున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సీనియర్ జర్నలిస్టు కొల్లిపర్ల హఠాన్మరణం

**వేటపాలెం, జనవరి 20, ప్రభాతవార్త**

సుదీర్ఘ కాలంగా విలేకరిగా పని చేస్తూ నిబద్ధత కలిగిన వ్యక్తిగా, జూనియర్ జర్నలిస్టులకు ఆదర్శప్రాయంగా నిలిచి వారిలో మనోధైర్యాన్ని కల్పించిన సీనియర్ జర్నలిస్ట్ సాంబశివరావుకు జర్నలిస్టులు కన్నీటి వీడ్కోలు పలికారు. వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు సాంబశివరావు గుండెపోటు కారణంగా ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న తోటి జర్నలిస్టులు హుటాహుటిన సాంబశివరావు సందర్శించి నివాళులర్పించారు. జూనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ సాంబశివరావు అన్న జర్నలిస్టులకు ఆదర్శప్రాయమని ఆయన చేసిన సేవ ఎనలేనిది అని, అందరిలో తాను ఒకరిగా మమేకమై అందరి ఆదరాభిమానాలు పొందిన ఆయన మరణం పత్రికాలోకానికి తీరని లోటని తెలియజేశారు. పాత్రికేయునికి జర్నలిస్టులు జోహార్లు అర్పించారు.

## విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం


**వేటపాలెం, జనవరి 20, ప్రభాతవార్త**



వేటపాలెం దేశాయిపేట గ్రంథాలయానికి రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు విద్యార్థులకు 20 మందికి గ్రంథాలయ సభ్యత్వ నమోదుకు ఆర్థిక సాయం చేసి గ్రంథాలయ సభ్యత్వాన్ని అందజేశారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయం నందు అందరికి ఉపయోగపడే ఎన్నో రకాల పుస్తకాలు ఉన్నాయని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ తెలియజేశారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం పెంపొందించుకోవచ్చని పేరయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలు, క్విజ్, చర్చా కార్యక్రమం

**దర్శి, జనవరి 20, ప్రభాతవార్త**



దర్శిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు క్విజ్, చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ రమణ మాట్లాడుతూ ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 25న జరుపుకునే జాతీయ ఓటర్ల దినోత్సవం భారత ఎన్నికల సంఘం స్థాపనను సూచిస్తుంది. ప్రజా స్వామ్యంలో ఓటు వేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం లక్ష్యంగా పెట్టుకుంది. 2011లో స్థాపించబడిన ఈ రోజు పౌరులను, ముఖ్యంగా యువతను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనమని ప్రోత్సహిస్తుంది. ఈ సందర్భంగా ప్రజా స్వామ్య పాలనకు మూలస్తంభమైన భారత పౌరుల ఓటు హక్కులను కూడా సూచిస్తున్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కె.ప్రభాకరు, పొలిటికల్ సైన్స్ లెక్చరర్ బీవీ రమణ చరిత్రలో అతిథి అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పద్ధతుల్లో సమస్యలకు పరిష్కారం

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



ప్రత్యామ్నాయ పద్ధతుల్లో సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అనేది చక్కటి పరిష్కార వేదిక అని ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. అమ్మన్న రాజా అన్నారు. సోమవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయస్థానం ఆవరణలో మధ్యవర్తిత్వం ద్వారా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 40 గంటల శిక్షణా కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఇరువర్గాల ఆమోదంతోనే న్యాయస్థానాలలో వ్యాజ్యాలు మీడియేషన్ అనే ప్రక్రియ ద్వారా పరిష్కరిస్తారని ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తద్వారా న్యాయస్థానాల మీద తీవ్రమైన ఒత్తిడి మరియు పనిభారం కొంతవరకు తగ్గే అవకాశం కలుగుతుందని అన్నారు. తదనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మీడియేషన్ శిక్షకురాలుగా జయ గోయల్, నగీనా జైన్ అనే సుప్రీంకోర్టు న్యాయవాదులు పాల్గొంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి. రాజా వెంకటాద్రి. రాములు, లలిత సీనియర్ సివిల్ న్యాయమూర్తుల జి. దీనా, హేమలత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే. శ్యాంబాబు, అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్. మోహన్ దాసు, ఇతర న్యాయవాదులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీ సీనియర్ నాయకులు ఎస్వీఎస్ గోవర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

**కనిగిరి, జనవరి 20, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు ఎస్వీఎస్ గోవర్ధన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం పలువురు పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తలు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, ప్రజలు స్వచ్ఛందంగా సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గోవర్ధన్ రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖంగా సంతోషంగా ఉండి కనిగిరి తాలూకా ప్రజలకు, పేదలకు సేవలు అందించాలని ఆశీర్వదించారు. కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్, కౌన్సిలర్ దేవకి రాజీవ్, ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, చింతం శ్రీను, అబ్రహం లింకన్, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, ఉమాకాంత్, సింగిల్ విండో అధ్యక్షులు సూరసాని మోహన్‌రెడ్డి, షేక్ సంధాని భాష, సుబ్బారెడ్డి, ప్రముఖ ఆర్యవైశ్య వైసీపీ నాయకులు తడికమళ్ళ వెంకటేశ్వరరావు, మల్లిఖార్జునరావు, కేటీసీ పాపారాయుడు, రహీం, వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు మీరా, రమేష్, కృష్ణ, వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ రాజు, వెంకటేశ్వర్లు, సుల్తాన్, కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## సీనియర్ జర్నలిస్టు సాంబశివరావు హఠాన్మరణం

- నివాళులర్పించిన జర్నలిస్టులు, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు

**చీరాల, జనవరి 20, ప్రభాతవార్త**



సీనియర్ జర్నలిస్టు కొల్లిపర సాంబశివరావు(52) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ఓదార్చారు. ఈ సందర్భంగా వారు జర్నలిస్టుగా సాంబశివరావు చేసిన సేవలను కొనియాడారు. పేదల సమస్యలు పరిష్కరించడంలో సాంబశివరావు ఎప్పుడు ముందుండేవారని కొనియాడారు. సాంబశివరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాంబశివరావు చీరాల నియోజకవర్గంలో సుదీర్ఘ కాలం జర్నలిస్టుగా పని చేశారు. ప్రముఖ పత్రికలైన ఈనాడు, ఆంధ్రజ్యోతితో పాటు వివిధ పత్రికల్లో ఆయన సేవలు అందించారు.సోమవారం సాయంత్రం అశ్రునయనాల మధ్య సాంబశివరావు అంత్యక్రియలు ముగిశాయి. బంధువులు, స్నేహితులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

**నివాళులర్పించిన ప్రముఖులుః**

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆయనకు తన సంతాపం తెలిపారు. జర్నలిస్టుగా సాంబశివరావు చేసిన సేవలు మరువలేవనివని కొనియాడారు. సాంబశివరావు మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సాంబశివరావు నిబద్ధత, నిజాయితీ కలిగిన జర్నలిస్టుఅని కొనియాడారు. సీపీఎం నాయకులు ఎన్.బాబురావు తదితరులు నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గజావల్లి శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు. బీజేపీ నాయకులు కుమారు, భారనిరావు, జయశంకర్‌చంద్ర తదితరులు నివాళులర్పించారు. మున్సిపల్ కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, కీర్తి వెంకటరావు నివాళులర్పించారు. ఆర్‌బీకే మాజీ చైర్మన్ కావూరి రమణారెడ్డి నివాళులర్పించారు.

## చీమకుర్తిలో నేటి నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు

**చీమకుర్తి,జనవరి 20, ప్రభాతవార్త**

చీమకుర్తి మండలం లోని పలు గ్రామాలలో ఈనెల 21 నుంచి 31 వరకు ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పల్లామల్లి, నిప్పట్లపాడు పశు వైద్యాధికారులు డాక్టర్ టి మను రూ, డాక్టర్ వై పేరయ్య లు సోమవారం తెలిపారు. ఈ శిబిరాలలో పశువులకు అనగా దూడలకు, గేదెలకు, ఆవులకు,మేకలకు,నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. తెల్ల పశువులకు ముద్ద చర్మవ్యాధి టీకాలు, అన్ని పశువులకు గొంతు వాపు వ్యాధి టీకాలు, గొర్రెలకు బొబ్బ టికాలు ఇవ్వటం జరుగుతుందన్నారు అలాగే ఈ శిబిరాలలో ఎదకురాని గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్స అందజేయబడినని తెలిపారు మండలంలోని పాడి రైతులు, సన్న జీవాల పెంపకం దారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు కోరారు.

## గుండ్లకమ్మ రిజర్వాయర్ పనులు పరిరక్షణ పూర్తి చేయకపోతే తీవ్రమైన ఆందోళన చేపడతాం

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

**మద్దిపాడు, జనవరి 20, ప్రభాతవార్త**



గుండ్లకమ్మ రిజర్వాయర్ పనులు జాప్యం జరిగితే రైతులతో భారీ ఎత్తున ఉద్యమం చేస్తామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను రైతు సంఘం బృందం పరిశీలించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు మరమ్మత్తులు అధికారులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు జగన్ ప్రభుత్వంలో తీవ్రమైన నిర్లక్ష్యం చేశారని మూడు గేట్లు కొట్టకపోయిన 9 నెలలు పాటు పట్టించుకోలేదన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఎన్నో ఆందోళనలు చేపట్టామన్నారు. పాదయాత్రతో పాటు పోస్టు కార్డు ఉద్యమం కూడా చేపట్టామన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును 700 కోట్లు ఖర్చు పెట్టి కనీసం రైతులకు తాగునీరు, సాగునీరు అందించలేని పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం రావడంతోటే ప్రాజెక్టు గేట్లు పనులు ఆటంకం కలుగుతుందని తెలిపారు. అయితే ప్రభుత్వం 2005 లో చంద్రబాబు ప్రభుత్వంలో 180 కోట్లకు ప్రాజెక్టు నిర్మాంచారని భూమి పూజ చేశారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి పరిపాలనలో 700 కోట్లు రూపాయలు నిధులు వెచ్చించారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో తాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని అంబటి రాంబాబు సాగునీటి మంత్రిగా ఉన్నారని ఆయన పత్రికల ప్రకటనలు తప్ప ఎలాంటి పనులు చేతకాదన్నారు. అంబటి రాంబాబు గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ప్రాజెక్టులో ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. అప్పటి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సీపీఐ జాతీయ నాయకులు రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రాజెక్టులను సందర్శించి అప్పటి వైసీపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఐదేళ్ల కాలంలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని అన్నారు. ప్రభుత్వం రైతులకు సాగునీటితో పాటు ఒంగోలు ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షులు నారిపెద్ది వరహాల చౌదరి మాట్లాడుతూ గుండ్లకమ్మ గేట్లు పనులు బ్రేక్ అవ్వడం రైతుల ఆందోళన కలుగుతుందన్నారు. రైతులకు నీళ్లు అత్యవసరమన్నారు. పొగాకు, శనగ పంటలు దెబ్బతింటాయన్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌చొరువ తీసుకుని గేట్లు పనులు పూర్తి స్థాయిలో పరిష్కరించే విధంగా చొరువ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పావులూరి అంజయ్య, వి.కోటిరెడ్డి, చెరుకూరి వాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీఐ సోమశేఖర్

**పొన్నలూరు, జనవరి 20, ప్రభాతవార్త**

కొండపి సీఐ జి.సోమశేఖర్ పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని, స్టేషన్‌లోని పలు రికార్డులను, పెండింగ్ కేసులను తనిఖీ చేసి అనంతరం స్థానిక ఎస్సై అనూక్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో సిబ్బంది యొక్క పనితీరును తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌లో పెండింగ్ కేసులు అన్ని పూర్తి చేయాలని సూచించారు. పేకాట, గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్సైకి సూచించారు. దొంగతనాలు జరగకుండా పోలీసు అధికారులు రాత్రిపూట పెట్రోలింగ్ చేయాలన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.




## మట్టిలో మాణిక్యాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- విద్యార్థులకు బంగారు కాయిన్స్ అందించిన యాదాల సాయికిరణ్

**పామూరు, జనవరి 20, ప్రభాతవార్త**



ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు అంటే నిరాధారణకు గురై ఎటువంటి ఆదరణ లేని నిరుపేద విద్యార్థులే విద్యనభ్యసించే వారని, కాని నేడు ప్రభుత్వాలు చేపడుతున్న సంస్కరణలు, ఉపాధ్యాయులు చూపుతున్న శ్రద్ధ కారణంగా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఉన్నతమైన మార్కులతో పేద విద్యార్థులమైన మేము ఎందుకు తీసుపోమంటూ ఫలితాలు రాబడుతున్నారని యువతనేత, పామూరు ఉప సర్పంచ్ యాదాల సాయికిరణ్ తెలిపారు. గత సంవత్సరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పామూరు హైస్కూల్ నందు జి.ఆశ్రిత 578, ఎన్.లక్ష్మీప్రణవి 571 మార్కులు సాధించి ప్రైవేటు రెసిడెన్సియల్ పాఠశాలలకు సవాల్ విసిరారు. అంతకముందు 565 పైగా సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంత మంది ఉన్నా వారికి ప్రోత్సాహక బహుమతి కింద బంగారు కాయిన్స్ అందజేస్తామని ప్రకటించిన యాదాల సాయికిరణ్ సోమవారం నాడు ప్రధానోపాధ్యాయుడు జే.రామస్వామి ఆధ్వర్యంలో విద్యాకమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు వారి సమక్షంలో విద్యార్థులకు బంగారు కాయిన్స్, మెమోంటోను అందజేశారు. విద్యలో రాణించి తల్లిదండ్రులతో పాటు పాఠశాలలకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సాయికిరణ్ ఆకాంక్షించారు. గతంలో రెసిడెన్సియల్ పాఠశాలలు లేనప్పుడు ప్రభుత్వ పాఠశాలలే నాణ్యమైన విద్యను అందించేవని, ఈనాడు డాక్టర్లు, ఇంజనీర్లు దేశం గర్వించదగ్గ నాయకులుగా తయారయ్యాయంటే ఆనాడు ప్రభుత్వ పాఠశాలలో వేసిన పునాదులే అన్నారు. నేడు ప్రభుత్వాలు విద్యావ్యాప్తికి, విద్యార్థుల అవసరానికి మౌలిక వసతులకు బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రత్యేక కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం ఉపాధ్యక్షులు ఒగూరి ఏడుకొండలు, మంచికంటి మధుసూదన్‌రావు, వార్డుమెంబర్లు జిలాని, షేక్ నాయక్ రసూల్, విద్యాకమిటీ మెంబరు కొప్పురు రాజేష్, ఉపాధ్యాయులు బోగేశ్వరరావు, వేణుగోపాల్‌రావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్‌ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

- సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబు

**పామూరు, జనవరి 20, ప్రభాతవార్త**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ప్రవేశపెట్టిన తప్పనిసరి హెల్మెట్‌ను వాహనచోదకులు ధరించి తమతో పాటు తమను నమ్ముకున్న వారిని ఒంటరి వారిని చేయకుండా సురక్షితంగా గమ్యాన్ని చేరాలని సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబులు తెలిపారు. సోమవారం నాడు నేషనల్ హైవే 565 వద్ద ద్విచక్ర వాహనాల్లో హెల్మెట్ లేని వారిపై కేసు నమోదు చేసి త్రిబుల్ రైడింగ్ వారికి తగిన పెనాల్టీ విధించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేస్తున్న వారికి కౌన్సిలింగ్ ఇవ్వడమే కాకుండా చలానాలు విధించారు. పెండింగ్ చలానాలు చెల్లించని పక్షంలో లైసెన్స్ సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వాహన చోదకులు డ్రైవర్‌తో పాటు వెనక కూర్చున్న వారితో పాటు హెల్మెట్ ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. ఆటోల్లో ప్రయాణించే వారు తమ గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలనే ఆలోచనలతో కిక్కిరిసి వెళ్తుంటారని, చిన్న పాటి పొరపాటు జరిగిన తిరిగిరాని లోకాలకు వెళ్లడం గమనిస్తూనే ఉంటామని అన్నారు. బస్సు రూట్లు ఉన్న ప్రాంతాల్లో కూడా ఆటోల్లో వెళ్ళడం సమంజసం కాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వారు జైలుకు వెళ్ళడం తప్పదన్నారు. మండలంలో ఎక్కడైనా బెల్టు షాపుల్లో మద్యం విక్రయించిన, షాపుల నుంచి మద్యం తరలించిన తీసుకోబోవు చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

## అంకాలమ్మ తల్లికి పది గ్రాములు తాళిబొట్టు బహుకరించిన భక్తులు

**పామూరు, జనవరి 20, ప్రభాతవార్త**



పామూరులో వెలసి ఉన్న అంకాలమ్మదేవతకు గుంటూరుకు చెందిన సూరా రామసుబ్బారావు కుమార్తె శనివారం నాడు పది గ్రాముల బంగారు తాళిబొట్టును బహుకరించారు. గ్రామంలో గల పోలేరమ్మ, అంకాలమ్మ దేవతలను మొక్కుకుంటే అనేక సమస్యలకు పరిష్కారం అవుతాయని, అందుకు ఆమెకు జరిగిన సంఘటనను ఉదాహరణగా తెలిపారు. గ్రామం పచ్చగా కళకళలాడుతూ ఎటువంటి అరిష్టాలు జరగకుండా ఉండాలంటే గ్రామ దేవతలైన అంకాలమ్మ, పోలేరమ్మలకు నిత్యపూజలు చేయాలని దాత తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద కాపు పేరం రఘునాధరెడ్డి, స్వర్ణకార సూంఘం అధ్యక్షులు ఒగూరి నరసింహులు, అంకాలమ్మ దేవస్థాన కమిటీ చైర్మన్ నాగిని వెంకటస్వామి, ఏబీఎన్ రిపోర్టర్ పసుపులేటి రఘురాం, గుత్తి కొండలరావు, మత్స్యకార సంఘం ఉపాధ్యక్షులు ఒగూరి ఏడుకొండలు, చింతగుంట్ల పెద్దతిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీసీ గ్రీన్ లీఫ్ త్రెసింగ్ ప్లాంట్‌ను సందర్శించిన రైతులు, సిబ్బంది

**టంగుటూరు, జనవరి 20, ప్రభాతవార్త**



పొగాకు రైతులకు, క్షేత్ర సిబ్బందికి టంగుటూరు పొగాకు బోర్డు ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్రలో భాగంగా చీరాలలోని ఐటీసీ గ్రీన్ లీఫ్ త్రెసింగ్ ప్లాంట్‌ను సందర్శించడం జరిగింది. ఇందులో భాగంగా కంపెనీ వారు పొగాకు రైతుల దగ్గర కొన్న పొగాకును ఎటువంటి పద్ధతుల ద్వారా పొగాకు ప్రాసెసింగ్ చేసి అంతర్జాతీయ కొనుగోలు దారులకు విక్రయిస్తారో, పొగాకు ప్యాకింగ్‌లో పాటించాల్సిన అంతర్జాతీయ ప్రమాణాలను తెలుసుకున్నారు. అలాగే ప్లాంట్‌లో దశల వారీగా జరిగే పక్రియలను తెలుసుకున్నారు. పొగాకు గ్రేడ్‌లను అలాగే పొగాకేతర అన్యపదార్థాలను వాటిని వేరుచేసే విధానాలను, యంత్రాలను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, టంగుటూరు వేలం కేంద్రం పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

## దేవాలయ ఆక్రమిత భూములు పరిశీలించిన ఆర్జేసీ ఆజాద్

**పామూరు, జనవరి 20, ప్రభాతవార్త**



పామూరులో వేంచేసి ఉన్న శ్రీ మదన వేణుగోపాల్‌స్వామి, శ్రీ భుజంగేశ్వర స్వామి దేవాలయ భూముల ఆక్రమణలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమీషనర్ ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా నెల్లూరు రోడ్డులోని వివాదస్పద భూములను పరిశీలించారు. భూముల ఆక్రమణ, అక్రమణ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి భూములను దేవాలయానికి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని ఈవో నర్సింహబాబుకు సూచించారు. దేవాలయ భూముల్లో చర్చీలు నిర్మించారని బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య ఆర్జేసీ దృష్టికి తీసుకెళ్లగా వాటిని వెంటనే తొలగించాలని ఈవోకి సూచించారు. అనంతరం పట్టణంలోని అనుమలశెట్టి సత్రము, వీర బ్రహ్మంగారి మఠంకి సంబంధించిన ఆస్తులను పరిశీలించారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఈవోని కోరారు. దేవాలయ ఆస్తులను అక్రమ దారుల చెర నుండి విడిపించి దేవాలయ ఆదాయాలను పెంచి అనాదిగా వచ్చే స్వామివారి కైంకర్యాలను కొనసాగిస్తూ స్వామివారి బ్రహ్మోత్సవాలు జరపాలని ఈవో నరసింహబాబుకి సూచించారు. వ్యాయామ శాల కొరకు దేవాలయ బూములో కవులకు కొంత భూమిని కేటాయించాలని భజరంగ్ దళ్ సభ్యులు వినతిపత్రం ఇవ్వడంపై ఈవో ఆర్జేసీ దృష్టికి తీసుకెళ్ళి మంజూరుకి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పాలక మండలి చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, సభ్యులు సిద్దవట్టం నరసింహులు, కూటమి ప్రభుత్వ నాయకులు కొండిశెట్టి రమణయ్య, బండ్ల నారాయణ, బజరంగ్ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాయామశాల కొరకు ఎండోమెంట్ అధికారులకు అర్జీ సమర్పించిన బజరంగదళ్ సభ్యులు

**పామూరు, జనవరి 20, ప్రభాతవార్త**



పామూరులో వందలాది దేవాలయాలకు చెందిన వివిధ రకాల మాన్యాలు, ఇనాం భూములు వందలాది ఎకరాలు ఉన్నాయని, ఒక ఎకరా స్థలం ప్రజలకు వ్యాయామ శాలకు కేటాయిస్తే యువకులు ఐక్యమత్యంతో పాటు శారీరక ధారుడ్యాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో వివిధ పోటీలకు ఎంపిక కాగలరని మార్కాపురం బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షులు జమకాల నరేష్, పామూరు ప్రాంత అధ్యక్షులు పందిటి హరీష్, పసుపులేటి రఘురాం, జమకాల ఓబులేషు, ఒగూరి ఏడుకొండలు, గుత్తి కొండలరావు, గుత్తి పవన్, గొప్పూరు రాజేష్ తదితరులు ఎండోమెంటో దేవాదాయ శాఖ ఆర్జేసీతో పాటు కార్యనిర్వాహణ అధికారికి అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్, ఉన్నతాధికారులకు విషయం తెలియజేసి మంచి కార్యక్రమానికి దేవాదాయశాఖ భూమిని ఉపయోగించేలా కృషి చేస్తామన్నారు.

# కుమారుడు పోషణ బాధ్యత తల్లికే సొంతం

## అతుల్ సుభాష్ ఆత్మహత్య కేసులో సుప్రీం ఆదేశాలు



**న్యూఢిల్లీ, జనవరి 20:** తన భార్య తనను మానసిక వేధింపులకు గురిచేస్తోందని 40 పేజీల లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్న బెంగళూరు టెకీ అతుల్‌సుభాష్ ఏకైక కుమారుడు ఆతనిభార్య నిఖితా సింఘానియతోనే ఉంటాడని సుప్రీంకోర్టు ప్రకటించింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఎస్సీ శర్మల బెంచ్ ఈకేసును విచారించి సోమవారం తీర్పు వెలువరించింది. సుభాష్ తల్లి అంజుదేవి దాఖలుచేసిన పిటిషన్‌ను విచారించారు. తమ మనవడిని తమకు అప్పగించాలని, వారు ఎక్కడ దాచి ఉంచిందీ కూడా చెప్పడంలేదని, గోప్యంగా ఉంచుతున్నారని కోరుతూ పిటిషన్ దాఖలుచేసారు. అలాగే చిన్నారితో విడియోల లింక్‌లో మాట్లాడిన తర్వాత కోర్టు సింఘానియా న్యాయవాదిని ఈ బాలుడిని తమముందు హాజరుపరచాలని చెప్పారు. ఇదిలా ఉండగా పిటిషనర్లు ఒక వారం రోజులు వ్యవధి ఇస్తే సమగ్ర అఫిడవిట్ దాఖలు చేస్తామని కోరారు. అయితే జస్టిస్ నాగరత్న ఆ విజ్ఞప్తిని తిరస్కరించారు. ఇదొక హెబియస్‌కార్పస్ పిటిషన్ అని మేం పిల్లాడినిచూడాలనుకుంటున్నామని, ముందు ఆతడిని కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశించి మరో తేదీన ఈ కోర్టు విచారణచేస్తుందని అన్నారు. అనేకసార్లు విచారణల్లో బెంచ్ ఆ బాలుడిని చూపించాలని ఆదేశించింది. అంతకుముందు ఇదే నెలలో సింఘానియా కోర్టుకు పిటిషన్ చెపుతూ బోర్డింగ్ స్కూలు విద్యార్థి తనకుమారుడుని హర్యానాలోని ఫరీదాబాద్ స్కూలులో చదువుకుంటున్నాడని తెలిపింది. అతుల్‌భార్య సింఘూనియా అరెస్టు తర్వాత అతుల్ తల్లితండ్రులు అంజుదేవి, పవన్‌కుమార్‌లు తమ మనవడిని తమకు అప్పగించాలని డిమాండ్‌చేసారు. సింఘూనియాకు కానీ ఆమె కుటుంబీకులు కానీ తమ మనవడి వివరాలు తెలియకుండా గోప్యంగా ఉంచుతున్నారని వాదించారు. అయితే సింఘూనియా మాత్రం తన కుమారుడు తన మేనమామ సుశీల్ సింఘానియా వద్ద ఉన్నాడని తెలిపింది. ఆతర్వాత ఎక్కడ ఉన్నాడో కూడా చెప్పకపోవడంతో కర్ణాటక,ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల పోలీస్‌శాఖలనుబాలుడి ఆచూకీతో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తన బామ్మతో బాలుడు కనీససమయం కూడా గడపలేదని కోర్టు అంగీకరించింది. అయితే ఈకేసులో బాలుడు పిటిషనర్ నానమ్మ చెంతనే ఉండాలని లేదని జస్టిస్ నాగరత్న చెప్పారు. అంతేకాకుండా సరైన దిగువకోర్టులో బాలుడి కస్టడీ కోసం పిటిషన్ వేసుకోవాలని సూచించారు. 2019లో అతుల్ సుభాష్, నికితా సింఘానియాల పెళ్లి అయింది. 2020లో కుమారుడు జన్మించాడు. 2021లో సింఘానియా దంపతులు బెంగళూరుకు మారిపోయారు. 2022లో సుభాష్‌పై ఆమె కుటుంబ కలహాల కోర్టులో కేసులు నమోదు చేసారు. రెండేళ్ల తర్వాత సుభాష్ తన బెంగళూరు ఫ్లాట్‌లోనే గత ఏడాది డిసెంబరు 9న చనిపోయాడు. 81నిమిషాల విడియో, 24 పేజీల స్యూసైడ్‌నోట్ రాసి చనిపోయిన అతుల్ సింఘానియా ఆమె కుటుంబం తనపై తప్పుడు కేసులు నమోదు చేసిందని, తనపైనా, తన తల్లిదండ్రులపైన కేసులు వేసి మూడు కోట్లు డిమాండ్ చేస్తోందని వాదించారు. ఇలాంట కేసుల్లో న్యాయవ్యవస్థ కూడా మహిళల పక్షపా తిగా మారుతోందని, చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని, మహిళల రక్షణకున్న చట్టాలను ఇతర మార్గాల్లో దుర్వినియోగపరుస్తున్నారని వాదించారు.

## పరిహారం సొమ్ము వద్దన్న ఆర్జీకర్ మృతురాలి తల్లిదండ్రులు



**కోల్‌కత్తా, జనవరి 20:** ఆర్జీకర్ ఆసుపత్రిలో పిజివైద్యవిద్యార్థిని హత్యాచారంకేసులో ఏకైక నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు శిక్ష విదించిన న్యాయస్థానం హతురాలి కుటుంబానికి 17 లక్షలరూపాయలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. అయితే మృతురాలి తల్లితండ్రులు తమకు ఎలాంటి పరిహారం వద్దని కోర్టుకు నివేదించారు. న్యాయమూర్తి అనిర్బన్‌దాస్ ఈ కేసును విచారించి సీల్డాకోర్టులో సోమవారం తీర్పును వెలువరించారు. యావజ్జీవఖైదు శిక్షను విధించడంతోపాటు మృతురాలి కుటుంబానికి రూ.17లక్షలు చెల్లించాలని ఆదేశించారు. అయితే ఈకేసు అత్యంత అరుదైన కేసులు వంటి కోవలోకిరాదని అందువల్లనే మరణశిక్షను విధించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. తీర్పు వెలువరించే సమయంలో కోర్టుహాలులో ఉన్న మృతురాలి తల్లితండ్రులు తమకు ఎలాంటిపరిహారం వద్దని న్యాయం కావాలని అన్నారు. జడ్జి స్పందిస్తూ తాను ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసానని, వారికి ఇష్టమైన సమయంలో ఈ సొమ్మును వినియోగించుకోవచ్చని, అయితే ఈ పరిహారం హత్యాచారం జరిగినందుకు ఇచ్చింది కాదని, న్యాయపరంగా ఉన్న అంశాలను పరిగణనలోనికి ఇచ్చినదని అన్నారు. అయితే నిందితుడిపై నమోదయిన అభియోగాలు రుజువు అయ్యాయని అందువల్లనే ఆతడిని సాక్ష్యాల ఆధారంగానే దోషిగా తేల్చినట్లు తెలిపారు. ప్రాసిక్యూషన్ నిందితుడికి మరణశిక్షే సరైనదని వాదించింది. సమాజంలో న్యాయంపై ఉన్న విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి నిందితులకు మరణశిక్ష వేయాలని కోరారు. అయితే ఈకేసు అత్యంత అరుదైన కేసుల కేటగిరీలోకి రాదని అలాంటి కేసులకు మరణశిక్ష విధించడం జరుగుతుందని జడ్జి తిరస్కరించారు.

# ప్రియుడిని హతమార్చిన యువతికి మరణశిక్ష

## కేరళ కోర్టు సంచలన తీర్పు



**తిరువనంతపురం, జనవరి 20:** తన చెలికాడికి కూల్‌డ్రింక్‌లో విషం ఇచ్చి హత్యచేసిన నేరం రుజువుకావడంతో 24 ఏళ్ల మహిళకు కేరళ కోర్టు సోమవారం మరణశిక్ష విధించింది. గ్రీష్మ అనే మహిళ తనతో ఉన్న 23 ఏళ్ల ప్రియుడు షారోన్‌రాజ్‌ను అంతంచేయాలనినిర్ణయించుకుని ఈ ఘాతుకానికి పాల్పడింది. వారి మధ్యఉన్న బంధం తెంచుకోడానికి ప్రియుడిని అంతమొందించడమే ఏకైకమార్గంగా ఆమె భావించింది. స్థానిక కోర్టు గ్రీష్మ ఆమె మేనమామలను దోషులుగా నిర్ధారించింది. ఈకేసులో నిందితురాలి వయసును చూసి క్షమించాల్సిన అవసరం లేదని నేర తీవ్రత దృష్ట్యా వారికి మరణశిక్ష విదించాల్సి వస్తోందని అలాగే ఆమె విద్యాపరమైన ఉన్న తలక్ష్యాలను కూడా పరిగణనలోనికి తీసుకోలేమని వెల్లడించింది. అయితే అంతకుముందు ఎలాంటి నేరచరిత్రలేకపోయినా ఆమె తల్లి తండ్రులకు ఒక్కతే కుమార్తె అని చూసినా కూడా నేర తీవ్రతముందు అవన్నీ పరిగణనలోనికి తీసుకోలేమని న్యాయమూర్తి అన్నారు. క్రమానుగతంగా సాక్ష్యాలు, శాస్త్రియ ఆధారాలను చూపించి నేరం రుజువుపరిచింది. కేరళలో అతిపిన్న వయసులో మరణశిక్ష పడిన మొట్టమొదటి ఖైదీగా గ్రీష్మ నిలిచింది. బాధితురాలి న్యాయవాది మాట్లాడుతూ సాక్ష్యాలను కోర్టు అంగీకరించిందని తాను కోర్టులో వాదనలు వినిపిస్తున్న సమయంలోనే గుర్తించానని, కోర్టు సాక్ష్యాలను విశ్వసించిందని, అయితే ఈ తీర్పు అత్యంత అరుదైన కేసుగా పరిగణించి శిక్షను తగ్గించాలని కోరామన్నారు. అంత తీవ్రస్థాయి తీర్పు బాధితురాలికి అవసరంలేదని మరణశిక్షను జీవితఖైదుగా మార్చాలని కోరినట్లు తెలిపారు. అయితే నేరం చేసిన తీరును పరిగణనలోనికి తీసుకుంటే నిందితురాలికి మరణశిక్షే కరెక్టని ప్రత్యేక పబ్లిక్‌ప్రాసిక్యూటర్ వియస్ వినీత్‌కుమార్ తెలిపారు. 2022లో గ్రీష్మ తన బాయ్‌ఫ్రెండ్‌కు ఒక ఆయుర్వేదిక్ టానిక్‌లో విషం కలిపి తాగించింది. 11రోజుల తర్వాత అన్ని అవయవాలు దెబ్బతిని చనిపోయినట్లు తేలింది. రాజ్ తనతో ఉన్న బంధాన్ని తెంచుకునేందుకు ఇష్టపడకపోవడంతోనే ఈదుశ్చర్యకు పాల్పడింది. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తితో తన పెళ్లి కుదిరిందని అయినా కూడా రాజ్ తన వెంటపడుతుండటంతో ఈ దురాగతానికి పాల్పడింది. పారాసిటమాల్ మాత్రలు పండ్లరసంలో కలిపి తాగించేందుకు ప్రయత్నించింది. అయితే ప్రియుడు ఆ రసం రుచి లేకపోవడంతో తాగడానికి నిరాకరించాడు. తిరువనంతపురం జిల్లాలోని పరస్సల గ్రామానికి చెందిన రాజ్ బిఎస్‌సీ రేడియాలజీ విద్యార్థి. ఈకేసులో గ్రీష్మ ఐపిసిలోని హత్య, హత్యకు కుట్ర, నమ్మకద్రోహం వంటి అభియోగాల కింద శిక్షార్హురాలని ప్రాసిక్యూషన్ వాదించింది. సాక్ష్యాలు ధ్వంసం చేసేందుకు కూడా యత్నించిందని మరో సెక్షన్ పెట్టారు. నిందితురాలి తల్లిని కూడా కస్టడీలోకి తీసుకున్నప్పటికీ ఆధారాలు సాక్ష్యాలు లేనందున ఆమెను విడుదల చేసారు.



## శబరిమల అయ్యప్ప ఆలయం మూసివేత!

### వెల్లడించిన ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు

**తిరువనంతపురం, జనవరి 20:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకరవిళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేత్తనాల్ రాజరాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామి వారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండునెలల పాటు జరిగే మండల, మకరవిళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండలపూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజుల పాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు. ఈ సీజన్‌లో అయ్యప్ప భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టిడిపి తెలిపింది. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, తూర్పు మండపంలో గణపతి హోమం చేశామని, ఆ తర్వాత మేల్శాంతి అరుణ్‌కుమార్ నంబూద్రి అయ్యప్ప విగ్రహానికి విభూతాభిషేకం నిర్వహించి, దానిని రుద్రాక్షలతో అలంకరించారని వెల్లడించారు. హరివరాసనం పారాయణం తర్వాత మేల్శాంతి ఆలయ దీపాలను ఆర్పి గర్భగుడిని అధికారికంగా మూసివేశారని చెప్పారు. అనంతరం ఆలయ తాళాలను రాజకుటుంబ సభ్యుడికి అప్పగించామని తెలిపారు.

## డొనాల్డ్ ట్రంప్ డిన్నర్‌లో నీతా అంబానీ చీరె ప్రత్యేకతలు!



**వాషింగ్టన్, జనవరి 20:** డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరయ్యేం దుకు దేశ విదేశాల నుంచి అతిరథమహారథులు వాషింగ్టన్‌కు తరలివచ్చారు. వారికోసం ట్రంప్ ప్రత్యేక డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ విందుకు రిలయన్స్ సంస్థ అధినేత ముఖేష్ అంబానీతో పాటు ఆయన భార్య నీతా అంబానీ హాజరయ్యారు. అయితే ఈ డిన్నర్‌లో నీతా అంబానీ ధరించిన చీరె అందరినీ ఆకర్షించింది.
కాంచీపురం నేతతో నలుపు రంగు చీరలో నీతా అంబానీ మెరిసిపోయారు. అలాగే బ్లాక్ కలర్ ఫ్లవర్ బ్లౌజ్‌తోపాటు శతాబ్దాల నాటి ఆభరణాలను సైతం ఆమె ధరించారు. ప్రముఖ కళాకారుడు బి.కృష్ణమూర్తి ఈ చీరెను నేశారు. అలాగే బ్లౌజ్‌ను ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్‌మల్హోత్రా డిజైన్ చేశారు. చెవులు, మెడ, చేతికి పచ్చని పూసలు, రాళ్లతో పొదిగిన ఆభరణాలను ఆమె ధరించారు.
అలాగే చేతి మణికట్టుకు సైతం పచ్చని రాయితో చేసిన ఆభరణాన్ని ధరించి.. ఈ డిన్నర్ లోనే నీతా అంబానీ మెరిసిపోయారు. మొత్తం స్వదేశీ వస్తువులను ఇలా ధరించడం ద్వారా నీతా అంబానీ భారత్‌పై ఉన్న తన అనుబంధాన్ని మరింత ధృడపరుచుకొన్నారు.
ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఈ నెల 18న ముకేష్ అంబానీ దంపతులు అమెరికాకు చేరుకున్నారు. తర్వాత ట్రంప్‌ను కలిసి.. ఈ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. అందుకు సంబం ధించిన ఫొటోలు, విడియోలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ట్రంప్ సారథ్యంలో భారత్, అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతాయన ముకేష్ అంబానీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## జెఎంఎం ఉపాధ్యక్షురాలిగా కల్పనా సోరెన్



**గాండీ(జార్ఖండ్), జనవరి 20:** గాండీ ఎమ్మెల్యే ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్ సతీమణి కల్పనాసోరెన్‌ను పార్టీ ఉపాధ్యపదవికి నియమితులవుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోజరిగే పార్టీ జాతీయ కన్వెన్షన్‌లోనే సోరెన్ ఈనిర్ణయం ప్రకటిస్తారని అంచనా. కల్పన కూడా పార్టీ బాద్యతలు స్వీకరించి మరింత పటిష్టం చేయాలన్న ఉత్సాహంతో ఉన్నారు. ఈ కన్వెన్షన్‌లో జెఎంఎం ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన రికార్డుస్థాయి మెజార్టీని మరింతపెంచేదిశగా చర్చలు కూడా జరపాలని నిర్ణయించింది. జెఎంఎం 34స్థానాలను గెలిచిన సంగతి తెలిసిందే. బీహార్,అసోం, ఒడిశా, బెంగాల్, ఛత్తీస్‌ఘర్, తమిళనాడునుంచి వచ్చే ప్రతినిధులు కూడా ఈసారి కన్వెన్షన్‌లో పాల్గొంటారని పార్టీప్రతినిది ఒకరు తెలిపారు. జెఎంఎం గతంలో 2021లో కన్వెన్షన్ నిర్వహించింది. కొవిడ్‌కారణంగా నామమాత్రంగానే ఈ సదస్సును పూర్తిచేసుకుంది. అయితే ఈసారి భారీస్థాయిలో నిర్వహించాలని నిర్ణయించింది. దీనివల్ల పార్టీ ఇతర రాష్ట్రాల్లో విస్తరించే అవకాశంకూడా ఉంటుందని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అయితే పార్టీ కన్వెన్షన్ రాంచీలోనా లేక దుంకాలోనా అన్నది నిర్ధారణకాలేదు. స్టార్ క్యాంపెయి నర్‌గా కల్పనా సోరెన్ ఈసారి ఎన్నికల్లో వందకుపైగా ర్యాలీల్లో ప్రసంగించారు. ఇండియా కూటమి విజయంలో ఆమె కూడా కీలకపాత్రపోషించారు. పార్టీ వెల్లువలాంటి విజయానికి ఆమె కీలకంగా నిలిచారు. అందుకోసమే ఇపుడు పార్టీలో ఆమెకు క్రియాశీలక భూమిక ఇవ్వాలని నిర్ణయించారు. పార్టీ ఉపాధ్యక్షపదవికి ఆమెను నామినేట్ చేస్తారని అంచనా. అంతకుముందే కల్పనా సోరెన్ రాష్ట్ర మహిళా శిశు అభివృద్ధిసంక్షేమకమిటీకి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. స్పీకర్ రవీంద్ర నాథ్ ఆధ్వర్యంలో మొత్తం 25 హౌస్‌కమిటీలు కూడా ఏర్పాటుచేసారు. ఇండియాకూటమి ప్రచారంలో కూడా జార్ఖండ్ ఝుకేగానహీ ఇండియా రుకేగా నహీ అన్ననినాదాన్ని బహుముఖ ప్రచారంలోకి తెచ్చారు.

# భారత్ ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు..



**న్యూఢిల్లీ, జనవరి 20:** ఈ నెల 26న జరిగే 76వ గణతంత్రదినోత్సవాలకు దేశ రాజధాని నగరంలోని కర్తవ్యపథ్ ముస్తాబవుతోంది. ఈ వేడుకలకు విదేశీ ప్రముఖులతో పాటు పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పనితీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ వన్యప్రాణి సంరక్షులు ఇలా దాదాపు 10,000 మంది ప్రత్యేక అతిధులను కేంద్రం ఆహ్వానించింది. ఇక గణతంత్ర వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ ఇప్పటికే పలు విన్యాసాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత ఆర్మీకి చెందని డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. కదులుతున్న బైక్స్‌పై అత్యంత ఎత్తైన మానవ పిరమిడ్‌ను నిర్మించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తద్వారా అసాధారణమైన ఫీట్‌ను సాధించింది. ఏడు మోటార్ సైకిళ్లపై 40 మంది 2 కిలోమీటర్ల మేర ప్రయాణించడం ద్వారా ఈ ఘనతను అందుకుంది. ఆర్మీలోని మోటార్ సైకిల్ రైడర్ డిస్ప్లే టీమ్‌ను 'డేర్ డెవిల్స్' అని పిలుస్తారు.ఈ టీమ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతేకాదు తమ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రశంసలు కూడా అందుకుంది. ఈటీమ్ ఇప్పటికే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్‌రికార్డ్స్ సహా 33ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. 1934 నుంచి ఇప్పటి వరకు డేర్‌డెవిల్స్ టీమ్ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, ఆర్మీడే పరేడ్‌లు సహా ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో దాదాపు 1,600 మోటార్ సైకిల్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.



## భయపెడుతోన్న మౌంట్‌ఇబు అగ్నిపర్వతం 20 రోజుల వ్యవధిలో 1000 సార్లు విస్ఫోటం!

**జకార్తా, జనవరి 20:** ఇండోనేసియా ప్రజలను మౌంట్ ఇబు అగ్నిపర్వతం వణికిస్తోంది. ఒక్క జనవరి నెలలోనే వెయ్యిసార్లు విస్ఫోటం చెందిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. రానున్న రోజుల్లో దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉండొచ్చన్న హెచ్చరికల నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలను తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని హల్మహేరా ద్వీపంలోని మౌంట్ ఇబు జనవరి నుంచి విస్ఫోటం చెందుతూనే ఉంది. ఇప్పటివరకు దాని నుంచి గాలిలోకి 0.3 కి.మీ. వరకు బూడిద ఎగసిపడింది. తాజాగా ఆదివారం 1.5కి.మీ. మేర పైవరకు బూడిద కనిపించింది. మౌంట్ ఇబు అబ్జర్వేషన్ పోస్ట్ వరకు శబ్దం వినిపించిందని ఇండోనేసియా జియోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. ఇక ఒక్క ఆదివారమే 17సార్లు అగ్నిపర్వతం బద్ధలైందని తెలిపింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా చుట్టుపక్కల ఆరు గ్రామాల్లోని మూడు వేల మంది గ్రామస్థులు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పలువురు గ్రామస్థులు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పలువురు గ్రామస్థులు అధికారుల హెచ్చరికలను పాటించేందుకు నిరాకరిస్తున్నారు. తమ పంటలను మధ్యలో వదిలి వచ్చేయడానికి వారు సిద్ధంగా లేరు. అయితే అధికారులు మాత్రం వారికి నచ్చజెబుతున్నారు. ఇండోనేసియాలోని క్రియాశీలక అగ్నిపర్వతాల్లో మౌంట్ ఇబు కూడా ఒకటి. అది గత జూన్ నుంచి మరింత క్రియాశీలకంగా మారింది.



## ఐకమత్యం, లౌకికవాదం వైపే ఎన్సీపి

### మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్

**ముంబయి, జనవరి 20:** లౌకిక రాజకీయాలకు తమ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్రంలో మతపరమైన విద్వేషాలను వ్యాప్తి చేసే ప్రయత్నాలను సహించబోమని మహారాష్ట్ర డిప్యూటీ సిఎం, ఎన్సీపి చీఫ్ అజిత్ పవార్ అన్నారు. సోమవారం ఆయన జల్నాలో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన సారథ్యంలోని ఎన్సీపిలో కళంకిత వ్యక్తులకు చోటు ఉండదని తేల్చి చెప్పారు. మహారాష్ట్ర ఎప్పుడూ ప్రగతిశీల ఆలోచనలు, సామాజిక సామరస్యానికి నిలయం. ఎన్సీపి ఐక్యమత్యం, లౌకికవాదం వైపే నిలబడుతుంది. వివిధ వర్గాల్లో విద్వేష బీజాలను నాటే వారిని, విభజన రాజకీయాల్లో పాల్గొనేవారిని మేం సహించం, కళంకిత వ్యక్తులను మన పార్టీలో చేర్చుకోవద్దు అని పార్టీ శ్రేణులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న మాఝీ లడ్కీ బెహన్ యోజన ఆర్థికంగా వెనుకబడిన మహిళల కోసమే. ఆదాయపు పన్ను చెల్లించే వారు సైతం నెలవారీ నగదు బదిలీ పథకం ప్రయోజనాలను పొందుతున్నారు. తమకు తాముగా వారంతా ఆ ప్రయోజనాన్ని వదులుకోవాలి. అర్హులైన లబ్దిదారులు వచ్చే నెల నుంచి రూ.1500 చొప్పున అందుకుంటారు అని అన్నారు. ఇవిఎంలపై విపక్షాల ఆరోపణలు అర్థంలేనివని కొట్టిపారేసిన అజిత్ పవార్ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు.



## తెరపైకి మాయావతి రెండో మేనల్లుడు

**లక్నో, జనవరి 20:** బహుజన్ సమాజ్ పార్టీ అధినాయకురాలు, యూపి మాజీ ముఖ్యమంత్రి మాయావతి తన రెండో మేనల్లుడు ఇషాన్ ఆనంద్ (26)ను రాజకీయ తెరపైకి తెచ్చారు. రెండు రోజుల కిందట లక్నోలో జరిగిన బిఎస్పీ సమావేశంలో ఇషాన్‌ను ఆమె లాంఛనంగా పార్టీ నాయకులకు పరిచయం చేశారు. దీంతో పార్టీలో ఇషాన్ క్రియాశీలక పాత్ర పోషిస్తారనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. తన 69వ పుట్టిన రోజు వేడుకల మరుసటిరోజు జనవరి 16న మాయావతి పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిచయం చేసిన ఇషాన్ లండన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్‌మినిస్టర్‌నుంచి న్యాయవిద్య అభ్యసించారు. ఇషాన్ అన్న ఆకాశ్ ఆనంద్ ఇప్పటికే బిఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఉన్నారు. ఇటీవలి హర్యానా అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను పర్యవేక్షించిన ఆకాశ్ ప్రస్తుతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఆకాశ్, ఇషాన్ ఇద్దరూ మాయావతి సోదరుడైన ఆనంద్‌కుమార్ సంతానం.

## నిర్లక్ష్య డ్రైవింగ్‌తో 35 మంది బలి

# చైనా వృద్ధుడికి మరణశిక్ష అమలు

**బీజింగ్, జనవరి 20:** చైనాలో ఇటీవల ఓ వ్యక్తి నిర్లక్ష్యంగా కారు నడిపి 35 మంది ప్రాణాలు పొట్టన బెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడికి మరణశిక్ష పడగా న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడికి శిక్ష అమలు చేశారు. మరో కేసులో ఓ యువకుడికీ ఇదే విధంగా మరణశిక్ష అమలు చేసినట్లు చైనా అధికారిక మీడియా సిసిటివి వెల్లడించింది. చైనాకు చెందిన ఫాన్ వీకియూ (62) అనే వ్యక్తి గతేడాది నవంబరు 11న ఝుహాయ్ నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ బయట నిర్లక్ష్యంగా కారు నడిపాడు. అక్కడ వ్యాయామం చేస్తున్న వారిపై దూసుకెళ్లిన ఘటనలో 35 మంది మరణించగా మరో 43 మంది గాయపడ్డారు. తర్వాత కారులో తనను తాను కత్తితో పొడుచుకుని ప్రాణాలు తీసుకునేందుకు యత్నించాడు. కోమాలోకి వెళ్లిన అతడిని ఆస్పత్రిలో చేర్చారు. ఇటీవలే విడాకులు తీసుకున్నాడని, భార్యతో జరిగిన ఆస్తి పంపకంలో అసంతృప్తికి గురవడంతోనే అతడు ఈ ఘోరానికి పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో తేలింది.
ఈ కేసుపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ ఘటన అత్యంత ఘోరమైనదిగా పేర్కొంటూ నిందితుడికి మరణశిక్ష విధించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడికి మరణశిక్ష అమలు చేసినట్లు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. చైనాలో ఇటువంటి దారుణాలు అరుదే అయినప్పటికీ గతేడాది అక్కడ ఈ తరహా ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం గమనార్హం. జియాంగ్సు ప్రావిన్సులో గత నవంబరులో ఓ యువకుడు కత్తులతో దాడికి పాల్పడిన ఘటనలో 8 మంది మృతి చెందగా 17 మంది గాయపడ్డారు. ఈ కేసులో స్థానిక న్యాయస్థానం నిందితుడికి మరణశిక్ష విధించింది. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ఈ 21 యేళ్ల యువకుడికి కూడా మరణశిక్ష అమలు చేశారు.

## 'ప్రస్తుత తీర్పు సంతృప్తికరంగా లేదు' మమతా బెనర్జీ



**కోల్‌కతా, జనవరి 20:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఆర్జీకర్ ఆసుపత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్‌రాయ్‌కి న్యాయస్థానం జీవిత ఖైదు విధించిన సంగతి తెలిసిందే. దీనిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఈ తీర్పుపై తాను సంతృప్తి చెందలేదని అన్నారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు సంబంధించిన కేసులో దోషికి మరణశిక్ష విధించాలని మేమంతా డిమాండ్ చేశాం. కానీ, అలా జరగలేదు. ఈ కేసును బెంగాల్ పోలీసుల నుంచి బలవంతంగా సిబిఐకి బదిలీ చేశారు. ఒకవేళ ఈ కేసు దర్యాప్తు బెంగాల్ పోలీసుల చేతుల్లోనే ఉంటే దోషికి మరణశిక్ష పడేలా శాయశక్తులా ప్రయత్నించేవారు. అసలు విచారణ ఎలా జరిగిందో తెలియదు. రాష్ట్ర పోలీసులు విచారించిన ఇలాంటి అనేక కేసుల్లో దోషులకు మరణశిక్ష పడింది. ప్రస్తుత తీర్పు సంతృప్తికరంగా లేదు అని విలేకరుల ఎదుట సిఎం మమతా పేర్కొన్నారు. కాగా గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసు బెంగాల్ పోలీసుల నుంచి సిబిఐకి బదిలీ అయింది. దీనిలో భాగంగా విచారణ అనంతరం ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌పేరును మాత్రమే చార్జిషీట్‌లో చేర్చింది. ఆసుపత్రి ఆవరణలోని సిసిటివిలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చింది. శిక్ష ఖరారు చేయడానికి ముందు సంజయ్ తన వాదనలు వినిపించాడు. తాను ఏ నేరం చేయలేదని ఏ కారణం లేకుండానే తనను ఇందులో ఇరికించారని అన్నాడు. తాజాగాకోర్టు అతడికి జీవిత ఖైదును విధించింది.

## సైఫ్‌పై దాడి కేసు..కోర్టులో ఇద్దరు న్యాయవాదుల గొడవ



**ముంబై, జనవరి 20:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరఫున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవ పడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే..సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అని అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి నిందితుడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరఫున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలో మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యంచేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒకటీమ్‌గా అతని తరఫున వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు న్యాయవాదులు కూడా సమ్మతించారు. కాగా, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీసు కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్‌దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ పనులు చేసేవాడు. ఆ ఇల్లు సైఫ్‌అలీ ఖాన్‌దని తనకు తెలియదని, కేవలంచోరీ కోసమే వచ్చినట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి.

21-1Pg6exHMNWJQE.qxd:21-1Pg6exHMNWJQE.qxd 01/01/01 9:23 AM Page 1



# మామండూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మృతి.. మరో నలుగురికి గాయాలు..

**రేణిగుంట జనవరి 20 ప్రభాతవార్త** తిరుమల శ్రీవారిని దర్శించుకుని కారులో ఆనందంగా తమ ఊరికి తిరిగి వెళుతున్న ఓ కుటుంబం పై విధి చిన్నచూపు చూసింది. ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు వెంటాడింది. వారు ప్రయాణిస్తున్న



రోడ్డు ప్రమాద దృశ్యం

కారు ట్రావెల్స్ బస్సు ను ఢీకొంది ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం తిరుపతి జిల్లా రేణిగుంట మండలం రేణిగుంట కోడూరు హైవే మార్గంలో మామండూరు కుక్కల దొడ్డి మధ్య చోటుచేసుకుంది. వివరాలు ఇలా తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు కు చెందిన సందీప్ షా (35), అతని భార్య అంజలీదేవి (31), కుమార్తెలు లిఖితాషా(12), సోనాలిషా(9), కుమారుడు రుద్ర ప్రతాప్ షా (6) సందీప్ షా స్నేహితుడు నరేష్ లు కారులో గురువారం తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరారు. శ్రీవారి దర్శనం ముగించుకొని అదే కారులో సోమవారం పటాన్ చెరువుకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు మామండూరు దాటి కుక్కల దొడ్డి సమీపిస్తుండగా దారిపై ఉన్న కోతులను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సు ను కారు ఢీకొంది. ఈ సంఘటనలో కారు ముందు భాగం నుజ్జయింది.

కారు డ్రైవ్ చేస్తున్న సందీప్ షా, అతని భార్య అంజలీదేవి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న వారంతా తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న

రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటన స్థలం చేరుకున్నారు. అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించారు. రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సంఘటన స్థలం చేరుకొని ప్రమాదం జరిగిన స్థితిగతులను పరిశీలించారు.

# మహాశివరాత్రికి లేజర్ అందాలు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వచ్చే నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అలంకారాలతో పాటు ప్రత్యేకంగా లేజర్ లైటింగ్ అందాలతో నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. గతం కన్నా భిన్నంగా శివరాత్రి నిర్వహించాలన్నది లక్ష్యంగా వివరించారు. గతంలో మహాశివరాత్రి పర్వదినాన వాయులింగేశ్వరుని కన్నా ఓ నాయకుడే స్వామిగా వ్యవహారించారన్నారు. ఈ ఏడాది స్వామి దర్శనానికి ప్రాధాన్యత ఇవ్వటానికి అధి కారులకు ఆదేశించామన్నారు. ఇక మహాశివరాత్రి పర్వదినాన వచ్చిన ప్రతిభక్తుడు సత్వర , సుదర్శనం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి తరువాత మాస్టర్‌ప్లాన్‌కు ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ నెల 22న కలెక్టర్,ఎస్‌పిలతో సమావేశం ఏర్పాటు చేసామని సుధీర్‌రెడ్డి వివరించారు. లేజర్ అందాలు ప్రత్యేకం: మహాశివరాత్రి సందర్భంగా 13 రోజుల పాటు భక్తులకు కనువిందు చేయటానికి అత్యాధునికి సంకేతిక పరిజ్ఞానంతో పట్టణమంతా ఆకట్టుకునే రీతిలో లైజర్ లైటింగ్ అందాలను రూపకల్పన చేస్తున్నట్లు సుధీర్‌రెడ్డి వివరించారు. ఆదివారం రాత్రి ప్రయోగాత్మకంగా పట్టణంలో పరిశీలించామన్నారు. రాజగోపురం పైన శివపార్వతుల ప్రతిష్టలా, అలాగే కైలాసగిరి పర్వత పంక్తుల్లో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలపై ప్రత్యేక లైటింగ్‌ను పరిశీలించామన్నారు. చాలా అద్భుతంగా ఉందని ఎంఎల్‌ఏ అభిప్రాయపడ్డారు. ఇక ఈ ఏడాది సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంఎల్‌ఏ వివరించారు. ఉమ్మడి రాష్ట్రాల నుంచి పేరెన్నిక గన్న కళాకారుల కార్యక్రమాలను ఏర్పాటు చేసామన్నారు. అంతేకాక తెలంగాణ,కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రులను కూడా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆదేశాలతో ఆహ్వానించనున్నట్లు వివరించారు. రాష్ట్రం నుంచి నారాలోకేష్;డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాజగోపురం పక్కనే ఆకట్టుకునేటట్లు సాంస్కృతిక వేదికను ఏర్పాటుకు ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించినట్లు వివరించారు.

# సామాన్యభక్తులకు సంతృప్తికరంగా వైకుంఠద్వార దర్శనం

## - పదిరోజులు 6.83 లక్షల మంది భక్తులకు అవకాశం

**తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోపల మోక్షమార్గం వైకుంఠద్వారాన్ని పదిరోజులపాటు 6,83,304 మంది భక్తులకు సంతృప్తికరంగా టిటిడి అధికారులు దర్శనం చేయించారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు అనంతరం ఆదివారం అర్ధరాత్రి ద్వారాలను మూసివేశారు. రాజ్యాంగహో దాలోని ప్రముఖులతోబాటు విఐపిలు, సామాన్యభక్తులకు చిన్నపాటి అసౌకర్యం కలగకుండా వారికి నిర్దేశించిన సమయంలో ప్రశాంతంగా...తక్కువ సమయంలో వెంకన్న వైకుంఠద్వార దర్శనం కల్పించడంలో ఈ ఏడాది టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథ, ఆలయ వర్గాలు కంకణబద్ధులై అంకితభావంతో పనిచేశారు. జనవరి 10వతేదీ నుండి 19వరకు పదిరోజులపాటు విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి పరిమితంగానే జారీచేశారు. ఆన్‌లైన్‌లో 19,500 శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు(మహాలఘు దర్శనమే) ,1.40లక్షలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు,ఆఫ్‌లైన్‌లో సామాన్యభక్తులకు పదింరోజులకు 4.50లక్షల ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ టోకెన్లు ,దాతలు 8వేల టిక్కెట్లతో దర్శనం చేయించారు. పదిరోజులపాటు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించిన సౌకర్యాలు భక్తులను సంతోషం కలిగించాయి. పదిరోజులు తిరుమలకు వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కుబడుల రూపంలో హుండీ కానుకలు ఆదాయంవచ్చింది.

# పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను ప్రారంభించిన డిజిపి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జనవరి 5, ప్రభాతవార్త** రాష్ట్ర డి.జి.పి సిహెచ్. ద్వారకాతిరుమలరావు పోలీస్ క్వార్టర్స్ శ్రీరాంపురం రోడ్డులో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంక్, జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ పెరేడ్ గ్రౌండ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం పోలీసు గ్రౌండ్ పరిశీలించారు. ఆయనకు ఏలూరు రేంజ్ ఐ.జి వి.జి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ స్వాగతం పలికారు. ప్రజలకు రక్షణ కల్పించాలని అధికాలకు డిజిపి సూచించారు. దీనిలో అడిషనల్ ఎస్‌పి న్ బి ఎం మురళీకృష్ణ , లా అండ్ ఆర్డర్ ఆడిషనల్ ఎస్పి అల్లూరి వెంకట సుబ్బరాజు, క్రైమ్స్ అడిషనల్ ఎస్పి ఎల్. అర్జున్, ఎల్ చెంచి రెడ్డి, బి. రామకృష్ణ, ఇన్స్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



# అద్భుతరీతిలో దుర్గమ్మకు నృత్యనీరాజనం

**ఇంద్రకీలాద్రి, జనవరి 20, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి సోమవారం తణుకుకు చెందిన నండూరి రాధిక, రాగరవళి కూచిపూడి నృత్యకళాక్షేత్రంకు చెందిన కళాకారులు త్రితిక, క్యాతి, రోషిణి, సహస్ర, హిమజ, తేజస్విని, హిరణ్మయ్, ఉతిస్తా, చంద్రిక, శ్రుతిక, నవీనా, అపూర్వ, పూజ, ప్రజ్ఞ, నరేష్, అంజలిలు మీనాక్షి పంచరత్నం, కంజదళాయతాక్ష, శివాష్టకం, కాలభైరవాష్టకం, తక్కువేమి మనకు, శ్యామలేమీనాఓఇ, బాగ్యదలక్ష్మి బారమ్మ, నమఃశివాయతే, శివతాండవస్తోత్రం, అయిగిరి నందిని, దుర్గాచాలీసా, భోశంభో, చంద్రచూడ, బ్రహ్మాంజలి, గరుడగమన, కూచిపూడి నృత్యం అందించి ఆహుతుల మన్ననలందుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, మెమొంటోలను, సర్టిఫికెట్లను డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు అందించి సత్కరించారు.

# యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ఆర్కిటెక్ట్ నరీందర్ సింగ్ బేడి కన్నుమూత

**అనంతపురం, జనవరి 20, (ప్రభాతవార్త బ్యూరో)** ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నో సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించిన యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ఆర్కిటెక్ట్ నరీందర్ సింగ్ బేడి (85) సోమవారం పెనుకొండలోని (శ్రీ సత్యసాయి జిల్లా) తన ఇంట్లో తుది శ్వాస విడిచారు. ఆయన భార్య సోంజా తో పాటు కుమారులు రాజీవ్, సంజయ్, వారి భార్యలు ఆస్ట్రిడ్ , షెల్లీ, కుమార్తె తారా, ఆమె కుటుంబం డొమినిక్, లూకాస్ , బుల్బుల్ మనవరాళ్ళు అర్జున్, మలిక, రోహన్ ఉన్నారు అని నరేంద్ర సింగ్ బీడీ భార్య సోంజా మేరీ పై విధంగా తెలియజేశారు.. అదేవిధంగా ఆసియన్ ఫ్రాటెర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి. మల్లా రెడ్డి ఒక సందేశంలో మృతుల కుటుంబానికి సంతాపం తెలిపారు. నరీందర్ సింగ్‌ను ఎన్జీఓ రంగానికి మార్గదర్శకులలో ఒకరిగా మల్లారెడ్డి అభివర్ణించారు. "దివంగత నరీందర్ బేడి పెనుకొండ సమీపంలో కొత్త చొరవను ప్రారంభించడానికి ముందు కొంతకాలం శిదీగి వ్యవస్థాపకుడు విసెంట్ ఫెర్రర్‌తో కలిసి పనిచేశారు" అని ఆయన తెలిపారు. ఒక సందేశంలో నరేంద్ర సింగ్ బీడీ సతీమణి సోంజా ఇలా అన్నారు: "బుల్బుల్ అని ప్రేమగా పిలువబడే నరీందర్ సింగ్ బేడి మరణానికి సంబంధించిన హృదయ విదారక వార్తను మేము తీవ్ర దుఃఖంతో పంచుకుంటున్నాము". బుల్బుల్ జూలై 19, 1939న జన్మించారని , సోమవారం (ఈరోజు) జనవరి 20 తేది ఉదయం 8:30 గంటలకు మరణించారని ఆమె చెప్పారు. ఆయన ఇంట్లోనే ఉన్నారని, నిద్రలోనే ప్రశాంతంగా మరణించారని ఆమె చెప్పారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని, అందువల్ల నివాళులు అర్పించాలనుకునే వారు జనవరి 21 మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల మధ్య బేడి ఇంటికి రావచ్చని ఆమె చెప్పారు.

# దేశంలోనే మొదటిసారి డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ సెంటర్ ఏర్పాటు అపోలో యూనివర్సిటీ ఘనత

**చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:** చిత్తూరు అపోలో యూనివర్సిటీ, అపోలో హాస్పిటల్స్ దేశంలోనే ప్రత్యేక ఘనత సాధించింది. అపోలో యూనివర్సిటీ, అపోలో హాస్పిటల్స్ లీసెస్టర్ విశ్వవిద్యా లయం చిత్తూరు అపోలో విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ సెంటర్(సిడిహెచ్‌పిఎం) ఏర్పాటు చేయడానికి భాగస్వామ్యం కుదుర్చుకుంది. డిజిటల్ హెల్త్, ప్రెసిషన్ మెడిసిన్ కోసం ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడానికి ఈ ఆధునాతన పరిశోధనా కేంద్రం రెండు సంస్థల నైపుణ్యం, వనరులను ఒకే



డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ సెంటర్ ఏర్పాటుపై ఒప్పందాలు చేసుకుంటున్న అపోలో, లీసెస్టర్ యూనివర్సిటీ ఛాన్సలర్లు, వైస్ ఛాన్సలర్లు

ప్రదేశానికి తీసుకురానుంది. సిడిహెచ్‌పిఎం సెంటర్ దేశంలోనే చిత్తూరు కేంద్రంగా విధులు నిర్వహిస్తుంది. అలాగే లీసెస్టర్ విశ్వవిద్యాలయంలోని కేంద్రం లీసెస్టర్‌లోని గ్లెన్‌ఫీల్డ్ హాస్పిటల్‌లోని బిహెచ్‌ఎఫ్ కార్డియోవాస్కులర్ రీసెర్చ్ సెంటర్‌లో ఏర్పాటు కానుంది. ఈ కేంద్రం సహ డైరెక్టర్లుగా లీసెస్టర్ విశ్వవిద్యాలయంలోని కార్డియాలజీ ప్రొఫెసర్, ప్రొఫెసర్ సర్ నీలేష్ జె.సమాని, అపోలో విశ్వవిద్యాలయంలోని అనుబంధ ఫ్యాకల్టీ, అపోలో హాస్పిటల్స్ చీఫ్ మెడికల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ సుజోయ్ కర్ వ్యవహరిస్తారు. అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్, అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి సోమవారం లీసెస్టర్ విశ్వవిద్యాలయం, అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల సమక్షంలో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ సెంటర్‌ను చిత్తూరు అపోలో యూనివర్సిటీ వేదికగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి మాట్లాడుతూ అపోలో యూనివర్సిటీ ఆరోగ్యానికి ఎల్లప్పుడు అనుకూలంగా వుంటుందని, సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ ఆ నమ్మకంపై ఆధారపడి రూపుదిద్దుకుందన్నారు. ఈ విధానంతో తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులకు తగినట్లుగా వ్యాధి అంచనా, నివారణ, రోగ నిర్ధారణ, నిర్వహణను మెరుగుపరచడం ద్వారా ఆరోగ్య సంరక్షణ డెలివరీని మార్చాలని తాము కోరుకుంటున్నట్లు వివరించారు.

# త్వరలో రైల్వే గార్డు నియామకాలకై నోటిఫికేషన్

**గుంతకల్లు రైల్వే,జనవరి 20,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న గార్డు(ట్రైన్ మేనేజర్)పోస్టులను పదోన్నతుల కోటాకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. జోన్ పరిధిలోని హైదరాబాద్,సికింద్రాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లలో పదోన్నతుల కోటాలోని 250గార్డు పోస్టుల భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

# రాష్ట్రంలో తగ్గిన నేరాలు, ఆధునిక టెక్నాలజీ డ్రోన్స్ తో నియంత్రణ

## ఆయుధ భాండాగారన్ని ప్రారంభించిన డిజిపి ద్వారక తిరుమలరావు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 20(ప్రభాతవార్త):** వార్షిక తనిఖీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సోమవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైమ్ రేటు తగ్గిందని, నేరాలు అదుపులో ఉన్నాయని అన్నారు. ఆధునిక టెక్నాలజీ డ్రోన్స్ కెమెరాలతో నేరాలను నియంత్రించగలుగుతున్నామని చెప్పారు. అనంతరం జిల్లా ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయుధ భాండాగారము ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం కాకినాడ ఆర్టీసీ డిపో ను సందర్శించారు. గ్యారేజ్ లో ఏర్పాటుచేసిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్స్ ఎన్ జే రావు, వివిఎన్ మూర్తి లకు ప్రశంస పత్రాలు అందజేశారు.

# అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డుల్లో 85 లక్షల టన్నుల వ్యర్థాల తొలగింపు: కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వం డంపింగ్ యార్డుల్లో వదిలేసిన 85 లక్షల టన్నుల వ్యర్థాలను శుభ్రం చేయించి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సాకారం చేస్తామని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. చెత్తపై పన్ను వేసిన గత వైకాపా ప్రభుత్వం డంపింగ్ యార్డులను గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఆ మేరకు ఆయన సమాచార పత్రికను విడుదల చేసారు. సీఎం చంద్రబాబు మైదుకూరులో ప్రారంభించిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజున 9557 మెట్రిక్ టన్నుల చెత్త తొలగించాం. నెలలో మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటామని 474427 మంది ప్రతిజ్ఞ చేశారు అని వివరించారు. గత ఆరు నెలల్లో డంపింగ్ యార్డుల్లో 54% వ్యర్థాలను శుభ్రం చేయించాం. మిగిలిన 46.59 లక్షల టన్నులను అక్టోబరు 2 నాటికి పూర్తి చేయిస్తాం. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నెలకో అంశం ఎంపిక చేసి 12 నెలల్లో 12 కార్యక్రమాలు అమలు చేయనున్నాం. అన్ని పట్టణాల్లోనూ 1406 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఘన వ్యర్థాల సమస్య పరిష్కారానికి రాజమహేంద్రవరం నెల్లూరు రాయలసీమలో మూడు విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. అని పట్టాభిరామ్ వివరించారు. నేను నివాసం ఉంటున్న కాలనీ నుంచే జీరో వేస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తా. ఎక్కడికక్కడే తడి, పొడిగా విభజించి యాజమాన్య కార్యక్రమాలు చేపడతాం. ఆ తరువాత ఇదే విధానాన్ని మిగిలిన కాలనీల్లోనూ అమలు చేయిస్తాం. పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై పర్యవేక్షణ కోసం త్వరలో కమాండ్ కంట్రోల్ కేంద్రం ప్రారంభిస్తాం. సమస్యలపై ప్రజల నుంచి సమాచారం తెలుసుకోడానికి యాప్ కూడా సిద్ధం చేస్తున్నాం. డ్రోన్లను వినియోగిస్తాం. ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ఎలక్ట్రికల్ ఆటోలు ప్రవేశపెడుతున్నాం. ప్రజారోగ్యం , పారిశుద్ధ్య సమస్యపై పిల్లలకు విద్యార్థి దశలోనే అవగాహన కల్పించేందుకు మంత్రి లోకేశ్ సహకారంతో విద్యా సంస్థల్లో ప్రతి వారం బోధించేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని పట్టాభిరామ్ తెలిపారు.

# రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న టిడిపి

## వైఎస్సార్సీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**నెల్లూరు, జనవరి 20, ప్రభాతవార్త-వైద్యం** టీడీపీ కూటమి ప్రభుత్వం మంత్రి లోకేష్ రచించిన రెడ్ బుక్ పేరుతో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తుందని వైసీపీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం నెల్లూరు జిల్లా కేంద్రంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో తెలుగుదేశం వాళ్ల దాడిలో గాయాలపాలై చికిత్స పొందుతున్న ముత్తుకూరు మండల బీట్-2 ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని గోవర్ధన్‌రెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాకాణి గోవర్ధన్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నిత్యం దాడులు, విధ్వంసాలు ప్రజలని అన్ని రకాల ఇబ్బందులకు గురి చేస్తూ, విధ్వంస పాలనకి శ్రీకారం చుట్టడం జరిగిందని మండిపడ్డారు. రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మీద దాడులు చేయడం, వాళ్ల ఆస్తులు ధ్వంసం చేయడం, వాళ్ల భూములను ఆక్రమించడం ప్రశించిన వారి మీద గౌర్జన్యం చేయడం అరాచకాలను అడ్డుకున్న వ్యక్తులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. దాడిలో వెంకటేశ్వర్లుకు తల మీద నాలుగు కుట్లు పడ్డాయి. తీవ్రమైనటువంటి రక్తస్రావం జరిగిందని, తొంటె విరిగిపోయిందని, రోజు డాక్టర్లు దానికి సర్జరీ చేయాలని చెప్పడం బాధాకరంగా ఉందన్నారు. ఆదివారం సాయంకాలం దాడి జరిగితే ఉదయం వచ్చి పోలీసులు విచారించారు తప్ప, ఇంత వరకు నిందితుడ్ని అదుపులోకి తీసుకోలేదని విమర్శించారు. పోలీసులు తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం చెప్తే అది చేస్తున్నారు తప్ప చట్టబద్ధంగా వ్యవహారించడం లేదని ఆరోపించారు.

# ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే ప్రజా దర్బార్

## - రోడ్లు భవనాల మంత్రి జనార్ధన్‌రెడ్డి

**సచివాలయం,జనవరి 20,ప్రభాతవార్త :** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తుందని మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లోపాల్గొన్న మంత్రి పై విధంగా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు చెందిన మహిళలు, బాలమ్మ, లక్ష్మీదేవీలకు చెందిన వ్యవసాయ భూములను ఆన్‌లైన్‌లో రెవెన్యూరికార్డుల నుంచి తొలగించడంపై మంత్రి దృష్టికి తీసుకురాగా కర్నూల్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాలి ని ఆదేశించిన మంత్రి తిరుపతి అర్బన్ రెవెన్యూ మండలం మంగళం రెవెన్యూగ్రామంలో ఎస్ శ్యామలాదేవికి చెందిన స్థలంలో ప్రహరీ గోడను వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరులు దౌర్జన్యంగా ధ్వంసం చేయగా బాధితుడు కోర్టుకెళ్ళి ఇంజక్షన్ ఆర డర్ తెచ్చుకున్న తర్వాత కూడా వారి ఆగడాలు ఆపకపోవడంతో బాదితులు మంత్రి దృష్టికి తీసుకురాగా...తిరుపతి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి..దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కేసు నమోద చేయాల్సిందిగా ఆదేశించిన మంత్రి... అనంతపురం అర్బన్ లో ఎం సునీత కు చెందిన స్థలంలో కొంతమంది అక్రమంగా గుడిసెలు నిర్మించుకోగా వాటిని తొలగించాలి ిందిగా సదరు మహిళ మంత్రి దృష్టికి సమస్యను తీసుకువచ్చారన్నారు.


# అనంతపురంలో పర్యటించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా



రాజీవ్‌రంజన్‌మిశ్రాకు పూలమొక్క అందచేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, జనవరి 20 ప్రభాతవార్త** సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్‌సిల ఉప వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా (రిటైర్డ్ ఐఎఎస్) అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేశారు. సోమవారం అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఎస్‌సిల ఉపవర్గీకరణ ఏకసభ్య కమీషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రాను అనంతపురం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, జిల్లా ఎస్‌పి జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలు, పుష్పగుచ్చాలు అందచేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవనంలో సాంఘిక సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్‌సి ఉప కులాల వర్గీకరణకు సంబంధించి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులతో ఎస్‌సిల ఉప వర్గీకరణ ఏకసభ్య కమీషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమీషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి ఆయా శాఖల వారిగా పూర్తి సమాచారాన్ని త్వరితగతిన కమీషన్‌కు సమర్పించాలన్నారు. ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహారించాలని పూర్తి సమాచారాన్ని సకాలంలో సమర్పించాలన్నారు.

# కుటుంబం గౌరవంగా బతకాలంటే ఆర్థిక సమస్యలు ఉండకూడదు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,జనవరి20ప్రభాతవార్తప్రతినిధి:** కుటుంబం గౌరవంగా బతకాలంటే ఆర్థిక సమస్యలు ఉండకూడదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇక్కడ కుటుంబమంటే తెలుగువారమంతా అనే అంశాన్ని నొక్కి చెబుతున్నానన్నారు. యువత ఎప్పుడూ భవిష్యత్ దిశగా ఆలోచించాలని చెప్పారు. సంపద సృష్టించడం కష్టం కాదన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా తెలుగు పారిశ్రామికవేత్తలు, ప్రవాసాంధ్రులతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి తెలుగువాళ్లు గొప్పగా ఉండాలనేదే తన లక్ష్యమని అదేవిధంగా ప్రత్యేక గుర్తింపు రావాలని తెలిపారు. తెలుగువాళ్లు అనేక కష్టాలుపడి ఈ స్థాయికి వచ్చారని ఉక్రెయిన్‌లో సమస్య వచ్చినప్పుడు ప్రవాసాంధ్రులు బాగా పని చేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఎక్కడికి వెళ్లినా మీరు మూలాలు మరిచిపోకూడదు. ఆరోజు ఇంజినీరింగ్ కాలేజీలు తేవడం వల్లే మీరంతా చదువుకున్నారు. ఎంతో పోరాడి మైక్రోసాఫ్ట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో పెట్టించా. మనరాష్ట్ర యువతలో నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. ప్రవాసాంధ్రులను ఎలా ప్రోత్సహించాలో అనే దిశగా ఆలోచన. నిరంతర శ్రమ వల్లే తెలుగువాళ్లు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. 2004లో కొత్త ప్రభుత్వం వచ్చినా ఐటీ భవనాలు కూల్చలేదు. గత ఐదేళ్లలో మాత్రం అన్ని రంగాలనూ ధ్వంసం చేశారు. వర్క్ ఫ్రం హోమ్ కల్చర్ వేగంగా పెరుగుతోందిఖ అని చంద్రబాబు వెల్లడించారు.

# తొలిరోజే పెట్టుబడిదారులతో వరుస సమావేశాలు

## - స్విస్ కంపెనీలతో భేటీ - పెట్టుబడులకు ఆహ్వానం

**విజయవాడ, జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం తొలిరోజు పర్యటనలో వరుసగా వివిధ దేశాల.స్విస్ పారిశ్రామికవేత్తలు,పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహించారు. జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో స్విట్జర్లాండ్‌లోని భారత అంబాసిడర్ మృధుల్ కుమార్‌తో సమావేశంలో చర్చించిన అంశాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రానికి స్విట్జర్లాండ్ నుంచి పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వారు నిశితంగా యోచన చేసారు. ఈ క్రమంలో నెస్లే, ఏబీబీ, నోవార్టిస్ వంటి దిగ్గజ కంపెనీలతో సహా ఇప్పటివరకు 350కు పైగా స్విట్జర్లాండ్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాయని, మరిన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని మృధుల్ కుమార్ సీఎం చంద్రబాబుకు వివరించారు. , ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మాస్యూటికల్స్, మెడికల్ డివైజ్‌లు, టెక్నికల్ టెక్స్‌టైల్స్, రైల్ కాంపోనెంట్ వంటి తయారీ రంగంలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపీ, స్విట్జర్లాండ్ యూనివర్సిటీలు.. ఏపీలో ఏర్పాటు చేస్తున్న స్కిల్లింగ్, ఏఐ యూనివర్సిటీకి కలిసి పనిచేసేలా చూడాలని మృధుల్ కుమార్‌కు ముఖ్యమంత్రి చెప్పారు. వర్క్ ఫ్రం హోం విధానంలో స్విట్జర్లాండ్‌కు కావాల్సిన సేవలను అందించేందుకు అన్నిరంగాలకు చెందిన నైపుణ్య యువత ఏపీలో ఉన్నారని తెలిపారు. స్విట్జర్లాండ్ కంపెనీల సీఈవోలతో భేటీ తమ భేటీ అనంతరం మృధుల్ కుమార్ స్విట్జర్లాండ్‌కు చెందిన నాలుగు ప్రముఖ సంస్థల సీఈవోలు, ఇతర ముఖ్యులను సీఎం చంద్రబాబుతో సమావేశపరిచారు. మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ అయిన 'స్విస్‌మెన్' సెక్రటరీ జనరల్ రౌల్ కెల్లర్, పాలిమర్ ప్రాసెసింగ్ రంగానికి చెందిన 'ఓర్లికాన్' సీఈవో మార్కస్ టకే, హై క్వాలిటీ ఇండస్ట్రియల్ కాంపోనెంట్స్ అండ్ కస్టమ్ ఇంజినీర్డ్ సొల్యూషన్స్ సంస్థ అయిన 'ఆంగ్స్ట్ ఫిస్టర్' సీఈవో ఎరిచ్ స్మిడ్, టెక్స్‌టైల్స్ రంగానికి చెందిన 'స్విస్ టెక్స్‌టైల్స్' హెడ్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ ఎక్స్‌టెర్నల్ ఎఫైర్స్ జార్న్ వాన్ డెర్ క్రోన్‌కు రాష్ట్రంలో పెట్టుబడులకు గల విస్తృత అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను వినియోగించుకునేందుకు ఏపీకి రావాలని ఆహ్వానించారు.

# తిరుపతిలో టిటిడి హృదయాలయం ఏర్పాటుచేయాలి

## - కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్

**తిరుపతి,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలో గుండెజబ్బుల (హృదయాలయం)ఆస్పత్రి ఏర్పాటు చేయాలని మాజీకేంద్రమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. వయసుతో సంబంధం లేకుండా పలురకాలుగా గుండెజబ్బులతో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య




అధికంగా ఉందన్నారు. అంతేగాక క్యాన్సర్ ఆస్పత్రిని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేయాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో ఉన్న క్యాన్సర్ ఆస్పత్రి తెలంగాణకు పోయిందని, తమిళనాడు అడయార్‌లో ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతిలో ఎందుకు ఏర్పాటుచేయరని ఆయన ప్రశ్నించారు. స్విమ్స్ ఆస్పత్రిని టిటిడి ధార్మికసంస్థ నిర్వహిస్తోందని, అక్కడ పేదరోడుల నుండి ఓపిలకు, వైద్యానికి డబ్బులు వసూలుచేయడం మంచిదికాదన్నారు. ధార్మిసంస్థలో డబ్బుకు ప్రాధాన్యత ఇవ్వకూడదని, ధర్మానికి ప్రాధన్యాతనివ్వాలని ఆయన సూచించారు. సోమవారం టిటిడి పరిపాలన భవనం వద్ద టిటిడి ఉద్యోగుల ఇళ్ళస్థలాలు, వారి సమస్యలు, స్విమ్స్ ఆస్పత్రి నిర్వహణ తదితరచ వాటిపై కాంగ్రెస్ శ్రేణులతోకలసి నిరసన తెలిపారు.

21-1P□g7exHMNWJQE.qxd:21-1P□g7exHMNWJQE.qxd 01/01/01 9:22 AM Page 1





నాచారం డిపిఎస్‌లో ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి ఈటల, ఎమ్మెల్యే బిఎల్ఆర్ తదితరులు

## రహదారి భద్రతే కాదు.. బాధ్యత కూడా అందరిదీ

### నాచారం డిపిఎస్‌లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కును ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (నాచారం), జనవరి 20, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు రోడ్డు మీద బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. నాచారం ఢిల్లి పబ్లిక్ స్కూల్ ఆవరణలో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్కు ప్రారంభోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రవాణామంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, డిపిఎస్ సంస్థ నిర్వాహకులు, చైర్మన్ మల్కా కొమ రయ్య, డైరెక్టర్ పల్లవి, సీఈవో, డైరెక్టర్ యశస్వి మల్కా, డైరెక్టర్ త్రిభువన, సీనియర్ ప్రిన్సిపల్, డైరెక్టర్ సునీతా రావు తదితరులు కలిసి సోమవారం ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ ఇది కేవలం భద్రత కాదు, 'రోడ్ బాధ్యత' అని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోడ్డు మీద బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు స్కూళ్లలో చేపట్టడం చాలా ముఖ్యమని, ఒక జీవితాన్ని కూడా రక్షించగలిగితే అది స్ఫూర్తిదాయకమని చెప్పారు. డిపిఎస్ నాచారం పాఠశాల ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మంచి పని చేస్తున్నదని ఆయన ప్రశంసించారు. జై జవాన్, జై కిసాన్ నినాదాలతో పాటుగా జై విజ్ఞాన్, జై కిసాన్ డిపిఎస్ విద్యార్థులు ట్రాఫిక్ పార్క్ కార్యకలాపాలను ప్రత్యక్షంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

**ట్రాఫిక్ పార్కు ప్రతి పాఠశాలలో అవసరం: మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రతి స్కూల్లో నిర్వహించాలన్నారు. విద్యార్థులు తమ కుటుంబాలల్లో ఈ అవగాహన కార్యక్రమాన్ని విస్తరించడానికి ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపి ఇటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, పట్నం మహేందర్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, స్కూల్ చెర్మన్ మల్కా కొమురయ్య, జిల్లా కలెక్టర్ గౌతమ్, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి రవాణా శాఖ ఉన్నతాధికారులు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు

## ఒకే ఓటు, ఒకే ఎన్నిక విధానంతో ప్రాంతీయ పార్టీలకు ముప్పు

### రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి చట్టం తేవాలి

### సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర. రాష్ట్ర విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రజాస్వామ్య పరిరక్షణకై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం సిపిఎం కార్మిక, కర్షక నూతన భవానిన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాల ద్వారా లేబర్ చట్టాలను సాధించుకుంటే వాటిని కుదించి నాలుగు చట్టాలు తీసుకరావడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. కేంద్రం తీసుకవచ్చే చట్టాలను తిప్పికొట్టడానికి కార్మికులు కలిసికట్టుగా ఉద్యమాలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకే ఓటు ఒకే ఎన్నిక విధానాన్ని తీసుకరావడానికి ప్రయత్నిస్తుందని దీంతో ప్రాంతీయ పార్టీలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి చట్టం తేవాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి అవసరమైతే కోర్టు వెళ్తాం లేదంటే నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అత్యాచారాలు, అక్రమాలు పెరిగిపోతున్నాయన్నారు.


తిరుపతి తొక్కిసలాట ఘటనలో గాయపడిన జిల్లెలగూడ పోరెడ్డి బుచ్చమ్మకు రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న టిటిడి ధర్మకర్తలు పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి

## తిరుపతి తొక్కిసలాట బాధితురాలికి నష్టపరిహారం రూ. 2 లక్షలు అందజేత

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జనవరి 20, ప్రభాతవార్త:** తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కోసం టిటిడి వారు తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రం వద్ద ఈ నెల 8వ తేదీన రాత్రి జరిగిన తొక్కిసలాటలో గాయపడిన హైదరాబాద్ నగర శివార్లలోని జిల్లెలగూడకు చెందిన బాధితురాలు పోరెడ్డి బుచ్చమ్మకు రూ.2 లక్షల నష్టపరిహారం చెక్కును టిటిడి అందజేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిస లాటలో 6 మంది దుర్మరణం చెంది 51 మంది గాయపడిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే గాయపడిన బాధితుల్లో మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన పోరెడ్డి బుచ్చమ్మ ఉన్నారు. ఆనాడు జరిగిన తొక్కిసలాటలో ఆమె గాయపడి అక్కడ చికిత్స కూడా తీసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలైన కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి సోమవారం జిల్లెలగూడలోని ఓల్డ్ వెంకటేశ్వర కాలనీలో ఉంటున్న బుచ్చమ్మ నివాసానికి వచ్చి టిటిడి తరపున రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

# అన్నప్రసాదంలో అదనంగా మసాల వడ - ప్రయోగాత్మకంగా వడ్డింపు!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** "అన్నం పరబ్రహ్మస్వరూపం"గా భావిస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం చాలాకాలం తరువాత అదనపు మెనూగా మసాల వడ వడ్డించాలని నిర్ణయించింది. ఈ మెనూను ఫిబ్రవరి 4వతేదీ రథసప్తమి పర్వదినం నుండి భక్తులకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో చేర్చాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు గత పాలకమండలి సమావేశంలోనే నిర్ణయించారు. ప్రస్తుతం రెండురోజులుగా 5వేల వరకు మసాలవడలు తయారుచేసి భక్తులకు మెనూలో అందిస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో నిరంతరాయంగా ఉదయం 9గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ)ని రుచికరంగా వడ్డిస్తున్న విషయం తెలిసిందే. రోజువారీగా తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకుంటున్నా 80వేలమంది భక్తులు ఇష్టదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. అయితే ఒకలక్షనుండి 1.20లక్షలమంది వరకు భక్తులు ప్రతిరోజూఅన్నప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు టిటిడి అధికారుల గణాంకాలు. ఈ నేపథ్యంలో దాతలు కూడా అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరివిగా విరాళాలందిస్తున్నారు. ప్రస్తుతం 2వేలకోట్లరూపాయలపైగానే ఎస్వీ అన్నప్రసాదంట్రస్టుకు నిధులు డిపాజిట్లురూపంలో ఉన్నాయి. దీనిద్వారా వచ్చే వడ్డీతోనే ప్రతిరోజూ తిరుమలలో భక్తులకు నాణ్యమైన రుచికరంగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తుండటం విదితమే. గత ఆరునెలల్లో వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో కూడా వంటసామాగ్రి, పాత్రలు, యంత్రాలను పాతవాటిని తొలగించి కొత్తవి ఏర్పాటుచేయించారు. అంతేగాక టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రముఖ చెఫ్‌ల సూచనలు తీసుకుని అన్నప్రసాదాలను ఎంతో నాణ్యతగా తయారుచేయించి భక్తులకు అందిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఏర్పాటైన టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, సభ్యులు, టిటిడి అధికారులు భక్తుల నుండి అభిప్రాయ సేకరణ చేపట్టి అన్నప్రసాదం మెనూలో మార్పులు చేస్తున్నారు. తాజాగా ఉల్లిపాయలు, వెల్లుల్లిలేకుండా మసాలవడలు ఐదవరకంగా భక్తులకు మెనూలో చేర్చాలని నిర్ణయించారు. ఆ దిశగా కార్యాచరణ సిద్ధం చేశారు. సోమవారం సాయంత్రం ప్రయోగాత్మకంగా అన్నప్రసాదం భవనంలో భోజనంతోబాటు మసాలవడలు క్యాటరింగ్ సిబ్బంది తయారుచేసి భక్తులకు వడ్డించారు. ఇవీ రుచికరంగా ఉన్నట్లు భక్తుల నుండి సంతృప్తికర అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నూతన మెనూను ఫిబ్రవరి 4వతేదీ రథసప్తమిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు అన్నప్రసాదాలను భక్తివిశ్వాసంతో స్వీకరిస్తున్నారు.



## బియ్యంతోపాటు నిత్యావసరాల సరఫరాకు కసరత్తు

### ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్

**హైదరాబాద్, జనవరి 20,ప్రభాతవార్త:** చౌకధరల దుకాణంలో రేషన్ బియ్యం తో పాటు నిత్యావసర సరుకులు కూడా పేదలకు సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తున్నదని బిఆర్ఎస్ సన్నాసులు అభివృద్ధి, సంక్షేమం అంటే ఏంటో చూడండని విప్ రామచంద్ర నాయక్‌అన్నారు. సోమవారం సిఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, హామీలు సమపాళ్లలో అమలు చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందని ఆయన చెప్పారు. బిఆర్ఎస్ నేతలు ప్రజలను పక్కదారి పట్టించేందుకు తోక తెగిన నక్కల్లా గాయి చేస్తున్నారని దుయ్యబట్టారు. పదేళ్లలో ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డులు, పెన్షన్ ఇచ్చారా..? అని ఆయన నిలదీశారు.

బిఆర్ఎస్ పాలనలో దేశంలో నే ఆత్మహత్యల్లో తెలంగాణ అగ్రభాగాన ఉన్నప్పుడు హరీష్ రావు, కేటీఆర్ నోరు మెదపలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని దుయ్యబట్టారు. మిమ్మల్ని ప్రజలు నమ్మబోరు అని జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ నేతలను గ్రామాల నుంచి ప్రజలు తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీసుకున్న ప్రతి కార్యాచరణకు అడ్డంకులు సృష్టించి రాద్ధాంతం చేస్తున్నారని ఆవేదన చెందారు.

## బిసిలకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో ఢిల్లీలో ఒబిసి జాతీయ సదస్సు: ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో జాతీయ నాయకుడు గుజ్జ కృష్ణ, ఎపి సంఘం అధ్యక్షుడు బోను దుర్గానరేశ్‌యాదవ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** బి.సిలకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ బిసి వర్గాల డిమాండ్‌పై ఫిబ్రవరి 6,7వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేసి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుండి వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, బిసి అగ్రనేతలు పెద్ద ఎత్తున పోల్గొంటారని తెలిపారు. ఈ ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం నగరంలో ఆర్. కృష్ణయ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి బోను దుర్గా నరేశ్, గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించారు. ఆ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లా డుతూ అన్ని రాజకీయ పార్టీలు బి సి లను ఓటు బ్యాంకుగా వాడు కుం టున్నారు. 75 సంవ త్సరాల కాలంలో 121 సార్లు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో పెట్టారు కానీ బీసీలకు రాజ్యాధికారం లో వాటా కల్పించడానికి పార్లమెం టులో బీసీ బిల్లు పెట్టలేదు' అని అన్నారు. బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలని, త్వరలో జరుపబోయే జనాభా గణనలో కులాల వారి లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు.

## కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు కెసిఆర్, హరీశ్‌రావు వల్లే అన్యాయం

### కెఆర్‌డబ్ల్యుటి-2 అంశంపై హరీశ్‌రావు చిల్లర రాజకీయాలు

### నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** కెసిఆర్ పాలనలో కృష్ణా జలాల నీటి వాటాల్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నీటిపారుదల శాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పోతిరెడ్డి పాడు, రాయసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ కళ్లు మూసుకుని ఉన్నారని దుయ్యబట్టారు.. కృష్ణ ట్రిబ్యునల్ లో అంశపై హరీష్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హరీష్ రావు దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారని ఆవేదనచెందారు. అధికారంలో ఉండి బిఆర్ఎస్ మోసం చేసింది ఇప్పుడు మేము మన ప్రాంతానికి దక్కాల్సిన నదిజలాల వాట సాధించడానికి ప్రయత్నం చేస్తుంటే అడ్డుకుంటున్నారని అయనఅన్నారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణాబెసిన్ ఆవలకు పంపే నీటికి ఆమోదం తెలపుతూ మన గొంతును కోస్తూ ఇక్కడి అవసరాలను కాలరాజేసి ఆంధ్రావారి మెప్పుకోసం వారికి 515టిఎంసిల నీటిని దారాదత్తం చేస్తూ కేసీఆర్ హరీష్ రావు లిఖిత పూర్వకంగా సంతకాలు పెట్టారని ఆయన విమర్శించారు.

మన తెలంగాణకు సహజ న్యాయసూత్రాల ప్రకారం 70శాతం నీటివాటా రావాల్సి ఉండగా కేవలం 298 టిఎంసి కి సంతకాలు చేసిన డాక్యుమెంట్స్ ఉన్నాయి ఆయన తెలిపారు. కృష్ణాజలాలలో ఇంత తక్కువ వాటా పొందడానికి ఆమోదం తెలపడం వల్ల వారికి కలిగిన ఆర్థిక ప్రయోజనం ఏమిటోకానీ తెలంగాణ గడ్డకు నీరు దక్కకుండా పోయిందని ఆవేదన చెందారు. కొత్త రేషన్ విషయంలో ప్రతిపక్షాల దుష్ప్రచారం చేస్తున్నారు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ అన్నారు .అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని ఆయన తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. ఆహార భద్రత చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే మంత్రిప్రస్తుతం 90లక్షల కార్డులు 2 కోట్ల 80 వేల మంది ఉన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో 60వేలు మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చారు. ప్రజా పాలన, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిశీలన చేస్తున్నాం. లిస్ట్ లో పేర్లు రాని వాళ్లు ప్రజావాణి, గ్రామ సభల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

# మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

### మైలారం గ్రామస్తుల ఆందోళన

### పోలీసులతో వాగ్వాదం.. పురుగుమందు డబ్బాలతో హెచ్చరిక

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 20, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా బాల్మూర్ మండలం మైలారం గ్రామంలోని సర్వే 121 లోని భూమిలో క్వర్జ్ తవ్వకాలకు కేటాయించిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. గ్రామంలోని సర్వే నంబర్ 121 లో 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో గుట్టగా ఉన్న 35 ఎకరాలను క్వార్జ్ తవ్వకాల కోసం మైనింగ్ శాఖ కొందరికి అనుమతులు ఇచ్చింది. కొద్ది రోజుల నుంచి అక్కడ తవ్వకాల ప్రక్రియ మొదలైంది. కాగా మైనింగ్ వలన ప్రకృతి సహజ సంపదతో పాటు.. తమ భూములు, ఇల్లు దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ నిరసనను పౌర హక్కుల నేతలు హరగోపాల్, గద్దం లక్ష్మణ్‌ను ఆహ్వానించారు. అలాగే గ్రామంలోకి అధికారులు, మైనింగ్ నిర్వాహకులు రాకుండా గ్రామంలోని రోడ్డుపై ముళ్ల కంచె, రాళ్లు అడ్డుగాపెట్టి నిరసన వ్యక్తం చేశారు. సిఐ రవీందర్, ఎస్ఐ రమాదేవి గ్రామానికి వెళ్లి ప్రజలకు నచ్చ జెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో కొందరిని అక్కడి నుంచి తరలించారు. దీంతో కొంతమంది మహిళలు పురుగుమందు డబ్బాలు తీసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం నేతలను వెల్దండ వద్ద పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు.


షాద్‌నగర్ గ్రంథాలయ సభలో ప్రసంగిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## ప్రతి ఇంట్లో గ్రంథాలయం ఉండాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావు

### షాద్‌నగర్ గ్రంథాలయానికి రూ.5 లక్షలు కేటాయింపు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 20 :** సామాజిక మాధ్యమాలతో మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతున్నదని, సంస్కారంలేని విధానాలతో అనర్థాలు ఏర్పడుతు న్నాయని, వీటిని పారదోలాలంటే విద్యతోపాటు సంస్కారం నేర్పాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ గ్రేడ్-1 శాఖ గ్రంథాలయ నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభకు మంత్రి జూపల్లి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మధు సూదన్‌రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కె.మదన్‌మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్‌లుగా నక్క బాల్‌రాజ్, వీరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్యాసెట్ శ్రీను, తదితర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సభను ఉద్దేశించి మంత్రి జూపల్లి ప్రసంగిస్తూ సంస్కారం లేని జీవితం వ్యర్థమని, సమాజంలో చదువుకోకపోతే వినాశనం తప్పదని అన్నారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయంతో పాటు ప్రతి ఇంట్లో కూడా ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాద్‌నగర్ గ్రంథాలయానికి తన శాఖ ద్వారా రూ.5 లక్షలను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా డాక్టర్ రామకృష్ణ సైతం ఒక లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ చరిత్రను సృష్టించగల సత్తా గ్రంథాలయాలదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రను మార్చిన ఘనత గ్రంథాలయాలకు కూడా ఉందన్నారు. గ్రంథాలయాల్లో 75 ఏళ్ల పూర్తి చేసుకున్న రాజ్యాంగంపై పౌరులకు బోధించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పదవులు ముఖ్యం కాదని, సేవచేసే సత్తా ఉంటేనే పదవులు చేపట్టాలన్నారు.

# జీతాలు చెల్లించండి మహాప్రభో

### ఇఎన్‌సి జనరల్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్న ఎఇఇలు


**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా నీటిపారుదల శాఖ నియామకమై నాలుగు నెలలు గడుస్తున్నా మాకు జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికపరంగా ఇబ్బందులకు గురవుతున్నామని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రశాంత్‌పాటిల్, సిఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఇఎన్‌సి అనిల్‌కుమార్‌ను కలిసి వేతనాలు రాకపోవడంతో పరాయి ఊళ్లలో నివాసం ఉంటూ అనేక బాధలు పడుతున్నామని, కనీసం ఇంటి అద్దెలు కూడా చెల్లించుకోలేకపోతున్నామని వివరించారు. ప్రసిడెన్షనల్ ఆర్డర్ ప్రకారం స్థానిక మల్టి జోనల్లలో మాకు పోస్టింగ్ ఇవ్వాలని వారు కోరారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా ఇతర జోన్‌లో పోస్టింగ్ ఇవ్వడంతో పేఅండ్‌అకౌంట్స్ డిపార్టుమెంట్ అకౌంట్స్ విభాగం సాకుగా చూపుతూ తొలుత జీతాలు నిలిపివేసింది.

రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా ఏ నిర్ణయం తెలుపక జిడిఎకు వివరణ కోసం పంపి మా జీతాలపై ఏ నిర్ణయం ప్రకటించకత్రిశంకు స్వర్గంలో నిలిపిందని వారు ఆవేదన చెందారు.. యువ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల నియా మకాలు ఉత్తర్వులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు సమక్షంలో సెప్టెంబర్ మూడో వారంలో జల సౌధలో పెద్ద ఎత్తున కార్యక్రమం చేసి ఇచ్చారు. నాలుగు నెల లకు పైగా గడుస్తున్నా, జీతాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొత్తగా రిక్రూట్ అయిన ఎఇఇ లను వెంటనే రాష్ట్రపతి ఉత్తర్వులను అనుసరించి వాళ్ళ స్థానిక మల్టి జోన్లలో పోస్టింగ్ లు ఇచ్చి వాళ్ల జీతాలను తొందరగా వాళ్ళకి విడుదల చేయాలని హైదరాబాదు ఇంజనీర్ల సంఘం. అద్యక్షులు రాపోలు రవీందర్, జనరల్ సెక్రటరీ చక్రధర్ డిమాండ్‌చేశారు. ఎఇఇలకు జీతాలు ఇవ్వాలని పలు సార్లు ప్రభుత్వానికి కూడా విన్నపాలు చేసినము, కానీ కొత్త ఎఇఇ లకు మాత్రం ఇబ్బందులు తప్పట్లేదని ఆవేదన చెందారు. ఇకనైనా వాళ్ళ స్థానిక మల్టి జోన్ లకు పంపి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు కూడా తీసుకోవాలి అని ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని వర్కింగ్ ప్రెసిడెంట్ లు కె రాజశేఖర్, వి రామకృష్ణ, ఆర్ సత్య నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో సంతకాలుచేస్తూ డిమాండ్‌చేశారు. నిలిచిపోయిన నాలుగు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు.

# ఎఫ్‌టిఎల్ నిర్ధారణతోనే సమస్యలకు పరిష్కారం

### నాలుగైదు నెలల్లో ఆ ప్రక్రియ పూర్తి చేస్తాం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** నగరంతోపాటు ఒఆర్‌ఆర్ పరిధిలోని చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టిఎల్) నిర్ధారణ పూర్తయితే చాలావరకు సమస్యలు పరిష్కారమోతాయని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ తెలిపారు. నాలుగైదు నెలల్లో ఒఆర్‌ఆర్ పరిధిలోని అన్ని చెరువులకు ఎలాంటి సందేహాలకు ఆస్కారం లేకుండా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ పూర్తిచేసి భవిష్యత్తులో చెరువుల కబ్జాకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు మొత్తం 89 ఫిర్యాదులను తీసుకున్నారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై వచ్చిన ఫిర్యాదులను అక్కడికక్కడే క్షుణ్ణంగా పరిశీలించి.. గూగుల్ మ్యాప్స్‌తో పాటు సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ ఆర్ ఎస్ సీ(నేషనల్ రిమోట్ సెన్సింగ్) ఇమేజీలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి అందులో వాస్తవాలను వాకబు చేశారు. గతంలో ఆయా చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఎలా ఉండేవి.. హైడ్రా వచ్చిన తర్వాత ఎలా ఉన్నాయనేది గూగుల్ మ్యాప్స్, ఎన్‌ఆర్ఎస్ సీ ఇమేజీలను పరిశీలిస్తామన్నారు. హైడ్రా వచ్చిన తర్వాత వెలసిన నిర్మాణాలను అనుమతులు లేకుంటే కూల్చివేస్తామన్నారు. అమీన్‌పూర్ చుట్టూ అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలోఆమున్సిపాలిటీ పరిధిలో పూర్తి స్థాయి సర్వే చేయిస్తామని తెలిపారు. అలాగే మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోనే మేడికుంట చెరువు 45 ఎకరలా పరిధిలో ఉండేదని.. క్రమేణ కబ్జాలు జరిగి చెరువు కుంచించుకుపోయిందని అక్కడ నివాసం ఉన్న వృద్ధ దంపతులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి నియోజకవర్గంలోని డిఫెన్స్ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన వెయ్యి గజాల స్థలాన్ని స్థానిక ప్రజాప్రతి నిధి కబ్జా చేసుకుంటూ వస్తున్నారని డిఫెన్స్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అలాగే మూసాపేటలోని ఆంజనేయనగర్ రోడ్డు నంబరు 9లో 2 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురి అవుతోందని.. అడ్డుకున్న తమపై దాడికి దిగుతున్నారని స్థానికంగా ఉండే భార్యాభర్తలు వచ్చి ఫిర్యాదు చేశారు. అమీన్ పూర్‌లోని 193 సర్వే నంబర్లో ఉన్న తన భూమిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి, రమేష్ ఇద్దరు కలిసి కబ్జా చేశారని బాధితురాలు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అధికా రాన్ని అడ్డుపెట్టుకుని మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి దౌర్జన్యాలు చేశాడని.. అందుకు సంబంధించిన అన్ని ఆధా రాలు హైడ్రాకు సమర్పించానని ఆమె పేర్కొన్నారు.



ఫిర్యాదుదారుడు తెచ్చిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

21-1pg10.qxd:21-1pg10.qxd 01/01/01 9:01 AM Page 1



# టీమిండియా ఎంపికలో వార్




## జట్టు సెలెక్షన్‌లో ఆధిపత్య పోరు

### గంభీర్, రోహిత్ మధ్య తారస్థాయికి విభేదాలు

**న్యూఢిల్లీ:** ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ జట్టును ఇటీవల ప్రకటించింది. అయితే ఈ టీమిండియా ఎంపిక వెనుక పెద్ద వార్ నడిచిన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా భారత్ జట్టు ఎంపిక విషయలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య ఒకరిపై ఒకరు ఆధిపత్యం చూపించే ప్రయత్నం చేయడంతో ఇరువురి మధ్య మనస్పర్థలు తారాస్థాయికి చేరుకున్నాయని క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆస్ట్రేలియా పర్యటన నుండి కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య మంచి సమన్వయం లేకపోగా, విభేధాలు మరింత తారాస్థాయికి చేరుకున్నాయి. ఇప్పుడు మరోసారి రోహిత్, గంభీర్ మధ్య గొడవ వార్తలు తెరపైకి వస్తున్నాయి. శనివారం ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ, ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ కోసం జట్టు భారత జట్టును ప్రకటించారు. అయితే ఇద్దరు ఆటగాళ్లకు సంబంధించి కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య ముంబైలో సుదీర్ఘ సమావేశం జరిగింది. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన జట్టులో యువ ఓపెనర్ శుభ్‌మాన్ గిల్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతన్ని వైస్ కెప్టెన్‌గా నియమించింది. అయితే, గిల్‌ను వైస్ కెప్టెన్‌గా చేయడానికి గౌతమ్ గంభీర్ అనుకూలంగా లేదని దీనిపై గుర్రుగా ఉన్నట్లు వెల్లడైంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను వన్డే వైస్ కెప్టెన్‌గా నియమించాలని పట్టు పట్టినట్లు తెలుస్తోంది. కానీ అతనికి కెప్టెన్ రోహిత్, సెలెక్టర్ల సపోర్ట్ దొరకలేదు. రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశం తర్వాత రోహిత్, అగార్కర్ ఎవరికి వారే చివరకు తమకు నచ్చినట్లుగానే వ్యవహరించడం విశేషం. దీనిపై ఇరువురి మధ్య వార్ జరిగిన తదుపరి చివరకు శుభ్‌మాన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించడం జరిగింది. గతేడాది జరిగిన టి20 ప్రపంచ కప్‌లో హార్దిక్ పాండ్యా జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ ఈ ఫార్మాట్ నుంచి రిటైర్ అయినప్పుడు, కెప్టెన్సీని హార్దికు అప్పగిస్తారని అనిపించింది. కానీ అది జరగలేదు. ముంబైకి చెందిన సూర్యకుమార్ యాదవ్ టీమిండియా టి20 కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. గంభీర్ కూడా సామ్సన్‌ను జట్టులో ఉంచాలని అనుకుని గట్టి ప్రయత్నం చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి సంజు సామ్సన్‌ను వికెట్ కీపర్‌గా ఎంపిక చేయాలని ప్రధాన కోచ్ గంభీర్ స్పష్టం చేశాడు. కానీ రోహిత్, అగార్కర్ ఎంపిక రిషబ్ పంత్ అని, అందుకే సంజును విస్మరించి అతనిని పక్కన పెట్టడం జరిగింది. గత సంవత్సరం సంజు సామ్సన్ ఓపెనర్‌గా ఆడుతూ, భారతదేశం తరపున వరుసగా రెండు సెంచరీలు సాధించడం ద్వారా సంచలనం సృష్టించాడు. తరువాత అతను మాట్లాడుతూ కోచ్ గంభీర్ తనకు చాలా సహాయం చేశాడని, అతనిపై నమ్మకం పెట్టుకున్నారని చెబుతున్నారు. అంతకుముందు, టి20 ప్రపంచ కప్‌లో సామ్సన్ కూడా జట్టులో భాగమయ్యాడు. కానీ అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు.



## వరల్డ్ ఆర్చరీలో సురేఖకు రజతం

**న్యూఢిల్లీ:** నిమ్ ఆర్చరీ టోర్నీలో భారత్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ పతకాల వేట కొనసాగుతోంది. ఇండోర్ ప్రపంచ సిరీస్‌లో భాగంగా ఫ్రాన్స్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సురేఖ రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఇందులో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సురేఖ రెండో స్థానంలో నిలిచింది. హోరా హోరీగా సాగిన ఫైనల్ పోరులో ఆమె ఒక్క పాయింట్ తేడాతో ఓటమిపాలైంది. తుది పోరులో సురేఖ 146-147 తేడాతో కొలంబియాకు చెందిన అలెగ్జాండ్రా ఉస్క్వియానో చేతిలో పోరాడి పరాజయం చవిచూసింది. ఈ మ్యాచ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ సురేఖ తడపడింది. 28-30, 29-30తో తొలి రెండు సెట్లలో వెనుకబడింది. మూడో సెట్లో 30-29తో మళ్లీ పుంజుకున్నప్పటికీ మరల నాలుగో సెట్లో 29-30తో నిలవడం దెబ్బతీసింది. చివరి సెట్‌కు ముందు ఓవరాల్‌గా 116-119తో నిలిచిన సురేఖ ఆఖరి సెట్లో 30-28తో రెండు పాయింట్లు ఎక్కువగానే సాధించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఒక్క పాయింట్ తేడాతో ప్రపంచ 14వ ర్యాంకర్ అలెజాంద్రా టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో సురేఖ రెండో స్థానంతో సరిపెట్టుకుని రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

## మహిళల తొలి వన్డేలో..
# వెస్టిండీస్ సూపర్ విక్టరీ




**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టుతో జరిగిన తొలి వన్డేలో వెస్టిండీస్ సూపర్ విక్టరీ సాధించింది. ఈ మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో పర్యాటక బంగ్లాదేశ్ జట్టు ఓటమిపాలైంది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ఛాంపియన్‌షిప్-2025లో భాగంగా బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టు వెస్టిండీస్‌లో పర్యటిస్తోంది. ఈ పర్యటనలో ఇరు జట్లు మూడు వన్డేలు, మూడు టి20లు ఆడనున్నాయి. వన్డే సిరీస్‌లో భాగంగా సెయింట్ కిట్స్‌లో తొలి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఆతిథ్య వెస్టిండీస్, పర్యాటక బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. విండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి తమ జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో షర్మిన్ అక్తర్ (42), ముర్షిదా ఖాతూన్ (40), శోభన మోస్తరీ (35), షోమా అక్తర్ (29) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఫర్జానా హక్ (10), కెప్టెన్ నిగర్ సుల్తానా (14), రబేయా ఖాన్ (1), నహిదా అక్తర్ (9), సుల్తానా ఖాతూన్ (2) విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో డియాండ్రా డొట్టిన్ 3 వికెట్లతో చెలరేగగా, ఆలియా అలెన్, హేలీ మాథ్యూస్ తలో 2, అఫీఫ్లెచర్ 1 వికెట్‌ను దక్కించుకున్నారు. అనంతరం బరిలోకిదిగిన వెస్టిండీస్ 31.4 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ అజేయ సెంచరీతో (93 బంతుల్లో 104 పరుగులతో నాటౌట్, 16 ఫోర్లు) విండీస్‌ను విజయతీరాలకు చేర్చింది. క్యియానా జోసఫ్ (79 బంతుల్లో 70 పరుగులు, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించింది. మాథ్యూస్, జోసఫ్ తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 163 పరుగులు జోడించారు. వన్‌డౌన్‌లో వచ్చిన షెర్మైన్ క్యాంప్‌బెల్ 14 పరుగులతో అజేయంగా నిలిచింది. క్వియానా జోసఫ్ వికెట్ రిబేయా ఖాన్‌కు దక్కింది. ఈ గెలుపుతో వెస్టిండీస్ 3 మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. కాగా ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఈ నెల 21వ తేదీన జరగనుంది.




## టాటా స్టీల్ మాస్టర్స్ చెస్‌లో గుకేశ్, అర్జున్ డ్రా

**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో భారత్ స్టార్ గుకేశ్, అర్జున్ రెండో రౌండ్‌లో డ్రా చేసుకున్నాడు. స్లొవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెదోసీవ్‌తో నెదర్లాండ్స్‌లోని విజ్క్ ఆన్ జీలో జరిగిన పోరులో గుకేశ్ పాయింట్ పంచుకున్నాడు. అలాగే ఇరిగేసి అర్జున్ రెండో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. నెదర్లాండ్స్‌కు చెందిన అనీశ్ గిరితో జరిగిన గేమ్‌లో అర్జున్ పాయింట్ సంపాదించాడు. కాగా తొలి రౌండ్‌లో ఇరిగేసి అర్జున్ నిలువరించి అతనిపై పెంటేల హరికృష్ణ గెలిచాడు. ఇక ఆరంభంలో జరిగిన రౌండ్లో నెగ్గిన గుకేశ్ వ్లాదిమిర్ ఫెదోసీవ్‌తో జరిగిన రెండో రౌండ్‌ను డ్రా చేసుకున్నారు.

## మహిళల అండర్ 19 వరల్డ్ కప్‌లో..
# నైజీరియా సంచలన విజయం



### న్యూజిలాండ్‌పై 2 పరుగుల స్వల్ప తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో హిస్టరీలో సంచలన విజయం నమోదైంది. వరల్డ్ క్రికెట్‌లో అత్యంత పటిష్ఠమైన న్యూజిలాండ్ జట్టును పసికూన నైజీరియా ఓడించింది. మహిళల అండర్ 19 వరల్డ్‌కప్-2025లో భాగంగా సోమవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నైజీరియా అమ్మాయిల జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో నెగ్గి చరిత్ర సృష్టించింది. మలేసియా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం న్యూజిలాండ్ నైజీరియా జట్లు తలపడ్డాయి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. దీంతో 20 ఓవర్లు సాగాల్సిన ఆటను నిర్వాహకులు ఇరువైపులా 13 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన నైజీరియా మహిళల జట్టు 13 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ 13 ఓవర్లు ఆడి 6 వికెట్లు నష్టానికి 63 పరుగుల స్కోర్‌కే పరిమితమైంది. అయితే చివరి 6 బంతుల్లో కివీస్ విజయానికి 9 పరుగులు అవసరమయ్యాయి. ఆ సమయంలో లిలియన్ ఉదేహ్ బంతి అందుకుంది. ఆఖరి ఓవర్ అద్భుతంగా బౌలింగ్ చేసి తన జట్టుకు చరిత్రాత్మక విజయం అందించింది. కాగా, అండర్ 19 టీ20 వరల్డ్‌కప్ హిస్టరీలో నైజీరియా జట్టుకు ఇదే తొలి విజయం కావడం విశేషం.

# వాణిజ్యం

# భారత్ ఆర్థిక వ్యవస్థ పైపైకి

**న్యూఢిల్లీ, జనవరి 20:** కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) నిర్వహించిన ఒక సర్వే భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి వివరాలను వెల్లడించింది. సర్వే నివేదిక ప్రకారం, ప్రస్తుత ఆర్థిక వాతావరణం ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలంగా ఉందని 75% కంపెనీలు భావిస్తున్నాయి. భౌగోళిక- రాజకీయ అనిశ్చితులు, అంతరాయం కలిగించిన సరఫరాల ద్వారా ఎదురయ్యే సవాళ్లు ఉన్నప్పటికీ, భారతదేశంలో పెట్టుబడుల పట్ల ఈ సానుకూల సెంటిమెంట్ అలాగే ఉంది. సర్వేలో పాల్గొన్న 70శాతం కంపెనీలు 2026లో పెట్టుబడులు పెట్టనున్నాయని, అందుకే రాబోయే కొద్ది త్రైమాసికాల్లో ప్రైవేట్ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీతెలిపారు. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు, ఉపాధి, వేతన ధోరణులలో వృద్ధిని అంచనా వేయడానికి సిఐఐ పరిశ్రమ సర్వేను ప్రారంభించింది.




ఆర్థిక వృద్ధితో పాటు ఉద్యోగాల కల్పన కూడా ఇటీవలి విధాన చర్చలలో కేంద్రంగా ఉంది. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని దాదాపు 97శాతం సంస్థలు భావిస్తున్నాయని సర్వే ప్రాథమిక ఫలితాలు చూపిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న 79శాతం కంపెనీలు గత మూడేళ్లలో తమ శ్రామిక శక్తిని పెంచుకున్నట్లు తెలిపాయి. 2025-25 ఆర్థిక సంవత్సరంలో ఆశించిన ఉపాధివృద్ధికి సంబంధించిన ప్రశ్నపై, దాదాపు 97శాతం కంపెనీలు ఉపాధిని పెంచుతాయని భావిస్తున్నట్లు సూచించాయి. 42 నుంచి 46శాతం సంస్థలు ఉపాధిలో 10నుంచి 20శాతం పెరుగుదలను సూచించాయి. 31శాతం నుంచి 36శాతం మంది ఉద్యోగాలు 10శాతం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. సిఐఐ యొక్క సర్వే నివేదిక ప్రకారం వచ్చేయేడాది తయారీ, సేవా రంగాలలో ప్రత్యక్ష ఉపాధి వృద్ధి 15 నుంచి 22శాతం ఉండవచ్చు. అయితే పరోక్ష ఉపాధి వృద్ధి 14శాతంఉండవచ్చు. సీనియర్ మేనేజ్‌మెంట్ పోస్టుల భర్తీలో సవాళ్లను కూడా సర్వే వెల్లడించింది. సీనియర్ మేనేజ్‌మెంట్ స్థానాలనుభర్తీ చేయడానికి ఒకటి నుంచి 6 నెలల మధ్య సమయం పడుతుందని సర్వే చేసిన చాలాసంస్థలు నివేదించాయి. రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులకు ఖాళీలను భర్తీ చేయడానికి తక్కువ సమయం అవసరం.

## అదానీ కేసులో వాదనలకు న్యాయ సంస్థలు రెడీ


**ముంబై, జనవరి 20:** అదానీగ్రూప్ ఇటీవల అమెరికాలో తనపై వచ్చిన ఆరోపణలను న్యాయబద్ధంగా ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఈమేరకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్, ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ దాఖలు చేసిన సివిల్, క్రిమినల్ కేసులను నిర్వహించడానికి కిర్క్లాండ్ అండ్ ఎల్లిస్, క్విన్ ఇమ్మాన్యుయేల్ ఉర్కుహార్ట్ అండ్ సుల్లివాన్ ఎల్ఎల్‌పి అనే న్యాయసంస్థలను అదానీగ్రూప్ నియమించింది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 250 మిలియన్ డాలర్లకుపైగా లంచాలు చెల్లించిందన్న ఆరోపణలున్నాయి. దాంతో అమెరికాలోని పెట్టుబడిదారులు కూడా ఎజిఆర్ఎల్‌లో ఇన్వెస్ట్ చేయడంతో కంపెనీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి అమెరికాలోని ఎస్ఇసి, ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ ప్రాథమిక దర్యాప్తు జరిపి సివిల్, క్రిమినల్ కేసులు పెట్టింది. వాటిని ఎదుర్కొనేందుకు అదానీ గ్రూప్ తాజాగా రెండు సంస్థలను నియమించింది. ఇవి కంపెనీపై వచ్చిన ఆరోపణలపై న్యాయబద్ధంగా అక్కడి కోర్టుల్లో సమాధానం చెప్పనున్నాయి. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా




(ఎస్ఇసిఐ) నుంచి కాంట్రాక్టులు పొందడానికి ఎజిఇఎల్‌కు అనైతికంగా సాయపడడానికి భారత అధికారులకు లంచం ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దాంతో అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ, ఇతర ఎగ్జిక్యూటివ్‌లపై 2024 నవంబరు 21న అమెరికా అధికారులు అభియోగాలు మోపారు. ఈ ఆరోపణలు ఉన్నప్పటికీ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వినీత్ ఎస్ జైన్‌లపై యుఎస్ ఫారిన్ కరప్షన్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సిపిఎ) ఉల్లంఘనలకు సంబంధించి అభియోగాలు మోపలేదని ఎజిఇఎల్ నొక్కి చెప్పింది. షికాగోలో ప్రధాన కార్యాలయం ఉన్న కిర్క్లాండ్‌అండ్‌ఎల్లిస్ అధికంగా వాణిజ్య వివాదాలు, మేధో సంపత్తి వ్యాజ్యాలు, వైట్-కాలర్ కేసుల్లో ప్రత్యేకత కలిగి ఉంది.

## లంచం ఆరోపణలపై మోతీలాల్ ఓస్వాల్ స్పందన

**ముంబై, జనవరి 20:** మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కల్యాణ్ జ్యుయెలర్స్‌లో పెట్టుబడులకు సంబంధించి సోషల్ మీడియా వేదికగా లంచం ఆరోపణలు ఎదుర్కొంటుంది. వీటిపై కంపెనీ స్పందించింది. ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఇవి నిరాధారమైనవని, దురుద్దేశపూరితమైనవని, పరువు నష్టం కలిగించేవిగా పేర్కొంది. కల్యాణ్ జ్యుయెలర్స్‌లో గణనీయమైన పెట్టుబడులు పెట్టడానికి ఎంఒఎఎంసి అధికారులు లంచం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ పుకార్లు కల్యాణ్ జ్యుయెలర్స్ షేరు గణనీయంగా పతనం కావడానికి కారణమైంది. ఇది గత రెండు వారాల్లో సుమారు 37శాతం క్షీణించింది. ఈ తరుణంలో కంపెనీ స్పందించింది. ఈ ఆరోపణలను ఖండిస్తూ మోతీలాల్‌ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఒక ప్రకటన విడుదల చేసింది. స్వార్థ ప్రయోజనాలున్న వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తమ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పింది. ఇటీవల వచ్చిన లంచం ఆరోపణలు కూడా ఇందులో భాగమేనని స్పష్టం చేసింది. వీటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. సమగ్రతకు, అత్యున్నత ప్రమాణాలు నిర్వహించడానికి కంపెనీ నిబద్ధతతో ఉంటుందని పేర్కొంది. ఈ నిరాధార ఆరోపణల వల్ల దశాబ్దాలుగా సంస్థ, నాయకత్వం నిర్మించుకున్న మంచి పేరును చెడగొట్టడానికి స్వార్థ ప్రయోజనాలు ఉన్న వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. విశ్వసనీయ, అధికారికంగా ధ్రువీకరించిన సమాచార వనరులపైనే ఆధారపడాలని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వాటాదారులందరినీ కోరింది.




## లక్ష్మీ డెంటల్ 23% ప్రీమియంతో లిస్టింగ్

**ముంబై, జనవరి 20:** సోమ వారం లక్ష్మీ డెంటల్ లిమిటెడ్ ఐపిఒ షేర్ మార్కెట్‌లో మంచి ఎంట్రీ ఇచ్చింది. 27 శాతం కంటే ఎక్కువ ప్రీమియంతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ అయిన తర్వాత లక్ష్మీ డెంటల్ దాని ఐపిఒ ధర రూ. 428 మించి 33 శాతం పెరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లక్ష్మీ డెంటల్ షేర్లు దాదాపు 27 శాతం ప్రీమియంతో ఒక్కో షేరుకు రూ.542 చొప్పున ట్రేడవుతున్నాయి. బిఎస్ఇలో ఈ స్టాక్ ఐపిఒ ధర కంటే 23.36 శాతం పెరుగుదలను సూచిస్తూ రూ.528 వద్ద ప్రారంభమైంది. లక్ష్మి డెంటల్ షేర్లు లిస్టింగ్ అయిన గంటలో మరో 6 శాతం లాభపడ్డాయి. షేర్లు ఒక్కో షేరుకు రూ. 428 ఐపీఓ ధర నుంచి 32.64 శాతం పెరిగి రూ.567.70 వద్ద ట్రేడవుతున్నాయి. ఇదిలా ఉండగా ఆ సమయంలో షేరు గరిష్టంగా రూ.584ను తాకింది. పబ్లిక్ ఆఫర్ కోసం బిడ్ వేయడానికి పెట్టుబడి దారులు మొగ్గు చూపడంతో లక్ష్మీ డెంటల్ ఐపిఒ 3రోజుల వేలం ప్రక్రియ ద్వారా బలమైన సబ్‌స్క్రిప్షన్ చూసింది. ఈ ఐపీఓకు మొత్తంగా 114 బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్లు మంచి ఆసక్తిని కనబరిచారు ఇంకా వీరికి కేటాయించిన షేర్ల కంటే 75 రెట్లు ఎక్కువ బిడ్ వేశారు. సంస్థాగత పార్టిసిపెంట్లలో క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ వారి వాటా కంటే 110 రెట్లు ఎక్కువ ధరకు బిడ్ చేశారు. అధిక నికర విలువ కలిగిన నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ రెండు గ్రూపులను అధిగమించారు, వీరికి కేటాయించిన షేర్ల కంటే దాదాపు 148 రెట్లు బిడ్ వేశారు. గ్రే మార్కెట్‌లో అద్భుతమైన స్పందన ఈ ఐపిఒ పెట్టుబడిదారుల నుండి అద్భుతమైన స్పందన పొందింది. అలాగే 114.42 సార్లు సబ్‌స్క్రిప్షన్ పొందింది. లిస్టింగ్ ముందు ఈఐపిఒ గ్రే మార్కెట్‌లో ట్రెండ్ అయ్యింది. అయితే లిస్టింగ్‌కు ఒక రోజు ముందు అంటే ఆదివారం దాని గ్రే మార్కెట్ ప్రీమియం రూ.145. అంటే, గ్రే మార్కెట్ ప్రకారం 33.88శాతం ప్రీమియంతో రూ.573 వద్ద లిస్ట్ చేసి ఉండవచ్చు. అయితే, లిస్టింగ్ జిఎంపి కంటే కొంచెం తక్కువ ప్రీమియంతో జరిగింది. కంపెనీ లోన్స్ తిరిగి చెల్లించడానికి ఐపిఒ నుండి వచ్చిన డబ్బులో కొంత భాగాన్ని ఉప యోగిస్తుంది. కొత్త మెషినరీ కొనుగోలుకు కూడా కంపెనీ కొంత మొత్తాన్ని వెచ్చిస్తుంది. అంతేకాకుండా, కంపెనీ దాని అనుబంధ కంపెనీలో కూడా పెట్టుబడి పెట్టనుంది. మిగిలిన మొత్తం సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం కూడా ఉపయోగించబడుతుంది.




## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో బెంచ్‌మార్క్ సూచీలు రాణించాయి. ఇంట్రాడేలో దాదాపు 700 పాయింట్ల మేర సెన్సెక్స్ లాభపడగా, నిఫ్టీ 23,300 పాయింట్ల ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 76,978.53 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,584.84- 77,318.94 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి సెన్సెక్స్ 545.11 పాయింట్ల లాభంతో 77,073.44 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 141.55 పాయింట్ల లాభంతో 23,344.75 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.55 వద్ద నిలిచింది. కోటాక్ మహీంద్రా బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టిపిసి, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. జొమాటో, అదానీ పోర్ట్స్, టిసిఎస్, మహీంద్రా అండ్‌మహీంద్రా, మారుతి సుజుకి వంటి షేర్లు నష్టాల్లో ముగి సాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 80 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 2760 డాలర్ల వద్ద కొనసాగింది.



## 'నో సిగ్నల్' ప్రసక్తే లేదు..

**ముంబై, జనవరి 20:** దేశంలో మొబైల్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ మారుమూల గ్రామాల్లో ఇప్పటికీ సిగ్నల్ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఏదో ఒక నెట్‌వర్క్ సిగ్నల్ మాత్రమే వస్తుంది. వేరే నెట్‌వర్క్ సిమ్‌కార్డు వాడితే ఆ ఫోన్ మూగబోయినట్లే. ఒకపై మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఇంట్రా సర్కిల్ రోమింగ్ సేవలను తాజాగా కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ సిమ్ కార్డులు వినియోగదారులు డిజిటల్ భారత్ నిధి కింద ఏర్పాటైన టవర్ల ద్వారా 4జి సేవలను పొందొచ్చు. దేశంలో గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలికం సేవలు అందించాలన్న ఉద్దేశంతో డిజిటల్ భారత్ నిధి కార్యక్రమాన్ని కేంద్రం తీసుకొచ్చింది. ఇంతకుముందు యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్‌గా దీన్ని వ్యవహరించే



వారు. దీన్నే డిజిటల్ భారత్ నిధిగా మార్పు చేశారు. ఇలా డిబిఎన్ నిధులతో ఏర్పాటైన టవర్లు, ఆయా టెలికం సర్వీసు ప్రొవైడరుకు చెందిన వినియోగదారులకే సేవలించేవి. ఈ నేపథ్యంలో టెలికం మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఇంట్రా సర్కిల్ రోమింగ్ సేవలను తాజాగా ప్రారంభించారు. డిబిఎన్ నిధులతో ఏర్పాటైన మౌలిక సదుపాయాలను పంచుకోవడానికి బిఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో ముందుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. దీని వల్ల వేర్వేరు నెట్‌వర్క్‌కు వేర్వేరు టవర్ల అవసరం లేకుండా, ఒకే టవర్ ద్వారా ఆయా టెలికం సంస్థల వినియోగదారులు 4జి సేవలను పొందొచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా డిబిఎన్ నిధులతో ఏర్పాటైన టవర్లు దాదాపు 27 వేల టవర్లు ఉన్నాయని, 35,400 మారుమూల గ్రామాలు దీనివల్ల లబ్ధి పొందనున్నాయని చెప్పారు. కేవలం డిబిఎన్ నిధులతో ఏర్పాటైన టవర్ల వరకు మాత్రమే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps